thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 193 కరీంనగర్ శనివారం, 20 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## అనిల్ అంబానీ రాణా కపూర్‌లపై సీబీఐ చార్జిషీటు

న్యూఢిల్లీ : అనిల్ ధీరూబాయ్ అంబానీ (ఏడీఏ) గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీ, యస్ బ్యాంకు మాజీ సీఈఓ రాణా కపూర్‌లపై సీబీఐ ముంబయి ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇద్దరూ కుమ్మక్కయి రూ. 2,796 కోట్ల బ్యాంకు నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించింది. రాణా కపూర్ భార్య బిందు కపూర్, కుమార్తెలు రాధా కపూర్, రోషిణీ కపూర్‌లపై కూడా అభియోగ పత్రాలను సమర్పించింది. అనిల్ అంబానీ గ్రూపు పరిశ్రమలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసినప్పటికీ, వాటిపై ఆర్థిక సంస్థలు కన్నేసి ఉంచినప్పటికీ యస్ బ్యాంకు తరఫున భారీగా పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపించింది. ఈ విషయంలో సీఈఓగా రాణా కపూర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొంది. ప్రతి ఫలంగా రాణా కపూర్ కుటుంబ సభ్యుల కంపెనీల్లో అనిల్ అంబానీ గ్రూపు కంపెనీలు పెట్టుబడులు పెట్టాయని తెలిపింది. ఇదంతా నీకిది-నాకిది తరహాలో సాగిందని ఆరోపించింది.

# మల్లోజుల లేఖ ముమ్మాటికి నిజమే.!




भारत की कम्युनिस्ट पार्टी (माओवादी)
केंद्रीय कमेटी
प्रेस विज्ञप्ति
दि. 15 अगस्त, 2025
हथियारबंद संघर्ष को अस्थाई रूप से त्याग कर

## -50 ఏళ్ల బాధలను ఆవిష్కరించిన సోనుదాదా
## - సాయుధ పోరాటం కంటే లీగల్ వైపు మొగ్గు
## -2011 నుండి పురోగమించ లేక పోవడం
## -నష్టాలు పూడ్చుకోలేనివి,మారిన సమాజ పరిస్థితుల అంచనాలో విఫలం
## అవి సోనుదాడా అభిప్రాయాలంటూ జగన్ వివరణ

**మొహమ్మద్ ఇమ్రాన్ ఎడిటర్**

దక్షణ భారత దేశంలో సంచలనం సృష్టించిన అభయ్ ఏసోనుదాడా ఏమల్లోజుల వేణుగోపాల్ రాసిన లేఖ ఆధారంగా చూస్తే మావోయిస్ట్ పార్టీలో నేతలమధ్య తీవ్రమైన ఒత్తిళ్ల ఉన్నాయని తెలుస్తోంది.ఒకటి రెండు రోజుల నుంచి అనేక మంది మేధావులు లేఖను నిర్ధారించారు.సోనూ తన అభిప్రాయాన్ని,నిర్ణయాన్ని మావోయిస్టు టాప్ నేతలకు అందించినట్టు సమాచారం. పార్టీ లో సాయుధపోరాట అంశంపై అనేక ప్రశ్నలు సంఘర్షణలు ఉన్నాయి. 50 ఏళ్ల సుదీర్ఘ యుద్ధంలో పాల్గొన్న వారిలో అమరుల త్యాగాలచరిత్రను కాదనలేని వాస్తవం.ఇప్పుడు యు టర్న్ తీసుకొని ప్రజల మధ్యకు వచ్చి పోరాటం చేయాలని సోను తన లేఖలో పిలుపునిచ్చారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మావో నేత జగన్ సాయుధ పోరాటానికి విరమణ అభయ్ వ్యక్తి గత నిర్ణయమని తెలిపారు.అంటే జగన్ లేఖ ద్వారా సోనూ లేఖగా తేలిపోయింది..ఇంతకు 55 ఏళ్ళు మావోయిస్టు పార్టీ పై ఏమీ అన్నారంటే....లేఖ సంపూర్ణంగా చదవండి

**ప్రియమైన ప్రజలారా, లాల్ సలాం**

గత 20 మాసాలకు పైగా భారత దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న 'చుట్టుముట్టి మట్టుబెట్టే' దాడులను మనమంతా అసమాన త్యాగాలతో ఎదుర్కొంటున్నాం. ఈ దాడులలో మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు సహ వందలాది మంది కామ్రేడ్ను, విప్లవ ప్రజా సంఘాల, ప్రజా మిలీషియా, జనతన సర్కార్ల కార్యకర్తలను, విప్లవ ప్రజలనూ కోల్పోయాం. తెరిపి లేకుండా కొనసాగిస్తున్న నరసంహారాలలో ఆడ-మగ, పిల్లలు-వృద్ధులు అనే తేడా లేకుండా మనం ఒక్కొక్క దాడిలో పదుల సంఖ్యలో కామ్రేడ్ను కోల్పోతున్నాం. విప్లవోద్యమం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తున్న అమర వీరులందరికి పేరు పేరునా విప్లవ జోహార్లు అర్పిద్దాం. వారి ఆశయాల సాధనకై సరైన మార్గంలో ముందుకుపోదాం. గత 5 దశాబ్దాలకు పైగా మా పార్టీ దేశంలోని అనేక ప్రాంతాలలో విప్లవోద్యమాన్ని (మిగతా 3వ పేజీలో)




ఢిల్లీ, సెప్టెంబరు 19 : స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ (శుక్రవారం) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక ఎన్నికలు జరపడం కష్టమని తెలిపారు.

**ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్‌దే నిర్ణయం..** పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పందించారు సీఎం రేవంత్ రెడ్డి. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పుకొచ్చారు.

బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల జీతాల నుంచి రూ. 5000లు ఆ పార్టీకే వెళుతుందని అన్నారు. నిధులు సైతం బీఆర్ఎస్‌కే వెళ్తున్నాయని తెలిపారు.

అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ తమకు 37 మంది ఎమ్మెల్యేల బలం ఉందని, సమ యం కేటాయించాలని కోరారని గుర్తుచేశారు సీఎం రేవంత్ రెడ్డి.

## సౌదీ అరేబియా-పాక్ జతకట్టిన వేళ.. భారత్- యుఎఇ మధ్య కుదరిన కీలక ఒప్పందం..!

పాకిస్తాన్ తో సౌదీ అరేబియా రక్షణ ఒప్పందం మధ్యప్రాచ్యం, ఆసియా అంతటా ప్రకంపనలు సృష్టించగా, భారతదేశం ఇప్పుడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తో ఒక కీలక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి సిద్ధమవుతోంది. భారత వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ ఈ విషయంపై యుఎఇ విదేశాంగ మంత్రితో సమావేశమై చర్చలు జరిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్యప్రాచ్యంలో ఒక ముఖ్యమైన దేశం. ఇజ్రాయెల్‌తో అబ్రహం ఒప్పందాలలో ఒక పార్టీ. ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడికి సంబంధించి ఇటీవల దోహాలో జరిగిన సమావేశానికి యుఎఇ ఏ ప్రముఖ నాయకులను పంపలేదు. ప్రపంచ దేశాలతో యూఏఈ వ్యూహాత్మక దౌత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇదిలావుంటే తాజాగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విదేశాంగ మంత్రితో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**పాకిస్తాన్ , సౌదీ మధ్య ఒప్పందం ఏమిటి ?...** పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్-సౌదీ క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ గురువారం ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండు దేశాలపై ఏదైనా దాడి మరొక దేశంపై దాడిగా పరిగణించబడుతుందని షరతు విధించారు. ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి తర్వాత సౌదీ అరేబియా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం సౌదీ అరేబియాకు పాకిస్తాన్‌కు అణు కవచాన్ని అందిస్తుంది. ప్రతిగా, సౌదీ అరేబియా పాకిస్తాన్‌లో భారీగా పెట్టుబడులు పెడుతుంది. ప్రస్తుతం, సౌదీ అరేబియా పాకిస్తాన్ రైల్వేలు, ఆరోగ్యం, ఇంధన రంగాలలో పెట్టుబడులు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. సౌదీ అరేబియా, పాకిస్తాన్ మధ్య ఒప్పందంలో భారతదేశం కీలకమైన లింక్. పాకిస్తాన్-భారతదేశం చాలా కాలంగా శత్రుత్వాన్ని కలిగి ఉన్నాయి. పాకిస్తాన్ ప్రాక్సీ యుద్ధ దాడులతో భారతదేశం అనేక సందర్భాలలో ప్రతీకారం తీర్చుకుంది. ఇప్పటివరకు,




సౌదీ అరేబియా భారత దాడులకు సంబంధించి తటస్థంగా ఉంది.

**భారత్-యుఎఇ మధ్య ఒప్పందం ఏమిటి ?...** భారతదేశం-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అంతరిక్ష, సముద్ర రంగాలలో పెట్టుబడుల గురించి చర్చిస్తున్నాయి. వారు ఇప్పటికే శక్తి, సాంకేతికతలో కలిసి పనిచేస్తున్నారు. అంతరిక్ష, సముద్ర రంగాలలో పెట్టుబడులు వారి సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయి. అంతరిక్ష, సముద్ర రంగాలలో యుఎఇ బలమైన స్థానాన్ని కలిగి ఉంది. మధ్యప్రాచ్యంలో 100 కంటే ఎక్కువ అంతరిక్ష ప్రాజెక్టులు జరుగుతున్న మొదటి దేశం ఇది. యుఎఇ కూడా మార్స్ మిషన్‌పై పని చేస్తోంది. అదేవిధంగా, దుబాయ్‌లోని జెబెల్ అలీ ఓడరేవు అరబ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఓడరేవు. పర్షియన్ గల్ఫ్‌తో వాణిజ్యానికి యుఎఇ కూడా గణనీయమైన సహకారిగా ఉంటుంది.




# తెలంగాణలో భారత్ ఫ్యూచర్ సిటీ

## పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ

## పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికిన సీఎం రేవంత్‌రెడ్డి

ఢిల్లీ, సెప్టెంబరు 19 : తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తామని... తెలంగాణలో పెట్టే పెట్టుబడులకు భద్రత ఉంటుందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని వ్యాఖ్యానించారు. పరిపాలన చేసేందుకు రాజకీయ సంకల్పం ఎంతో అవసరమని చెప్పుకొచ్చారు. భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలనేది తమ ఆలోచన అని తెలిపారు. దేశంలో యంగెస్ట్ స్టేట్ (కొత్త రాష్ట్రం) తెలంగాణ అని ఉద్ఘాటించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ, హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర ఉందని నొక్కిచెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి.

**తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 ..** ఢిల్లీలో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సు ఇవాళ(శుక్రవారం) జరిగింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని వివరించారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించామని వెల్లడించారు. కోర్ అర్బన్ ఏరియాలో కోటి మంది నివసిస్తున్నారని... ఇక్కడ కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నామని తెలిపారు. సెమీ అర్బన్ ఏరియాను తయారీ రంగం జోన్‌గా (మాన్యుఫాక్చర్) నిర్ణయించామని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి

**మెట్రో పొడిగింపు...** తెలంగాణ అభివృద్ధికి తగినట్లు 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లు పొడిగించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రస్తుతం అయిదు లక్షల మంది మెట్రోలో పయనిస్తున్నా రని.. దానిని 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు. సబర్మతీ తీరంలా మూసీని మారుస్తామని.. అందుకు మూసీ పునరుజ్జీవంపై దృష్టి సారించామని తెలిపారు. 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా ఉండనున్నాయని.. అందుకే ఈవీలకు రాయితీలు ప్రకటించామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

**భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం..** 'రాష్ట్ర అవసరాలకు తగినట్లు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ అనుసంధానిస్తాం. తెలంగాణలో సేంద్రియ పంటలు పండుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ సమస్య ఉంది.. మేం తెలంగాణలో డ్రగ్స్‌ను కంట్రోల్ చేశాం. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. జ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరం. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

**స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు...** 'మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తిని అనుసరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు వస్తాయి. స్పోర్ట్స్‌లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే మెడల్స్ చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. తెలంగాణకు భూపరివేష్టిత రాష్ట్రం (ల్యాండ్ లక్డ్) కావడంతో ఓడ రేవు లేదు. మచిలీపట్నం ఓడ రేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే.. దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. 2025, డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణనే చేస్తోంది. వ్యాక్సిన్ల తయారీలో హైదరాబద్ ముందు వరుసలో ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




## హైదరాబాద్-బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం: రేవంత్‌రెడ్డి

దిల్లీ: హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దిల్లీలో నిర్వహించిన ఓ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి తెలంగాణ ప్రాధాన్యత రంగాలను వివరించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి ప్రైవేటు రంగం మద్దతు గురించి తెలిపారు. అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' రూపొందించుకున్నట్లు చెప్పారు. "హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరంలో ఆర్ఆర్ఆర్ కూడా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు విస్తరిస్తున్నాం. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్యను 15 లక్షలకు పెంచాలనేదే మా లక్ష్యం. గుజరాత్‌లోని సబర్మతీ తీరంలా మూసీ తీరాన్ని అభివృద్ధి చేస్తాం. దీనికోసం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ వెలుపలకు తరలిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి కనెక్టివిటీ ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్-బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం. డ్రగ్స్ కట్టడిలో మా రాష్ట్ర పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నారు. 2034 కల్లా ట్రిలియన్ డాలర్ల, 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచే రావాలనేది మా ధ్యేయం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## కవిత వ్యవహారం.. కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమే: సీఎం రేవంత్



దిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏవీ స్పష్టంగా లేవని పేర్కొన్నారు. "ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై భారత రాష్ట్ర సమితి నేతలకే స్పష్టత లేదు. ఆ పార్టీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అసెంబ్లీలో హరీశ్ రావు అన్నారు. 37 మంది కాదని కేటీఆర్ ఇంకో సంఖ్య చెప్తున్నారు. ఇంటికొచ్చిన వాళ్లకు కండువా వేస్తే పార్టీ మారినట్లు అవుతుందా..?" అని సీఎం ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే గడువు అంశం సుప్రీంకోర్టులో ఉంది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం ఏం చెప్తుందో వేచి చూస్తున్నాం. న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మళ్లీ కోర్టుకు వెళ్లాలా? వద్దా? అనేది అప్పుడే నిర్ణయం తీసుకుంటాం" అని సీఎం తెలిపారు. ఇక కవిత వ్యవహారం అంతా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమే అని సీఎం వ్యాఖ్యానించారు. 'ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి దాడి చేస్తున్నారు. కుటుంబ వ్యవహారంతో సామన్య ప్రజలకు ఏం సంబంధం? కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు సామాజికంగా బహిష్కరించారు. 2014-19 మధ్య కేసీఆర్ కేబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేరు. ఉద్యమం పేరుతో ఆయన కొన్ని వందల మంది పిల్లల ఉసురు పోసుకున్నారు.. అది ఊరికే పోదు. ఇక హైదరాబాద్ మెట్రో విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్ కలిసి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఎల్అండ్‌టీతో ఒప్పందం చేసుకుంటేనే అనుమతులు ఇస్తామని కేంద్రం చెబుతోంది. కేంద్రంలో ఉన్న కిషన్‌రెడ్డి ఇలాంటి మెలికలు పెడుతున్నారు" అని సీఎం అన్నారు.




కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లిలో యూరియా కోసం వేలసంఖ్యలో రైతులు బారులు తీరారు. ఐదు రోజులుగా యూరియా సరఫరా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. లారీ లోడు యూరియా వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా రైతులకు అధికారులు కూపన్లు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు. దీంతో కారేపల్లి మండలంలోని 41 పంచాయతీల నుంచి 3వేలకు పైగా రైతులు కూపన్ల కోసం క్యూలైన్లలో నిలుచున్నారు. ఈ క్రమంలో పలుమార్లు తోపులాట చోటుచేసుకుంది. రైతులకు సర్దిచెప్పేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు.

## కాళేశ్వరంతో పోలిస్తే మూడో వంతు ఖర్చు.. కానీ పదో వంతుకూ నీళ్లు ఇవ్వరట: హరీశ్‌రావు

హైదరాబాద్: తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ఖర్చు రూ.35 వేల కోట్లు అట అని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. "ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుతో 4.47 లక్షల ఎకరాలకే



సాగునీరట. ఇందులో నీటి వినియోగం 80 టీఎంసీలు మాత్రమేనట. కాళేశ్వరంతో పోలిస్తే మూడో వంతు ఖర్చు చేస్తూ.. పదో వంతుకూ నీళ్లు ఇవ్వరట. రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 4.47 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనేది అద్భుతం. కాంగ్రెస్ ప్రభుత్వ ఇంజినీరింగ్ నైపుణ్యానికి ఇది మరో మచ్చుతునక. ఇది కదా అసలైన మార్పంటే?" అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

## కత్తితో దాడి చేసి భర్తను హతమార్చిన భార్య

హైదరాబాద్: కోకాపేట్‌లో దారుణం చోటు చేసుకుంది . భర్తను భార్య హత్య చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. రాత్రి కృష్ణజ్యోతి బోరా, భారాకా బోరా దంపతుల మధ్య గొడవ జరిగి.. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈక్రమంలో భార్య కత్తితో భర్తపై దాడి చేసింది. కేకలు విని స్థానికులు అక్కడికి వెళ్లారు. రక్తపు మడుగులో పడి ఉన్న బాధితుడు కృష్ణజ్యోతి బోరాను ఆసుపత్రికి తరలించారు.



అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు.

భార్యాభర్తలను అస్సాంకు చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు భార్యను అరెస్టు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కృష్ణజ్యోతి బోరా.. భార్యను వేధిస్తున్నట్లు వారు తెలిపారు. ఈక్రమంలో రాత్రి గొడవ చోటు చేసుకున్నట్లు చెప్పారు.




**మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి నిత్య పూజలు చేస్తూ.. భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. వరద కారణంగా ఆరు రోజులుగా ఆలయాన్ని మూసివేశారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 55,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళుతోంది.**

## జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ఫిక్స్..

హైదరాబాద్, సెప్టెంబర్ 19: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సమయం ఆసన్నమవుతుండటంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల ఎంపిక విషయంలో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. తాజాగా బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమ పార్టీ నుంచి మాగంటి సునీత పోటీ చేయనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను గెలిపించుకునే బాధ్యతను ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త తీసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు దివంగత మాగంటి గోపీనాథ్ సేవల్ని కొనసాగించడానికి సునీత ముందుకొచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఓటర్లు కూడా సునీతను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ క్యాడర్‌తో కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కేటీఆర్.. కాంగ్రెస్, బీజేపీల జాయింట్ వెంచర్ రేవంత్ రెడ్డి సర్కార్ అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

వక్ఫ్ సవరణలను దేశంలోనే తొలిసారిగా రేవంత్ ప్రభుత్వం అమలుచేసిందన్నారు. చరిత్రలో తొలిసారి ముస్లిం మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రమంతా ఒక తీరుగా ప్రజలు తీర్పునిస్తే హైదరాబాద్‌లో మాత్రం బీఆర్ఎస్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు.
ప్రత్యర్థులు ఎంత దుష్ప్రచా రం చేసినా జూబ్లీహిల్స్‌లో మూడోసారి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారన్నారు. మాగంటి గోపీనాథ్ సేవల్ని కొనసాగిస్తామని ఆయన సతీమణి సునీత మీ ముందుకు వచ్చిందని.. అందరూ ఆమెను ఆశీర్వదించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

**కేటీఆర్ కామెంట్స్..** 'చదువుకునే ఆడపిల్లలకి స్కూటీలు ఇస్తామన్నారు. స్కూటీలు లేవు కానీ కాంగ్రెస్ నేతల లూటీ మాత్రం ఆగడం లేదు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు కూలగొట్టడమే. హైదరాబాద్‌లోని బస్తీ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ తమ ఇంటిని కూలగొడుతుందో





అని భయంతో బతుకుతున్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్ళు ఏ రోజూ పేదోడి ఇంటిని కూలగొట్టలేదు. హైదరాబాద్‌లో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న లక్ష మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చాం. లక్ష మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చాం. పక్క బస్తీలోకి వచ్చిన బుల్డోజర్ కచ్చితంగా రేపు మీ ఇంటి ముందు కూడా వస్తుంది. ముఖ్యమంత్రి అన్న తిరుపతి రెడ్డి దుర్గం చెరువుల ఇల్లు కడితే హైడ్రా బుల్డోజర్ పోదు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి సొంత ఇల్లు రెడ్డి కుంటలో ఉన్నది. కాంగ్రెస్‌కు పొరపాటున ఓటేస్తే మీ వేలుతో మీ కంటినే పొడుచుకున్నట్టే. వంద రోజుల్లో అన్ని హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ దారుణంగా తెలంగాణ ప్రజలను మోసం చేసింది. కేసులకు భయపడితే లీడర్లు కాలేరు న్యాయం కోసం ధర్మం కోసం కొట్లాడాలి. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను గెలిపించుకునే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలు అందరి మీద ఉంది. అమీర్ అలీ, అజారుద్దీన్‌లకు టికెట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మోడీ దగ్గర స్కూల్‌కు, చంద్రబాబు దగ్గర కాలేజీకి వెళ్లి, రాహుల్ గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని అని రేవంత్ చెప్పుకుంటున్నాడు. కేసీఆర్ దగ్గర హైస్కూల్ చదువుతుంటే ఫెయిల్ అయిందని పార్టీ నుంచి వెళ్లగొట్టారు.' అంటూ కేటీఆర్ అన్నారు.

## ఆ నేతలకు ఇప్పుడే విలువలు గుర్తుకొచ్చాయా?: కడియం శ్రీహరి



హనుమకొండ: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి వెళ్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఇక్కడి ప్రగతికి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా ఉన్నారని చెప్పారు. హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకొచ్చినట్లు వివరించారు. నియోజకవర్గంలోని చెరువులన్నీ నిండాయన్నారు. కాలువల్లో పూడిక తీయించి మరమ్మతులు చేసి సాగునీరు అందించినట్లు చెప్పారు. "రేవంత్‌రెడ్డి సహకారం వల్లే అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలతోనే ఉంటా.. ప్రజల కోసమే పనిచేస్తా. కేసీఆర్ గత ప్రభుత్వంలో 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నారు. చేర్చుకున్న వారిలో ఇద్దరిని మంత్రులను కూడా చేశారు. అప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేరిన వారెవరూ రాజీనామా చేయలేదు. ఆ పార్టీ అగ్రనేతలకు ఇప్పుడే విలువలు గుర్తుకొచ్చాయా? సభాపతి నోటీసు ఇచ్చారు.. ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటా" అని కడియం శ్రీహరి అన్నారు.

## జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రమాదం.. ఏమైందంటే..




హైదరాబాద్, సెప్టెంబరు 19: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఓ యాడ్ చిత్రీకరణ సమయంలో ఎన్టీఆర్ గాయపడినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్ కాలికి స్వల్ప గాయమైంది. డ్రాగన్ సినిమాతోపాటు యాడ్ చిత్రీకరణలో విరామం లేకుండా ఎన్టీఆర్ పాల్గొంటున్నట్లు సమాచారం. ఎన్టీఆర్‌కు ప్రమాదం జరగడంతో వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ కార్యాలయం ప్రకటన..** అయితే, ఎన్టీఆర్‌కు జరిగిన ప్రమాదంపై ఆయన కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రమాదంలో ఎన్టీఆర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయని, వెంటనే ఆయనను హాస్పిటల్‌కు తరలించామని వివరించారు. ఎన్టీఆర్‌కి రెండు వారాలపాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు ఈ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్‌కు ప్రస్తుతం వైద్య చికిత్స అందుతోందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా లేదని.. అందుకు తాము హామీ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. దయచేసి ఫ్యాన్స్ కానీ, మీడియా కానీ లేనిపోని వార్తలను ప్రచురించవద్దని కోరారు. ఈ ప్రమాదం నుంచి ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.




ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నిబంధనలు సడలిస్తున్నాయి. తాజాగా డిస్కమ్ పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకుని ప్రయోజనం పొందేలా అవకాశం కల్పించారు. దీనిద్వారా వీలైనంత ఎక్కువ మందికి పథకం అందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పథకం ప్రారంభంలో ఏడాదికి రూ.15 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి మాత్రమే రాయితీ లభిస్తుందని ప్రకటించారు. ఆ తరువాత ఈ పరిమితి ఎత్తేశారు. సొంత ఇల్లు ఉన్న వారు ఇంటి పైకప్పుపై దీనిని ఏర్పాటు చేయాలి. అయితే విశాఖ లాంటి నగరాల్లో ఎక్కువ సంఖ్యలో ప్లాటు, అపార్ట్‌మెంట్లపై వ్యక్తిగతంగా సోలార్ ప్లేట్లు ఏర్పాటుకు అసోసియేషన్లు అనుమతి ఇవ్వకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఆలోచన చేశారు. ప్లాట్లో నివసించే వినియోగదారులకు జిల్లాలో ఎక్కడైనా సొంత ఇల్లు, స్థలం ఉంటే.. అక్కడ ఏర్పాటు చేసుకుని, దాని ద్వారా లభించే సోలార్ విద్యుత్‌ను ఫ్లాట్‌లో వాడుకునే వీలు కల్పించారు. దీనివల్ల కూడా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. ఎక్కడెక్కడి నుంచో ఉద్యోగ, ఉపాధి రీత్యా వచ్చి నగరంలో స్థిర పడిన వారికి లబ్ధి కలగాలంటే పరిధి విస్తృతం చేయాలని భావించారు. ఇందులో భాగంగా ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో అంటే శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వరకు ఎక్కడైనా సరే రూఫ్ టాప్ సోలార్ పెట్టుకుంటే, దానిని విశాఖలో నివాసం ఉండే ఫ్లాట్‌కు లింక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఉదాహరణకు సీతమ్మ దారలోని అపార్ట్‌మెంట్‌లో ఉండే వినియోగదారునికి శ్రీకాకుళం జిల్లా కవిటిలో సొంత స్థలం లేదా పొలం ఉండి, అక్కడ రూఫ్ టాప్ సోలార్ పెట్టుకుంటే.. అక్కడ ఉత్పత్తి అయ్యే సోలార్ పవర్‌ని విశాఖలో ప్లాట్‌కు లింక్ చేసి ఉపయోగించుకునే అవకాశం కల్పించారు. రెండు చోట్ల యజమాని ఒక్కరే కావడంతో దీని అమలుకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు.

**ఎంత ప్రయోజనం అంటే...?....** ఒక్కో వినియోగదారుడు మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునే వీలుంది. ఒక కిలోవాట్ ద్వారా రోజుకు నాలుగు యూనిట్ల చొప్పున నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనికి అయ్యే వ్యయం రూ.60వేలు. అందులో ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుంది. రెండు కిలోవాట్లకు నెలకు 240 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. రూ.60వేలు రాయితీ వస్తుంది. మూడు కిలోవాట్లు పెట్టుకుంటే రూ.78వేలు రాయితీ లభిస్తుంది. నెలకు 360 యూనిట్ల సోలార్ విద్యుత్ వస్తుంది. సగటు వినియోగ దారులకు ఈ పథకం సరిపోతుంది. ఇందుకు అయ్యే మొత్తం రుణంగా ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయి. కేవలం రూ.వెయ్యి డౌన్ పేమెంట్‌తో మూడు కిలోవాట్ల పథకం పెట్టుకోవచ్చు. నెల నెలా కట్టే విద్యుత్ బిల్లును ఐదేళ్ళు ఈఎంఐల కింద బ్యాంకుకు చెల్లిస్తే రుణం తీరిపోతుంది. రూఫ్ టాప్ సోలార్ జీవిత కాలం 25 ఏళ్ళు. ఐదేళ్లకు ఈఎంఐలు కడితే మిగిలిన 20 ఏళ్లకు వచ్చే విద్యుత్ ఉచితమే.

చురకలు



# మల్లోజుల లేఖ ముమ్మాటికి నిజమే.!

**(మొదటి పేజీ తరువాయి)** నిర్మిస్తూ వచ్చింది. పీడిత ప్రజలను సమీకరిస్తూ, సంఘటితపరుస్తూ వారి న్యాయమైన సమస్యలపై వారిని ప్రజా పోరాటాలలోకి దింపింది. అనేక పోరాటాలలో ప్రజలు గొప్ప గొప్ప విజయాలు సాధించారు. ఆ పోరాటాల ద్వారా ప్రజలు కేవలం ఆర్థిక ప్రయోజనాలు పొందడమే కాకుండా సమాజంలో గౌరవం, గుర్తింపు పొందుతూ మా పార్టీకి ఎంతో గుర్తింపును తెచ్చారు. మాకెన్నో విలువైన పోరాట అనుభవాలను అందించారు. ప్రజా పోరాటాల ద్వారా ప్రజలు ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని అనుభవించడమే కాకుండా ఆ పోరాటాలు వారి జీవితాలలో కొత్త వెలుగులను, ఆశలను నింపాయి. ముఖ్యంగా మహిళలు తమ సమరశీల పోరాటాల ద్వారా పితృస్వామ్యంపై సాధించిన విజయాలు వారి జీవితాలలో పెను మార్పులకు దారి తీసి మహిళా విముక్తికి పునాదులు బలోపేతం చేశాయి.

మా పార్టీ పై ఎనలేని విశ్వాసంతో, మా విప్లవ రాజకీయాలపై పూర్తి నమ్మకంతో, మా ఆచరణ చూసి మమ్మల్ని ఎంతగానో ప్రేమించి, అభిమానించి విప్లవకారుల అసమాన త్యాగాలతో మమ్మల్ని మీ గుండెల్లో దాచుకున్నారు. పార్టీ చెప్పిన విప్లవ రాజకీయాలతో అనేకానేక అద్భుతమైన పోరాటాలను చేసి శత్రువు గుండెల్లో గుబులు సృష్టించి మున్నెన్నడూ లేని విధంగా సమాజంలో ఒక కొత్త విప్లవ శక్తిని సృష్టించి పార్టీని నూతన ఎత్తులకు ఎదిగింపచేశారు. మీ పోరాటాలు, మీ త్యాగాలు, మీ ఆదరాభిమానాలు, మీ విశ్వాసం మా పార్టీ ఆచరణలోనే ప్రజాయుద్ధానికి నిజమైన నిర్వచనాన్నిస్తూ మా పార్టీకి ఒక కొత్త గుర్తింపును తెచ్చిపెట్టాయి. అందుకు మీరు ఎంతో అభినందనీయులు. మీకు మా రెడ్, రెడ్సెల్యూట్స్.

ప్రియమైన ప్రజలారా,

మా పార్టీ రూపొందించిన 'వ్యూహం- ఎత్తుగడలు' దస్తావేజ్ను అనుసరించి దేశంలోని

1అనేక ప్రాంతాలకు విప్లవోద్యమాన్ని విస్తరింపచేశాం. సమాజంలోని అనేక పీడిత సెక్షన్ల ప్రజలను సంఘటితం చేశాం. పట్టణాలు, మైదానాలు, అటవీ ప్రాంతాలలో శ్రామిక ప్రజలను సంఘటితం చేస్తూ, దీర్ఘకాల ప్రజా యుద్ధ పంథాను అనుసరించి విప్లవోద్యమాన్ని నిర్మించడంలో అత్యంత అంకితభావంతో పార్టీ అవిరామ కృషి సలిపింది. నగ్జల్బరీ వెనుకంజ తరువాత, తిరిగి సంఘటితపడి దేశంలో ఏ విప్లవ పార్టీ సాధించలేని విజయాలను సాధించడమే కాకుండా గతంలో ముక్కచెక్కలైన మా పార్టీని, దేశంలోని నిజమైన విప్లవకారులను సమైక్యం చేయడంలో చాలా వరకు మా పార్టీ విజయం సాధించింది. దక్షిణాసియా దేశాలలోని విప్లవ పార్టీలను, శక్తులను సమైక్యం చేయడానికి తీవ్రంగా కృషి చేసి సఫలమైంది. సుదీర్ఘకాలంగా దేశంలో మా పార్టీ నాయకత్వంలో పీడిత ప్రజలు కొనసాగిస్తున్న సమరశీల పోరాటాలు, త్యాగాలు ప్రపంచ వ్యాప్త మావోయిస్టు/విప్లవ పార్టీలను, శక్తులను సమైక్యం చేయడానికి పార్టీ చేస్తున్న కృషికి మంచి గుర్తింపును ఇవ్వడమే కాకుండా ఆ ప్రాతిపదికన వారి విశ్వాసాన్ని పొంది సానుకూల ఫలితాలను సాధిస్తున్న మా పార్టీ ఆచరణ మీ ముందుంది.

మా పార్టీ సాధిస్తున్న అచీవ్మెంట్స్ ఎంత గొప్పవో, మా పార్టీ చేస్తున్న తప్పులూ అంతకన్నా తీవ్రమైనవి కావడంతో, దేశంలోని ఏ ప్రాంతంలోనూ సాపేక్షికంగా నిలకడైన, బలమైన సంఘటిత విప్లవోద్యమాన్ని నిర్మించలేకపోయామన్నది ఒక చేదు వాస్తవం. ప్రపంచంలో, దేశంలో మారుతున్న సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడంలో మా పార్టీ తొలినుండి చాలా వెనుకబడుతూ వస్తోంది. శత్రువు బలాన్ని, విప్లవ శక్తుల బలాన్ని సరిగా అంచనా వేసుకొని తగిన ఎత్తుగడలతో విప్లవోద్యమాన్ని నిర్మించడంలోనూ తప్పులు చేస్తూ వస్తోంది. మార్క్సిస్టు మహోపాధ్యాయుల బోధనలను లోతుగా అధ్యయనం చేసి మన దేశ నిర్దిష్ట స్థల, కాల పరిస్థితులకు తగిన విధంగా అన్వయించడంలో అతివాద తప్పులు చేస్తూ వస్తున్నది. ఒకప్పుడు విప్లవంలో, ప్రజా సంఘాల ఆవశ్యకతనే మా పార్టీ గుర్తించలేదు. ఆ తీవ్ర అతివాద తప్పిదం నుండి బయటపడి, విప్లవ ప్రజలను సంఘటితం చేస్తూ విప్లవ పోరాటాల ద్వారా ప్రజా పంథాలో విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి అసమాన త్యాగాలతో పూనుకుంది. కానీ, దానిని స్థిరంగా కొనసాగిస్తూ అభివృద్ధి చేయలేకపోయింది. ఈ క్రమం అంతా మీకు తెలిసిందే.

దేశంలో ఒకనాడు విప్లవోద్యమానికే తలమానికంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం వరుస ఆటు, వెనుకంజలను ఎదుర్కొంటూ చివరకు 21వ శతాబ్దం ప్రారంభ దశాబ్దం మధ్యనాటికే దెబ్బతినిపోయింది. ఇక ఆ తరువాత ఆ ఉద్యమం గడచిన దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కాలంలో అక్కడ తిరిగి పునర్వికాసం జరుగలేదు. ఇటీవలే, ఏఓబీలో మిగిలిన అతికొద్ది మంది కామ్రేడ్స్ నాయకత్వం సహ అమరులైనారు. ఆ వరుసన దేశంలోని ఏ ప్రాంతంలోనూ యంయంసీ, ఒడిశా, పశ్చిం బంగాల్, పశ్చిమ కనుమలు మున్నగు అటవీ ప్రాంతాలు సహ ఏ రాష్ట్రంలోనూ సాపేక్షికంగా, నిలకడ కలిగిన బలమైన విప్లవోద్యమాన్ని దశాబ్దాలు గడుస్తున్నా

2నిర్మించలేకపోతున్నాం. ఏనాటికానాడు ఆటు, వెనుకంజలతోనే అనేక త్యాగాలతో కూడిన విప్లవ ఉద్యమాలు దెబ్బతింటున్నాయి. అందుకు వాస్తవ కారణాలను వెలికితీసి సమగ్రంగా అర్థం చేసుకొని లోపాలను సరిదిద్దుకొని ఉద్యమాలను తిరిగి ఎక్కడా పురోగమింప చేయలేకపోతున్నాం.

ఏ విప్లవోద్యమంలోనైనా అనేక ఆటు-పోట్లు, వెనుకంజలు, ఓటములు వుండడంలో అశ్చర్యమేమీ లేదు. ఆటు నుండి పోటుకు, వెనుకంజ నుండి ముందంజకు ఉద్యమాలు పురోగమించాలి. కానీ, మా ఆచరణలో చాలా వరకు ఆ క్రమం సాగడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఏనాటికానాడు పెంపొందుతున్న విప్లవానుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ, మారుతున్న పరిస్థితులలోని గతిశీలతను అర్థం చేసుకుంటూ దెబ్బతిన్న ప్రాంతాలలో తిరిగి బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించడంలో ఇప్పటివరకూ ఎక్కడా మా పార్టీ జయప్రదం కాలేదు. అపార త్యాగాలతో, నాయకత్వ నష్టాలతో రక్తసిక్తమవుతున్న మైదానాలలో, అడవులలో నెలకొంటున్న విషాదకర పరిస్థితుల మధ్య ప్రజల అపార సానుభూతి ఉన్నప్పటికీ ఎట్టకేలకు ఒంటరిగానే మిగిలిపోతున్నాం.

ఒకనాడు దేశంలోని 16 రాష్ట్రాలలో, దాదాపు 150 జిల్లాలలో విప్లవోద్యమం తన ఉనికిని చాటుకుంది. వీటిలో ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలలో సాపేక్షికంగా ఎక్కువ కాలమే బలంగా నిలబడగలిగింది. దండకారణ్యం, బిహార్ - ఝార?ండ్లలో విప్లవ ప్రజా ఉద్యమం విముక్తి ప్రాంత లక్ష్యాన్ని చేపట్టి నూతన ఎత్తులకు ఎదిగింది. అందుకు అక్కడి ఆర్థిక, రాజకీయ, సామాజిక విశేష పరిస్థితులను అర్థం చేసుకొని పని చేయడంతో పాటు శత్రువు బలహీనతలు ప్రధానంగా తోడ్పడ్డాయి. అయితే, దేశంలోని మిగితా ప్రాంతాల కన్నా సాపేక్షికంగా కొంత ఆలస్యంగా నైనప్పటికీ ఈ రెండు ప్రాంతాలు సహ గత దశాబ్దన్నర కాలంగా ఎక్కడా విప్లవోద్యమం బతికి బట్టకట్టే పరిస్థితులే లేకుండా పోయాయి. అందుకు ఏకైక కారణం శత్రువుకు అభేద్యమైన రహస్య విప్లవ పార్టీని నిర్మిస్తూ, మారుతున్న పరిస్థితులను సవ్యంగా అర్థం చేసుకొని విప్లవ సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయించడంలో మా పార్టీ ఘోరంగా విఫలమవడం తప్ప మరేం కాదు. ఫలితంగా దశాబ్దాలుగా అనేక త్యాగాలతో నిర్మించుకున్న విప్లవోద్యమాలను శత్రు వర్గాలు పదే పదే ఓటమి పాలు చేయగలుగుతున్నాయి. మా ఓటమికి శత్రువు గొప్పతనం కన్నా మా బలహీనతలు, తప్పులే ప్రధానమైనవని ఒప్పుకుంటున్నాం.

1970లలో రివిజనిస్టు పార్టీల ఆచరణపై ధ్వజమెత్తుతూ అతివాద తప్పిదాలు చేశాం. తదనంతర కాలంలో ఆ తప్పుల నుండి బయటపడుతూ 1980 నుండి సాయుధ పోరాటాన్ని నిర్మించాలనే గట్టి పట్టుదల, తెగువతో దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో సాయుధ దళాల నిర్మాణానికి పూనుకున్నాం. అదే సమయంలో శత్రువుకు అభేద్యమైన రహస్య పార్టీ నిర్మాణ ఆవశ్యకతను అర్థం చేసుకోకుండా, మరో రకమైన అతివాద తప్పుకు బలయ్యాం. సైన్యం ద్వారానే అన్నీ సాధించగలుగుతామనీ, మరో విడుత ప్రజలను, ప్రజాశక్తిని, ప్రజా పోరాటాలను తక్కువ చేసే పూర్తి అతివాద సెక్టేరియన్ తప్పుకు నెట్టబడ్డాం. ఉద్యమ శక్తికి మించిన, పరిస్థితులకు పొసగని కర్తవ్యాలు చేపడుతూ దెబ్బ మీద దెబ్బ తింటూ వస్తున్నాం. దండకారణ్యం, బీజేలలో సాధిస్తున్న సైనిక విజయాలనే సర్వస్వంగా భావించి మిగితా ప్రాంతాలలో వరుసగా దెబ్బతింటున్న పార్టీని, విప్లవోద్యమాన్ని సీరియస్గా పరిగణనలోకి తీసుకోకుండా, అసలు కారణాలు అర్థం చేసుకోకుండా ఎక్కడికక్కడే స్థానిక పార్టీ నాయకత్వ అసమర్థతగా చూశాం. ఆయా ప్రాంతాల ఉద్యమ శక్తికి మించిన కర్తవ్యాలను ఇస్తూ సీసీ విప్లవోద్యమ నిర్మాణాన్ని స్వీయాత్మక అంచనాలతో నష్టపోతూ వచ్చింది. ఫలితంగా, ఈరోజు దేశంలో ఎక్కడా బలమైన విప్లవోద్యమం మాట పక్కన పెట్టినా కనీసం 'స్థిరంగా' నిలబడలేని స్థితికి పార్టీ చేరుకుంది.

మార్క్సిజానికి ప్రాణ వాయివు లాంటి స్థల కాల పరిస్థితులకు తగిన విధంగా విప్లవాచరణలో మార్పులు చేసుకుంటూ విప్లవోద్యమాన్ని పురోగమింపచేయలేకపోయాం. మా పార్టీ అనుసరించిన అతివాద దుందుడుకువాద చర్యలన్నీ ఎక్కడికక్కడే అంతిమంగా శత్రువుకు ఉపయోగపడే ఆయుధాలయ్యాయి. వాటి ద్వారా శత్రువు దండకారణ్యం, బీ-జేలు మినహ మిగితా ప్రాంతాలలో సాపేక్షికంగా తక్కువ కాలంలోనే ఉద్యమాలను దెబ్బ తీయడం, బలపడకుండా చేయగలిగాడు. దండకారణ్యంలోనూ అనేక డివిజన్లలో అవే వైఫల్యాలు 2011 నాటికే ఎదురై ఉద్యమం గడ్డు పరిస్థితులకు చేరినప్పటికీ, దక్షిణ, పశ్చిం బస్తర్లలోని చిన్న పాకెట్లలో, మాడ్లోని పరిమిత పాకెట్లో సాపేక్షికంగా బలమైన ప్రజాపునాది, అనుకూల టెర్రయిన్ కలిగివున్న చోట కూడా చాలా కాలం క్రితమే బలహీనతలు ముందుకు వచ్చినప్పటికీ సకాలంలో వాటిని అర్థం చేసుకోలేకపోయాం. సరిదిద్దుకోలేకపోయాం.

దండకారణ్యంలో ఉద్యమం నష్టపోవడానికి సాపేక్షికంగా కొంత ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ, అంతిమంగా ఓటమి పాలే కావలసి వస్తోంది. ఏమైనప్పటికీ 'దీపం ఉ ండగానే ఇల్లు చక్కదిద్దుకునే' విధంగా సకాలంలో తప్పుల నుండి మా పార్టీ తేరుకోలేకపోయింది. బీ-జే సాక్ ఏరియాలోనూ వివిధ ప్రాంతాలలోని ఉద్యమాలు విలీనానికి ముందు నుండే దెబ్బతింటున్నప్పటికీ, సకాలంలో గుర్తించి సరిదిద్దుకొని ఫలితంగా, 2013నాటికి ఆ ఉద్యమం కూడా తాత్కాలిక వెనుకంజకు నెట్టబడింది. మా రెండు పార్టీల విలీనం దేశ ప్రజలలో, అంతర్జాతీయంగా విప్లవ శక్తులలో ఒక నూతన ఉత్సాహకర, ఉత్తేజపూరిత సందేశాన్నిచ్చి, ఒక అనుకూల వాతావరణాన్ని సృష్టించినప్పటికీ దానిని మేం మా బలానికి కొలమానంగానే చూశాం తప్ప విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి పరస్పర అనుభవాల నుండి నేర్చుకొని, తప్పులను అర్థం చేసుకొని, సరిదిద్దుకునే కృషి తగినంతగా చేయకపోవడంతో ఆ పరిస్థితులను సద్వినియోగం చేసుకోలేదు. దేశంలోని అనేక ప్రాంతాలలో దెబ్బ తిన్న విప్లవోద్యమాలను పునరాభివృద్ధి చేసుకోవడానికి అనేక అవకాశాలను ఎక్కడికక్కడే దేశంలో సానుకూలంగా మారుతున్న విప్లవ పరిస్థితులు 4 సృష్టిస్తూ వస్తున్నప్పటికీ మా పార్టీ వాటిని స్వయం కృతాపరాధాలతో కాలదన్నుకుంది. మరోవైపు, పార్టీ అనుసరించిన అతివాద ఒంటెత్తుపోకడలతో కూడిన తప్పిదాలు ప్రజలలో వివిధ రూపాలలో ప్రతిబింబిస్తూ ఒక పెద్ద సెక్షన్ విప్లవోద్యమానికి దూరమైంది. సమాజంలో తీవ్రతరమవుతున్న అనేక ప్రజా సమస్యలను, రకకరాల రుగ్మతలను, సహజంగానే బూర్జువా పార్టీలు తమ విజయాలకు ఉపయోగించుకుని సొమ్ము చేసుకుంటున్నాయి. అంతిమంగా, పరిస్థితి ఎక్కడికి చేరిందంటే, దండకారణ్యం, బీ-జు సహ దేశంలో ఎక్కడా మా పార్టీ నాయకత్వంలో ఉ ద్యమాలు బలపడలేకపోతున్నాయి, చివరకు ఓటమికి చేరుకున్నాం. వీటి లోపాలను వ్యక్తులలో, పార్టీ కమిటీలలో చూస్తూ వచ్చాం తప్ప మా నాయకత్వ అవగాహనలో, సిద్ధాంత అధ్యయనంలో, మారుతున్న పరిస్థితులకు దానిని అన్వయించడంలో జరుగుతున్న లోపాలుగా అర్థం చేసుకోలేకపోయాం. దానితో, ఆ తప్పులు భారత విప్లవోద్యమాన్ని మరోసారి వెనక్కి నెట్టాయి. ప్రజల, కేడర్ల అసమాన త్యాగాల నుండైనా మేం సకాలంలో గుణపాఠాలు తీసుకోని ఫలితంగా, వరుసగా జరుగుతున్న నష్టాలతో దేశ పీడిత ప్రజలను తీవ్ర నిరాశ నిస్పృహలకు, అవిశ్వాసానికి, ఆందోళనకు నెట్టాం. ఇవన్నీ ఎంత తాత్కాలికమే అయినప్పటికీ చేదు వాస్తవాలే. విషాదకర పరిణామాలే! ఈ పరిస్థితులను తిరిగి చక్కదిద్దుకోవడానికి ఎంత పట్టుదలగా పని చేసినప్పటికీ మిగిలిన విప్లవ శక్తులకు మౌలికంగానే పార్టీ వ్యూహం- ఎత్తుగడలను, విధానాలను మార్చుకోకుండా సాధ్యం కాని స్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులలో, పార్టీ గత తప్పుల నుండి నేర్చుకుంటూ తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించడానికి తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ చేయకుండా సాధ్యం కాదనేది తేలిపోయింది. మా పార్టీ జనరల్ సెక్రటరీ శాంతి చర్చలకు సిద్ధపడడం వెనుక ఈ అవగాహనే బలంగా పని చేసి వుంటుంది. ప్రజల మధ్యకు బహిరంగంగా వెళ్లి ప్రజా సమస్యలపై వారిని పునఃసంఘటితం చేస్తూ గత తప్పులకు తిరిగి నెట్టబడకుండా, విప్లవోద్యమాన్ని నిర్మించడమే ఇక పార్టీ ముందు



మిగిలిన ఏకైక మార్గంగా మిగిలింది. పార్టీ చేసిన తప్పులకు వెలకట్టలేని త్యాగాలతో మూల్యాన్ని చెల్లించాం.

ఇప్పటికైనా, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా అంటూ, సాయుధ పోరాటం అంటూ, పరిస్థితులలోని మార్పులతో, స్థల కాలాలతో నిమిత్తం లేకుండా, చైనా పంథా, రష్యా పంథా అనే పిడివాద ఆచరణకు స్వస్తి చెప్పి భారతదేశ స్థల కాల పరిస్థితులకు తగిన పంథాలో భారత విప్లవాన్ని జయప్రదం చేయడానికి పూనుకోవడమే పార్టీ ముందు మిగిలిన ఏకైక కర్తవ్యం. దీనిని విశాల ప్రజారాసులు సహృదయంతో అర్థం చేసుకుంటారనీ విజ్ఞప్తి చేస్తున్నాం. విప్లవోద్యమంలో మీకు కలిగిన నష్టాలకు, మీరు భరించిన కష్టాలకు, మీరు చేసిన అసమాన, అనుపమాన త్యాగాలకు మేమే బాధ్యత పడుతున్నాం. మా మిడిమిడి జ్ఞానంతో, వస్తుగత పరిస్థితులను అర్థం చేసుకోవడంలో చేసిన పొరపాట్లకు, మా ఆచరణలో అవలంభించిన అతివాద ఒంటెత్తువాద తప్పులకు మమ్మల్ని మన్నించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. సుదీర్ఘకాలంలో

5 జరిగిన తప్పులకు బాధ్యత పడుతూ ప్రజలకు క్షమాపణలు చెప్పుకుంటున్నాం.


మీ మధ్య ఇక మా పార్టీ గతంలా లేకపోవడంతో, వర్గ సమాజంలో విప్లవ ప్రతిఘాత శక్తులు మిమ్మల్ని ఎంతగా వేధిస్తాయో, ఎలాంటి ప్రతికార చర్యలకు పాల్పడుతాయో మాకు తెలుసు. ఇప్పటివరకు మీరు మా పార్టీ నాయకత్వంలో అడవులను, వనరులను కాపాడుకోగలిగారు. వాటిని తరలించుకు పోవడానికి ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులు కుమ్మక్కై అడవులను రక్తసిక్తం చేస్తున్నాయి. ఈ నరసంహారాలను మనం వెంటనే ఆపాలి. అడవులను, వనరులను కాపాడుకోవాలి. అందుకు, మీ వద్ద అనేక గొప్ప సమరశీల అనుభవాల గని వుంది. సంఘటిత పోరాటాల పటిమ వుంది. మీరు ధైర్యంగా నిలిచి అన్యాయాలను ఎదిరిస్తే, న్యాయబద్ధంగా పోరాడితే ఏ శక్తీ మిమ్మల్ని ఏమీ చేయలేదు. ప్రజా శక్తిని అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు. మీరు మీ సమస్యలపై పోరాడుతారనీ, మీ మధ్య నిజాయితీగా పని చేసే శక్తుల నుండి సమర్థవంతమైన నాయకత్వాన్ని నిలుపుకుంటారనే పూర్తి విశ్వాసం మాకుంది. మేం తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ చేయడాన్ని అర్థం చేసుకోగలరు. ఈ నిర్ణయం తీసుకోకుండా రక్తసిక్తం అవుతున్న అడవులను శాంతి వనాలుగా మార్చలేం. ఈ నిర్ణయం తీసుకోకుండా మిగిలిన విప్లవ శక్తులనైనా కాపాడుకోలేం. ఈ నిర్ణయం తీసుకోకుండా, మీ త్యాగాలకు, అమరుల బలదానాలకు న్యాయాన్ని చేకూర్చలేం. ఈ 'ఓటమి' బాధాకరమైనదే. కానీ, విజయానికి తల్లి లాంటిదనే బలమైన విశ్వాసంతో న్యాయమైన ప్రజా సమస్యలపై న్యాయబద్ధమైన పోరాటాలకు పూనుకుందాం.

**తేదీ: 15 ఆగస్టు 2025 అపరాధ భావనతో,సోను, పీబీఎం, సీపీఐ (మావోయిస్టు).**

# దేశ రక్షణలో దృఢ కవచం...రైల్వే భద్రతా దళం

## - సెప్టెంబర్ 20...రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవం

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ ఇరవై తేదీన రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపు కుంటారు. ఇది కేవలం ఒక ఆచార పూర్వక ఉత్సవం మాత్రమే కాకుండా, దేశ ప్రజల రక్షణలో ఈ దళం చేసిన సేవలను స్మరించుకునే చారిత్రక సందర్భం. భారతీయ రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాజిక జీవనానికి వెన్నెముక వంటివి. రోజూ దాదాపు రెండు కోట్లు ముప్పై లక్షల మంది రైళ్లలో ప్రయాణిస్తారు. ఈ విస్తారమైన రవాణా వ్యవస్థ సజావుగా నడవడానికి భద్రత అత్యంత కీలకాంశం. ఆ భద్రతను కాపాడే బాధ్యతను మోసేది రైల్వే భద్రతా దళమే. రైల్వే భద్రతా దళ చరిత్రను పరిశీలిస్తే ఇది ఒక శతాబ్దానికి పైగా వ్యాపించినదని గ్రహించవచ్చు. 1850ల కాలంలోనే బ్రిటిష్ పాలకులు రైల్వేలు విస్తరించడంతో దొంగతనాలు, దాడులు ఎక్కువ కావడం గమనించి ప్రత్యేక భద్రతా సిబ్బందిని నియమించారు. కాలక్రమేణా ఈ అవసరం మరింత పెరిగింది. చివరకు 1957లో భారత పార్లమెంట్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ చట్టాన్ని ఆమోదించి దీనికి చట్టబద్ధ హోదా కల్పించింది. ఆ సమయంలో ప్రధాన కర్తవ్యం రైల్వే ఆస్తులను రక్షించడం మాత్రమే. కానీ ప్రయాణీకుల సంఖ్య పెరుగుతుండటంతో, నేరాల విస్తరణ ఎక్కువ కావడంతో ఈ దళం పనితీరు మరింత విస్తరించింది. 1985లో పార్లమెంట్ చట్ట సవరణల ద్వారా రైల్వే భద్రతా దళం కేంద్ర సాయుధ బలగ హోదాను పొందింది. 1999లో కేంద్ర ప్రభుత్వం దీనికి పరామిలిటరీ బలగ స్థాయి కల్పించింది. ఈ రోజు దాదాపు డెబ్బై ఐదు వేల మందికి పైగా సిబ్బందితో ఈ దళం భారతీయ రైల్వేలను కాపాడుతోంది. రైల్వే భద్రతా దళ ప్రధాన బాధ్యత ప్రయాణికులు, వారి ఆస్తులు, రైల్వే ఆస్తులు సురక్షితంగా ఉండేలా చూడడం. రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, మహిళలపై వేధింపులు, స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల రవాణా, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం వీరి ప్రధాన కర్తవ్యం. మహిళలు, పిల్లలు, వృద్ధుల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ "ఆపరేషన్ యాత్రి సురక్ష", "మేరా సురక్షా", "సురక్షిత్ సఫర్" వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. తప్పిపోయిన పిల్లలను కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడం, రైల్వే ప్రాంగణంలో నిరుపేదలకు సహాయం చేయడం వంటి మానవతా సేవలను కూడా ఈ దళం చేస్తోంది. రైల్వే పట్టాలు, స్టేషన్లు, సిగ్నలింగ్ వ్యవస్థలు వంటి ఆస్తులను విధ్వంసక చర్యల నుండి కాపాడడం కూడా వీరి ప్రధాన కర్తవ్యాల్లో ఒకటి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లోకి రావడంతో రైల్వే భద్రతా దళం తన పనితీరులో విప్లవాత్మక మార్పులు తెచ్చుకుంది. సీసీటీవీ పర్యవేక్షణ, ఆధునిక ఆయుధాలు, కుక్కల దళం, సైబర్ నేరాల పర్యవేక్షణ వంటి ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నారు. ఉగ్రవాద ముప్పులు, బాంబు





బెదిరింపులు వంటి పరిస్థితులను ఎదుర్కోవడంలో వీరి పాత్ర విశేషం. రైల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలను రక్షించడం, బాధితులకు సహాయం చేయడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి బాధ్యతలను కూడా వీరు నిర్వర్తిస్తున్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ దళం ఘనంగా వేడుకలు జరుపుకుంటుంది. ప్రధాన కార్యాలయం నుండి జోనల్ కార్యాలయాల వరకు కవాతులు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విధుల్లో విశేష సేవలు అందించిన సిబ్బందికి పతకాలు, బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ వేడుకలు ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు సిబ్బందిలో గర్వాన్ని నింపుతాయి. భారతీయ రైల్వేలు ప్రతి రోజు కోట్లాది మంది ప్రయాణికుల జీవితాన్ని ముడిపెట్టు కున్నాయి. ఈ విస్తారమైన వ్యవస్థ భద్రతను కాపాడే రైల్వే భద్రతా దళం ప్రాముఖ్యత అపరిమితమైనది. "ప్రజల భద్రత %-% దేశ భద్రత" అన్న నినాదంతో క్రమశిక్షణ, ధైర్యం, సేవా తపనలతో పనిచేస్తూ ఈ దళం దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ దళం చేసిన త్యాగాలను, అందించిన సేవలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమే. రైల్వేలు సురక్షితంగా ఉండడం అంటే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమేనని గుర్తు చేసే పాఠమిది.

# 1857 తిరుగుబాటు - ఢిల్లీ పతనంతో మొఘల్ అంత్యగీతం, స్వాతంత్ర్య స్వరం

## సెప్టెంబర్ 20, 1857...: తిరుగుబాటుదారుల త్యాగానికి జ్ఞాపకం

1857 తిరుగుబాటు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక విప్లవాత్మక ఘట్టం. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ పాలనలోని అన్యాయాలు, దోపిడీలు, మతపరమైన జోక్యాలు, రాజకీయ మోసాలు, ఆర్థిక దోపిడీలు కలసి ఈ తిరుగుబాటుకు బీజమయ్యాయి. సిపాయిలకు అందించిన కొత్త తుపాకీ గుళ్లలో పశువుల కొవ్వు వాడుతున్నారన్న వార్తలు మత విశ్వాసాలను దెబ్బ తీయడంతో ఆగ్రహ జ్వాలలు అంటుకున్నాయి. లార్డ్ డల్హౌసీ అమలు చేసిన 'డాక్ట్రిన్ ఆఫ్ ల్యాప్స్' విధానం వల్ల ఝాన్సీ, అవధ్, నాగ్‌పూర్ వంటి అనేక రాజ్యాలు గద్దెచ్యుతమవ్వగా స్థానిక పాలకులు అవమానితులయ్యారు. రైతులపై పెరిగిన పన్నులు, వాణిజ్య దోపిడీలు ప్రజలను ఆర్థికంగా దెబ్బతీశాయి. సైన్యంలో వివక్ష, స్థానిక సైనికుల అవమానకర పరిస్థితులు అసహనాన్ని పెంచాయి. ఈ నేపథ్యమే 1857 మే 10న మీరట్‌లో తిరుగుబాటుకు దారితీసింది. సిపాయిలు తిరుగుబాటు జెండా ఎగురవేసి ఢిల్లీ వైపు కదిలి, అక్కడికి చేరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను తమ నాయకునిగా ప్రకటించారు. ఢిల్లీ తిరుగుబాటు కేంద్రంగా మారి దేశమంతా పోరాట జ్వాలలు వ్యాపించాయి. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, నానా సాహెబ్, తాంతీయా తోపే, బేగం హజ్రత్ మహల్, కూన్వర్ సింగ్ వంటి నేతలు వివిధ ప్రాంతాల్లో పోరాటానికి నాయకత్వం వహించారు. ఢిల్లీ ముట్టడి మూడు నెలలపాటు సాగింది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు కంపెనీ సైన్యం నగరాన్ని చుట్టుముట్టి దాడులు కొనసాగించింది. పంజాబ్ నుండి తీసుకు వచ్చిన యూరోపియన్ దళాలు, నిబద్ధతగల సైనికులు, ఆధునిక తుపాకుల సహాయంతో ముట్టడి తీవ్రతరమైంది. నగరంలో ఆహారం, నీరు, ఆయుధాల కొరత తిరుగుబాటు దారులను కుంగదీసింది. అయినప్పటికీ వారు వీధి యుద్ధాలు సాగించి, కంపెనీ దళాలకు గట్టి ప్రతిఘటన ఇచ్చారు. గణాంకాల ప్రకారం ఈ ముట్టడిలో ఇరువైపులా లక్షలాది ప్రాణాలు కోల్పోయాయి. ఢిల్లీలో సుమారు నలభై వేలమంది సైనికులు, పౌరులు ప్రాణాలు విడిచారని చరిత్రకారులు అంచనా వేస్తారు. సెప్టెంబర్ 14న కంపెనీ సైన్యం కాశ్మీరి గేట్ వద్ద గోడలను బీటలు చేసి నగరంలోకి చొరబడింది. తర్వాతి ఆరు రోజులు వీధి యుద్ధాలు సాగాయి. ప్రతి ఇంటి వద్ద తిరుగుబాటు దారులు ఎదురు దాడులు జరిపినా, చివరికి వారిని మట్టి కరిపించారు. సెప్టెంబర్ 20న ఢిల్లీ పూర్తిగా కంపెనీ ఆధీనం లోకి వచ్చింది. బహదూర్ షా జఫర్‌ను పట్టుకొని, అతని కుమారులను హతమార్చారు. అతన్ని చెరసాలలో బంధించి, తరువాత రంగూన్ తరలించారు.మొఘల్ సామ్రాజ్యపు



అంతిమ అధ్యాయం అలా ముగిసింది. ఢిల్లీ పతనం తిరుగుబాటు వైఫల్యానికి సంకేతంగా నిలిచింది. అయినప్పటికీ ఈ పోరాటం దేశవ్యాప్తంగా చైతన్యాన్ని రగిలించింది. తిరుగుబాటు విఫలమైన కారణాలు అనేకం. తిరుగుబాటు దారులలో ఐక్యత లేకపోవడం, సమన్వయ లోపాలు, ఆధునిక ఆయుధాల కొరత, సైనిక శిక్షణలో లోపాలు, కొంతమంది స్థానిక రాజులు కంపెనీకి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు తిరుగుబాటును దెబ్బతీశాయి. కానీ విఫలమైనా ఈ పోరాటం భారత జాతి చరిత్రలో ఒక మలుపు. 1857 తిరుగుబాటు తరువాత 1858లో తూర్పు ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసి, భారతదేశం నేరుగా బ్రిటిష్ కిరీటం ఆధీనంలోకి వెళ్లింది. పాలనా విధానాలలో మార్పులు చేశారు. భారతీయులలో జాతీయ చైతన్యం పెరిగింది. తిరుగుబాటు వీరుల త్యాగాలు తర్వాతి శతాబ్దం పాటు సాగిన స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచాయి. ఝాన్సీ రాణి వీరత్వం, సిపాయిల ధైర్యం, బహదూర్ షా జఫర్ ఆవేదన, నానా సాహెబ్ పోరాటం అన్నీ భారతీయుల మదిలో శాశ్వతంగా ముద్రించాయి. సెప్టెంబర్ 20, 1857 ఢిల్లీ పతనం ఒక తిరుగుబాటు ముగింపు మాత్రమే కాదు, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బలమైన పునాదిగా నిలిచిన చారిత్రక ఘట్టం. దాస్యపు సంకెళ్ళను తెంచుకునే ప్రయత్నం మొదలైన రోజు అదే. ప్రాణత్యాగాలు, రక్తసిక్త వీధులు, విఫలమైన ఆశయాలు అన్నీ కలసి తరువాతి తరాలకు స్వేచ్ఛా వాంఛను నింపాయి. ఈ పోరాటం భారతీయులలో జాతీయం అనే భావనను మేల్కొలిపి, "స్వాతంత్ర్యం" అనే మహత్తర లక్ష్యానికి మార్గదర్శకంగా నిలిచింది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

# సంపాదకీయం

## పాక్ - సౌదీ తాజా బంధం.. మనకు కాస్త చికాకు పెట్టించేదే

దాయాది పాకిస్థాన్ – సౌదీ అరేబియాల మధ్య తాజాగా జరిగిన ఒక రక్షణ ఒప్పందం మధ్యప్రాచ్యం.. దక్షిణాసియాల్లో మారనున్న సమీకరణాలకు వేదిక మారుతుందని చెప్పాలి. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ల మధ్య ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులోని కొన్ని అంశాలు అత్యంత కీలకంగా మారాయి. ఇది నాటో కూటమి నిబంధనల్లోని ఆర్టికల్ 5 లాంటిదే. ఈ రక్షణ ఒప్పందంలో భారత్ ను చికాకు పెట్టించే అంశం ఒకటి ఉంది. అదేమంటే.. ఈ రెండు దేశాల్లో ఏ ఒక్క దేశంపై ఎవరు దాడికి దిగినా ఆ రెండు దేశాలపై దాడికి పాల్పడినట్లుగా భావిస్తాయి. అంటే.. సౌదీపై ఏ దేశమైనా దాడికి తెగబడితే.. పాకిస్థాన్ మీదకు దండెత్తినట్లుగా భావిస్తారు. అదే సమయంలో పాకిస్థాన్ మీద ఏ దేశమైనా దాడికి దిగితే సౌదీపైనా యుద్ధాన్ని ప్రకటించినట్లే అవుతుంది. ఈ మధ్యన జరిగి ఆపరేషన్ సిందూర్ లాంటిదే జరిగితే.. పాక్ తోనే కాదు.. సౌదీతోనూ పంచాయితీ మొదలైనట్లుగా అవుతుంది. ఇరాన్ – సౌదీ మధ్య ఉన్న శత్రుత్వం కూడా తెలిసిందే. భారత్ – పాక్ మధ్య ఉన్న చారిత్రక శత్రుత్వం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొత్తంగా చూస్తే.. తాజా డీల్ అటు మధ్యప్రాచ్యంలోనూ.. ఇటు సౌత్ ఏషియాలోని మిలిటరీ సమీకరణాలపై ప్రభావాన్ని చూపించే వీలుంది. తాజా ఒప్పందంలో నిఘా సమాచారం పంచుకోవటం.. సైబర్ సెక్యూరిటీ పరంగా సహకారం.. సంయుక్త సైనిక విన్యాసాల నిర్వహణ లాంటి అంశాలు కూడా ఉన్నాయి. ఈ ఒప్పందంతో సౌదీ ఇకపై అమెరికా మీద ఎక్కువగా ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఎప్పుడైనా ఇరాన్ నుంచి ఏదైనా ముప్పు వాటిల్లిన పరిస్థితుల్లో అమెరికాయుద్ధ నౌకల కోసం వెయిట్ చేయాల్సిన అవసరం లేకుండా.. తన చేతిలో పాక్ అనే ఒకఆయుధాన్ని సిద్ధం చేసుకునే ప్రయత్నంగా దీన్ని చెప్పొచ్చు. తాజా ఒప్పందం ట్రంప్ ప్రభుత్వానికి ఒక ఎదురుదెబ్బగా చెప్పక తప్పదు. ఇటీవల కాలంలో అగ్రరాజ్యం పాక్ తో సన్నిహితంగా వ్యవహరిస్తున్న వేళ.. ఇప్పుడు ఆ దేశం సౌదీతో చేసుకున్న డీల్ చూసినప్పుడు ఆ దేశం అమెరికాకు ప్రాధాన్యత తగ్గించేలా ఉందని చెప్పాలి. పాకిస్థాన్ కు సౌదీకి మధ్య సత్ సంబంధాలు దశాబ్దాల తరబడి సాగుతున్నదే. తాజా ఒప్పందం పాక్ కంటే కూడా సౌదీకే ప్రయోజనం కలిగించేలా చెప్పాలి. ఎందుకంటే తన సంపదతో పాక్ ను తన నియంత్రణలో ఉంచుకునే విషయంలో సౌదీ కాస్తంత తెలివిగా వ్యవహరించింది. అదే సమయంలో అమెరికా సైతం ఇప్పటికిప్పుడు సౌదీని ఏమీ అనలేని పరిస్థితి. అదే సమయంలో ఆపరేషన్ సిందూర్ వేళ.. పాక్ తన వైమానిక దళానికి చెందిన బలహీనతల్ని భారీగా గుర్తించింది. తాజా డీల్ తో పాక్ కు సౌదీ నుంచి వైమానిక దళానికి చెందిన సాంకేతికత అందుతుంది. మొత్తంగా చూసినప్పుడు.. ఈ డీల్ భారత్ కు చికాకు పెట్టేదిగా ఉంటుందని మాత్రం చెప్పక తప్పదు. తనతో స్నేహంగా ఉండే రెండు దేశాలు.. తన ప్రాధాన్యత తగ్గేలా వ్యవహరించిన వైనంపై అమెరికా ఎలా రియాక్టు అవుతుందన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగా చెప్పాలి.


## క్యారక్టర్ ఆర్టిస్టు ధర్మవరపు - సెప్టెంబర్ 20.. ధర్మవరపు సుబ్రహ్మణ్యం జయంతి



ధర్మవరపు సుబ్రహ్మణ్యం (సెప్టెంబర్ 20, 1954 – డిసెంబర్ 7, 2013) తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రముఖ హాస్యనటుడు కమ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్. ఆయన సినిమా స్టార్ మాత్రమే కాదు, సీరియల్ ఆర్టిస్ట్ కూడా. టీవీ రంగం నుండి సినిమా రంగంలోకి ప్రవేశించాడు. 23 ఏళ్లలో వందలది చిత్రాల్లో నటించాడు. వామపక్ష భావాలు కలిగిన సుబ్రహ్మణ్యం గతంలో ప్రజా నాట్య మండలి తరఫున ఎన్నో నాటకాలు, ప్రదర్శనలు ఇచ్చాడు. దూరదర్శన్ లో ప్రసారమైన ప్రముఖ రచయిత యర్రంశెట్టి సాయి రచించిన ఆనందో బ్రహ్మ ద్వారా గుర్తింపు పొందాడు. తద్వారా చిత్రరంగంలో ప్రవేశించి హాస్యపాత్రల్లో తనదైన ముద్ర వేశాడు. అంతేకాక దర్శకునిగా (తోకలేని పిట్ట) కూడా కొంత ప్రయత్నం చేశాడు. ఆయన 2004 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ విజయానికి తన వంతు కృషి చేశాడు. 2004 నుండి 2013 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా కొన సాగాడు. ధర్మవరపు సుబ్రహ్మణ్యం 1954 సెప్టెంబర్ 20 న ప్రకాశం జిల్లా లోని బల్లికురవ మండలం కొమ్మినేనివారి పాలెంలో ఓ వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోతే నలుగురు పిల్లలను ఆ తల్లే పెంచి పెద్ద చేసింది. ఉన్నత పాఠశాల విద్యను అద్దంకిలోనూ, ఇంటర్ ఒంగోలు సి.ఎస్.ఆర్ శర్మ కళాశాలలోనూ చదివాడు. ఆ దశలోనే ఆయనకు ప్రజానాట్య మండలితో పరిచయం ఏర్పడింది. నాటకాల మీదే ఎక్కువ దృష్టి పెట్టడంతో ఇంటర్లో ఉత్తీర్ణులు కాలేదు. అమ్మ బాధ చూసి మళ్ళీ పట్టుదలగా సప్లిమెంటరీ పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. తరువాత బీకాంలో చేరినా ఆయన మనసు సినిమాల వైపే ఉండేది. ఇంట్లో చెప్పకుండా మద్రాసు వెళ్ళి పోయాడు. అక్కడ అవకాశాలు రాకపోవడంతో మళ్ళీ సొంత ఊరుకు తిరిగి వచ్చాడు. మద్రాసు నుండి తిరిగి వచ్చి కొన్నాళ్ళు వ్యవసాయ పనుల్లో ఉండగా కొందరు మిత్రుల సలహా మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాశాడు. అందులో ఉత్తీర్ణుడవడంతో హైదరాబాద్ లోని పంచాయితీ రాజ్ శాఖలో అధికారిగా ఉద్యోగం వచ్చింది. అక్కడ కొద్ది కాలం కుదుట పడ్డాక ఆయన దృష్టి మళ్ళీ నాటకాల వైపు మళ్ళింది. తరువాత ఆకాశవాణి కోసం కొన్ని రేడియో నాటకాలు రాశాడు. తరువాత దూరదర్శన్ లో తొలి తెలుగు ధారావాహిక అనగనగా ఒక శోభను ప్రారంభించారు. ఆ తరువాత మనసు గుర్రం లేదు కళ్లెం, పరమానందయ్య శిష్యుల కథ ఆయనకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దూరదర్శన్ లో ని పాపులర్ సీరియల్ ఆనందో బ్రహ్మ ఆయనకు సినిమా పరిశ్రమలోకి రావడానికి మార్గం సుగమం చేసింది. ఈ సీరియల్ 1980 వ సంవత్సరంలో ప్రసారం చేయ బడింది. తద్వారా ఆయన తెలుగు వారందరికీ చిర పరిచితుడయ్యాడు. దూరదర్శన్ లో ఉండగానే ఆయనకు జంధ్యాల సినిమా జయమ్ము నిశ్చయమ్మురాలో అవకాశం వచ్చింది. నటనలో తలమునకలై ఉండగానే తోక లేని పిట్ట అనే సినిమాకు దర్శకత్వం, సంగీత దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించనంతగా ఆడక పోవడంతో మళ్ళీ దర్శకత్వ బాధ్యతల జోలికి పోలేదు. నువ్వు నేను, ధైర్యం చిత్రాల మొదలుకొని చాలా చిత్రాల్లో అధ్యాపక పాత్ర వేసి నవ్వించాడు. అయితే ఆ పాత్రలను కించ పరిచే విధంగా మలుస్తు ఉండటంతో క్రమంగా ఆ పాత్రలకు స్వస్తి పలికాడు. ఆయన నట ప్రస్థానంలో ఒక్కడు సినిమాలో చేసిన పాస్‌పోర్ట్ ఆఫీసర్ పాత్ర, వర్షం సినిమాలో వాతావరణ వార్తలు చదివే గాలి గన్నారావు, రెడీ సినిమాలో హ్యాపీ రెడ్డి అలియాస్ సంతోష్ రెడ్డి మొదలైన పాత్రలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. అన్నం అమృతం సిని మాకు ఉత్తమ హాస్యనటుడిగా "నంది అవార్డు" అందుకున్నారు. ఆయన నటించిన చివరి సినిమా ప్రేమాగీమా జాంతానై విడుదల కాక ముందే తనువు చాలించాడు. అప్పటికే అనారోగ్యంగా ఉన్నప్పటికీ ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వికారాబాద్‌లో జరిగిన షూటింగ్‌కు హాజరైనాడు. అతను 2011 నుండి సాక్షి టీవీలో రాజకీయ వ్యంగ్య కార్యక్రమం మరియు 'డింగ్ డాంగ్' ను నిర్వహించాడు. ఆరు నెలలుగా కాలేయ కేన్సర్‌తో బాధపడి, డిసెంబర్ 7, 2013 శనివారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## చరితార్థుడైన కథానాయకుడు అక్కినేని - సెప్టెంబర్ 20... తెలుగుజాతి గర్వించ దగిన మహా నటుని జన్మదినం

తెలుగు జాతి గర్వించదగ్గ మహా నటుడు అక్కినేని నాగేశ్వరరావు. అక్కినేనిని నిర్వచించడం ఎవరి తరం? మహా నటుడిని విశ్లేషించడం ఎవరికి సాధ్యం? ఆయన రాసిచ్చిన "అఆలు" దిద్దనంత సులువు కాదు, అంత రంగాన్ని అర్థం చేసుకోవడం, అలుపెరుగని ప్రయాణంలో ఆయన్ని అందు కోవడమే కాదు, అనుసరించడమూ ఎవరికీ సాధ్యం కాలేదు. తెలుగు సినిమా నుంచి అక్కినేని నేర్చుకున్న దానికంటే, నేర్పిపెట్టిందే ఎక్కువ. అందుకే – తెలుగు సినిమా చదివితే అక్కినేని అర్థం కాకపోవచ్చు.. అక్కినేనిని చదివితే మాత్రం తప్పక తెలుగు సినిమా అవగత మవుతుంది. అంతెందుకు పొడిగానో తడిగానో అక్కినేని గురించి చెప్పాలంటే మళ్లీ అక్కినేని రావాలి. లేదా ఆయన వదిలెల్లిన అఆలు జ్ఞాపకాల పలకలపై దిద్దుకోవాలి. తెలుగు చిత్రసీమను దశాబ్దాలపాటు నిరాటంకంగా ఏలిన రాజులు ఇద్దరు. ఒకరు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రాముడు, మరొకరు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. చిత్రసీమలో నటులుగా పోటీ పడినా, జీవితంలో సోదర భావంతో మెలిగిన ఇరువురూ తెలుగు ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. తెలుగు చిత్ర పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ మార్చడంలో ప్రముఖ పాత్ర పోషించాడు అక్కినేని. పరభాషా చిత్ర పరిశ్రమ నుండి తెలుగు చిత్ర పరిశ్రమని వేరు చేసి, మన పరిశ్రమ ఔన్నత్యాన్ని దేశ విదేశాలకు చాటిన మహా నటుడు, నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేత. తన వారసులను పరిశ్రమకు అందించాడు అక్కినేని. స్టేజి నాటకాలలో స్త్రీ పాత్రలతో నటనకు మెరుగులు దిద్దుకునే క్రమంలో నాగేశ్వర్ రావు... ప్రముఖ చిత్ర నిర్మాత ఘంటసాల బల రామయ్యకు విజయ వాడ రైల్వే స్టేషన్ లో తారస పడి, ధర్మపత్ని సినిమాతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేశారు. 90యేళ్ల జీవితంలో 75 సంవత్సరాలు విభిన్న పాత్రల ద్వారా తెలుగు చిత్రరంగ క్రమానుగత ప్రగతిలో విడదీయ లేని బంధం, అనుబంధం అక్కినేనిది. 1928 సెప్టెంబర్ 20న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో వెంకట రత్నం పున్నమ్మ దంపతులకు జన్మించిన అక్కినేని, బాల్యం నుంచే నాటకాల మీద అనురక్తి పెంచు కున్నారు. 1941 లో పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన ధర్మపత్ని బాల నటునిగా తొలిసారి మేకప్ వేసుకున్నారు. 1944లో ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకునిగా తెరకు ఎక్కించిన సీతారామ జననంలో, పూర్తి స్థాయి కథా నాయకుడి పాత్ర పోషించారు. 1949లో అన్నపూర్ణను వివాహ మాడిన అక్కినేని.. తెలుగు తమిళ, హిందీ భాషల్లో 256 సినిమాలు చేసిన అనుభవజ్ఞుడు. చివరిగా 1991 లో ఆయన నట జీవితం స్వర్ణోత్సవం సందర్భాన విడుదలైన సీతారామయ్య గారి మనమరాలు, కొత్త, యువ నటుల చిత్రాలతో పోటీపడి బాక్సాఫీసు హిట్ గా నిలిచింది. తన పుత్రుడు అక్కినేని నాగార్జున, మనవడు నాగ చైతన్యతో చివరి సినిమాలో ఆయన కలిసి నటించారు. ఆయన మనం చిత్రంలో సహజ నటనా ప్రతిభను రుచి చూపించారు. 75ఏళ్ళ సినీ ప్రస్తానంలో శరత్ చంద్ర నవల ఆధారిత దేవదాసు (1953)లో భగ్న ప్రేమికుని పాత్రకు జీవం పోశారు. ఈ పాత్రకు ఆ తర్వాత మరెంతో మంది మరిన్ని భాషలలో నటించినా, హిందీ సినిమా నటుడు దిలీప్ కుమార్... అక్కినేని నటించినదే ఒకేఒక దేవదాసు అని ప్రశంసించాడు. 1966లో నవ రాత్రి చిత్రంలో 9 పాత్రలు పోషించి ఔరా! అనిపించారు. 1975 లో భార్య అన్నపూర్ణ పేరు మీద అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించిన అక్కినేని అన్నపూర్ణ బ్యానర్ లో మొదటి సినిమా కళ్యాణి. అన్నపూర్ణ బ్యానర్ లో వచ్చిన మొదటి బ్లాక్ బస్టర్ మూవీ ప్రేమాభిషేకం. 1981 లో వచ్చిన ఈ సినిమా ఓ సంచలనం సృష్టించింది. లైలా మజ్ను, అనార్కలి, బాటసారి, ప్రేమ్ నగర్, ప్రేమాభిషేకం, మేఘ సందేశం లాంటి సినిమాల్లో విషాద పాత్రల్లో, మిస్సమ్మ, చక్రపాణి, ప్రేమించి చూడు వంటి చిత్రాల్లో హాస్యరస ప్రధాన పాత్రలు, మాయా బజార్ లో అభిమన్యునిగా, చెంచు లక్ష్మిలో విష్ణువుగా, భూకైలాస్ లో నారదునిగా, శ్రీకృష్ణార్జున యుద్ధంలో పాండవ మధ్యమునిగా పౌరాణిక పాత్రల్లో మెప్పించారు. అక్కినేని నటించిన తొలి స్వర్ణోత్సవ చిత్రం 1971 లో వచ్చిన దసరా బుల్లోడు. తెలుగులో తొలి ద్విపాత్రాభినయం చేసిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు. దాసరి దర్శకత్వం వహించిన ప్రేమాభిషేకం హైదరాబాద్ లో 533రోజులు, నిరంత రాయంగా 365 రోజులు ప్రదర్శితమైన ఒకే ఒక్క తెలుగు సినిమా రికార్డు సొంతం చేసుకుంది. జయ దేవ, కాళిదాసు, జక్కన, విప్ర నారాయణ పాత్రలు అక్కినేని నటనకు కలికి తురాయిలు. మట్టి మనుషులు, ఒకే ఒక్కడు బుల్లితెర సీరియల్స్ లో నటించి, సమకాలీన నటులకు మార్గ దర్శకులు అయినారు. 1968లో భారత ప్రభుత్వ పద్మశ్రీ, 1988లో రఘుపతి వెంకయ్య అవార్డు, 1989లో రాజ్ కపూర్ స్మారక అవార్డు, 1991 లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్, 94లో లైఫ్టైమ్ అచీవ్మెంట్, 95 లో అన్నా అవార్డు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, డాక్టర్ ఆఫ్ లెటర్స్, మూడు ఫిల్మ్ ఫేర్, నట సామ్రాట్, కళా ప్రపూర్ణ లాంటి లెక్కలేనన్ని అవార్డులు సొంతం చేసుకున్న మహా నటుడు అక్కినేని. గుడి వాడ కళాశాలకు అక్కినేని ఇచ్చిన బూరి విరాళం తోనే ఏఎన్ఆర్ కళాశాల నామాంకిత అయింది. నటసామ్రాట్ బిరుదాంకితుడుగా నటనా ప్రస్థానంలో ఎన్నో పాత్రల్లో నటించి మరెన్నో మరపు రాని చిత్రాల్లో తనకు మాత్రమే సాధ్యమయ్యే నటనతో అభిమానులను ఆకట్టు కున్నారు. తన 91 వ ఏట 2014 జనవరి 22న తెలుగు జాతి గర్వించ దగిన మహా నటుడు పరమ పదించే వరకు వెండి తెరతో విడదీయ రాని వ్యక్తిగా కొనసాగారు. నట సామ్రాట్ అక్కినేనికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు – అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, సరోజా. భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ ద్వారా, కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**



## తెలుగు చిత్ర సీమను ఏలిన నట సామ్రాట్, నట సార్వభౌముడు - సెప్టెంబర్ 20 అక్కినేని జయంతి సందర్భంగా

తెలుగు చిత్రసీమను దశాబ్దాల పాటు నిరాటంకంగా ఏలిన రాజులు ఇద్దరు. ఒకరు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రాముడు, మరొకరు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. చిత్ర సీమలో నటులుగా పోటీ పడినా, జీవితంలో సోదర భావంతో మెలిగిన ఇరువురూ తెలుగు ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. డాక్టర్ నందమూరి తారక రామారావు, డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు... ఇద్దరూ ఇద్దరే. తెలుగు చిత్రరంగానికి రెండు కళ్లు. తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోలకు కొరతగా ఉన్న రోజుల్లో ప్రవేశించి, తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి చేరుకుని తెలుగు జాతి గర్వించదగ్గ చిత్రాలను ఇద్దరూ అందించారు. దశాబ్దాల తరబడి తెలుగు చిత్ర పరిశ్రమకు వీరిద్దరూ రథచక్రాలుగా నిలిచారు. తెలుగు చిత్రరథాన్ని తెలుగు గడ్డకు తరలించడానికి ఎంతో కృషి చేశారు. అంతేకాదు వీళ్లిద్దరూ తెలుగు చిత్ర పరిశ్రమకు క్రమశిక్షణ నేర్పారు. ఆరోగ్య విషయాలతో సహా అన్నింటా క్రమశిక్షణతో మెలిగారు. తెలుగు చిత్ర పరిశ్రమకు గుర్తింపు, గౌరవం, హోదా, డబ్బు తెచ్చిపెట్టిన ఘనత వీరిద్దరిదే. 'స్టార్‌డమ్' అనే మాట ఈ మహానటుల కాలంలోనే తెలుగునాట ప్రవేశించింది. అయితే ఆ అగ్ర శ్రేణి కథా నాయకుల మధ్య కొన్ని పోలికలున్నాయి. ఇద్దరిలో కొన్ని సారూప్యాలు, మరికొన్ని వైరుధ్యాలు కూడా ఉన్నాయి. ఇద్దరూ హీరోలు కాకముందు స్టేజీ మీద స్త్రీ పాత్రలు పోషించారు. అక్కినేని 'హరిశ్చంద్ర'లో చంద్రమతి వేషం వేస్తే... 1940లో కాలేజిలో ఇంటర్ చదివే రోజుల్లో 'రాచమల్లు దౌత్యం' నాటకంలో నందమూరి నాగమ్మ వేషం వేశారు. 1932లో మాట నేర్చి, టాకీ చిత్రానికి శ్రీకారం చుట్టిన తెలుగు సినిమా తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సమయంలో నాగేశ్వరరావు చిత్రరంగం లోకి ప్రవేశించారు. ఆయన వచ్చిన ఏడేళ్ల అనంతరం రామారావు సినీ రంగ ప్రవేశం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు మొదటి చిత్రం 'ధర్మపత్ని'. ఎన్టీఆర్ తొలి సినిమా 'మనదేశం'. వీరు మొదటి చిత్రాల్లో గుర్తింపు పొందని పాత్రల్లో నటించారు. అంతేకాదు ఆ తర్వాత కొన్నేళ్లకు ఆరు నెలల తేడాతో హైదరాబాద్‌లో స్టూడియోలు నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అక్కినేని అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేస్తే.. ఎన్టీఆర్ రామకృష్ణ హార్టికల్చరల్ సినీ స్టూడియోస్ స్థాపించారు. తెలుగు వెండి తెర స్వర్ణ యుగం తొలి దశాబ్ద కాలంలో విడుదల్కెన చిత్రాల సంఖ్యలో సగభాగం ఈ మహానటులు నటించిన చిత్రాలే ఉండటం గమనార్హం. మకుటం లేని మహారాజుల్లా అగ్ర నటులుగా కొనసాగిన వీరిద్దరూ ఎలాంటి భేషజాలకు పోకుండా పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాలు 14 సినిమాల్లో కలిసి నటించారు. ప్రపంచ సినీ చరిత్రలో ఏ ఇద్దరు అగ్రనటులు ఇన్ని సినిమాల్లో ఇన్ని బానర్స్‌లో కలిసి నటించలేదు.



ఇది ఒక రికార్డు. 1950లో 'పల్లెటూరి పిల్ల'తో ప్రారంభించి, ఆ తరువాత సంసారం (1950), పరివర్తన (1954), మిస్సమ్మ (1955), తెనాలి రామకృష్ణ (1956), చరణదాసి (1956), మాయాబజార్ (1957), భూక్కైలాస్ (1958), రేచుక్క (అక్కినేని గెస్ట్.. 1954), గుండమ్మ కథ (1962), శ్రీకృష్ణార్జున యుద్ధం (1963), చాణక్య–చంద్రగుప్త (1977), రామకృష్ణులు (1978), చివరగా సత్యం–శివం (1981) చిత్రాల్లో వీళ్లిద్దరు కలిసి నటించారు. శ్రీకృష్ణార్జున యుద్ధం చిత్రం తరువాత దాదాపు 14 ఏళ్లపాటు ఈ అగ్రనటులిద్దరి మధ్య మాటలే లేక పోవడం గమనార్హం. మళ్లీ 1977లో విడుదల్కెన 'చాణక్య – చంద్రగుప్త' చిత్రంతో ఈ ఇద్దరు అగ్రనటులు కలిసి నటించారు. ఈ చిత్రాన్ని రామారావు ఆయన సొంత నిర్మాణ సంస్థ రామకృష్ణ సినీ స్టూడియోస్ బ్యానర్‌లో స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ చంద్రగుప్తుడుగా నటిస్తే.. అక్కినేని చాణక్యుడిగా నటించారు. తమిళ అగ్ర నటుడు శివాజీ గణేషన్ ఈ చిత్రంలో అలెగ్జాండర్ పాత్రలో నటించారు. చాణక్య చంద్రగుప్త తరువాత తన రెగ్యులర్ ప్రొడ్యూసర్ వి.బి.రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి నాగేశ్వరరావు నిర్మించిన రామకృష్ణులు చిత్రంలో కలిసి నటించారు. ఎన్టీఆర్ పెద్ద అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు నిర్మాణంలో కే.రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన సత్యం – శివం వీరిద్దరి కలయికలో వచ్చిన చివరి చిత్రం. తెలుగు చిత్ర పరిశ్రమను విస్తృతం చేయాలనే లక్ష్యంతో, ధ్యేయంతో కృషి చేసిన అక్కినేని, నందమూరి సేవలను ప్రేక్షకులే కాదు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 1968 జనవరి 26న ఇద్దరినీ ఒకేసారి పద్మశ్రీ బిరుదుతో సత్కరించి, గౌరవించడం విశేషం. 1964లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నంది అవార్డులు ఈ ఇద్దరు అగ్ర నటులు నటించిన చిత్రాలకు దక్కడం విశేషం. ఈ అగ్ర నటులు ఇద్దరూ హిందీ సినిమాల్లో నటించారు. అక్కినేని 'సువర్ణ సుందరి' హిందీ రీమేక్‌లో నటిస్తే...ఎన్టీఆర్ 'చండీరాణి', 'నయా ఆద్మీ' సినిమాల్లో నటించారు. వీళ్లిద్దరు తమిళంలో కూడా తమ సత్తా చాటారు. ఏఎన్నార్, ఎన్టీఆర్ ఇద్దరూ కృష్ణా జిల్లా నుంచి వచ్చినవారే. అక్కినేనిది గుడివాడ తాలూకా వెంకట రాఘవపురం, రామారావుది నిమ్మకూరు. వీరిద్దరూ సినీ పరిశ్రమకు నట వారసులను అందించారు. ఈ రెండు కుటుంబాలకు చెందిన మూడో తరం నట వారసులు కూడా సినిమాల్లో తమదైన ప్రత్యేకతతో రాణిస్తుండటం విశేషం. ఎన్టీఆర్ తన అర్ధాంగి జ్ఞాపకార్థం బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించారు. అక్కినేని తన జీవిత భాగస్వామి పేరిట అన్నపూర్ణ స్టూడియో కట్టించారు. ఈ అగ్ర నటుల భార్యలు వీరిద్దరి కంటే ముందు కన్ను మూసారు. అక్కినేని కంటే ఏడాదిన్నర పెద్ద అయిన ఎన్టీఆర్ సినిమాల్లో రావడానికి పెద్దగా కష్టపడలేదు. వెయ్యి నూట పదహార్ల అడ్వాన్సుతో బి.ఏ.సుబ్బారావు సినిమాలో రామారావు హీరోగా బుక్ అయ్యారు. పాత్రల ఎంపికలో అక్కినేని ఆచితూచి అడుగులు వేస్తే..ఎన్టీఆర్ మాత్రం హీరోయిజం వున్న సినిమాలతో పాటు ప్రతి నాయక పాత్రలు తాగుబోతు, దివ్యాంగుల పాత్రలు వేయడానికి వెనకడుగు వేయలేదు. తన తన నట జీవితంలో ఏఎన్నార్ ఎపుడు కృష్ణుడి పాత్రని వేయలేదు. కానీ సిపాయి చిన్నయ్య చిత్రంలో ఓ పాటలో కృష్ణుడిగా కాసేపు అలా కనిపించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి పార్టీ పెట్టాలనుకున్నప్పుడు అక్కినేనితో సంప్రదించి, ఆయనని కూడా రాజకీయాల్లోకి ఆహ్వానించారు రామారావు. తన ఆరోగ్య కారణాల వల్ల రాలేనని చెప్పి, తన అభినందనలు తెలియ జేసారు నాగేశ్వరరావు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎన్టీఆర్ పదవులు ఆఫర్ చేసినా...మన స్నేహం ముఖ్యమ్కొంది. ఈ పదవులు ఎందుకు బ్రదర్ అని చెప్పి సున్నితంగా తిరస్కరించారు అక్కినేని. ఇంతటి అనుబంధం కలిగిన వీరిద్దరి మధ్య అన్నపూర్ణ స్టూడియోస్‌కి సంబంధించిన ఏడెకరాల స్థలం విషయంలో మళ్లీ మనస్పర్థలు ఏర్పడి దాదాపు ఏడేళ్లు దూరమయ్యారు. అలా దూరం కావడానికీ, తిరిగి తామిద్దరం దగ్గర కావడానికీ కూడా రామారావే కారణమని అక్కినేని చెప్పేవారు. తెలుగు సినిమాకి స్టార్‌డమ్ నేర్పిన ఈ మహానటు లిద్దరూ తమ మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ ఏనాడూ బహిరంగంగా ఒకరినొకరు నిందించు కోలేదు. చివరగా వీరిద్దరు ఒకే నెల (జనవరి)లో కన్నుమూసారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## బాల్యం రక్షణే భవిష్యత్తు భద్రత - పిల్లల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం



పిల్లలు ఒక దేశానికి భవిష్యత్తు, రేపటి పౌరులు. వారు ఆరోగ్యవంతులుగా, జ్ఞానవంతులుగా, విలువలతో పెరిగితేనే సమాజం వికాస పథంలో పయనిస్తుంది. చిన్నారుల సంరక్షణ అనేది కేవలం కుటుంబ కర్తవ్యం కాదుబీ సమాజం, ప్రభుత్వం, అంతర్జాతీయ సమాఖ్యల వరకు ప్రతి ఒక్కరి భాధ్యత. బాల్యాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే భవిష్యత్తు తరాలను బలహీన పరచడం. అందువల్ల పిల్లల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ అత్యవసరమని చరిత్ర, సంఘటనలు, గణాంకాలు మళ్ళీ మళ్ళీ మనకు హెచ్చరికలు ఇస్తూనే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పిల్లల హక్కులను రక్షించేందుకు పిల్లలకు జీవన హక్కు, అభివృద్ధి హక్కు, రక్షణ హక్కు, పాల్గొనుట హక్కు అనే నాలుగు ప్రధాన హక్కులను బలంగా గుర్తించింది. ఈ ఆధారంతోనే ప్రపంచంలోని అనేక దేశాలు పిల్లల కోసం చట్టాలు, విధానాలు రూపొందించాయి. భారత దేశంలో పిల్లల సంరక్షణకు స్వాతంత్ర్యం తర్వాత మరింత శ్రద్ధ కనబరచ బడింది. 1974లో తొలి "జాతీయ బాలల విధానం" రూపొందించ బడింది. 1986 జాతీయ విద్యా విధానం ద్వారా విద్యకు బలమైన పునాది వేసి, 2009లో విద్య హక్కు చట్టంను అమలు చేశారు. దాని ఫలితంగా 6 నుంచి 14 ఏళ్ల మధ్య ప్రతి చిన్నారి విద్యను రాజ్యాంగ హక్కుగా పొందాడు. 2001లో దేశ సాక్షరత శాతం 65% ఉండగా 2011 నాటికి అది 74%కు పెరిగింది. అయితే ఇంకా 2021 గణాంకాల ప్రకారం దాదాపు 3 కోట్ల మంది పిల్లలు పాఠశాలకు దూరంగా ఉన్నారు. ఆరోగ్య పరంగా కూడా పెద్ద సవాళ్లు ఎదురవుతున్నాయి. యునిసెఫ్ 2023 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. దేశంలోని 5 సంవత్సరాల లోపు పిల్లలలో 36% మందికి బరువు తక్కువగా ఉంది. ప్రతి సంవత్సరం దాదాపు 8 లక్షల మంది చిన్నారులు పోషకాహార లోపం, సంక్రమణ వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ICDS సేవలు, POSHAN అభియాన్, మధ్యాహ్న భోజన పథకం వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇక బాల కార్మికత్వం మరో పెను సమస్య. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 160 మిలియన్ల మంది పిల్లలు కార్మికులుగా ఉన్నారు. భారతదేశం లోనే 1.3 కోట్ల మంది చిన్నారులు శ్రమలో నిమగ్నమై ఉన్నారని 2019 అంచనాలు చెబుతున్నాయి. వీరిలో చాలా మంది విద్యా హక్కును కోల్పోతున్నారు. బాల్య వివాహాలు కూడా ఇంకా ఆగిపోలేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 21% బాలికలు 18 ఏళ్లు నిండక ముందే వివాహం చేసుకుంటున్నారు. దీని వల్ల వారు విద్య, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం అన్నింటినీ కోల్పోతున్నారు. పిల్లలపై హింస, దౌర్జన్యాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. NCRB 2022 నివేదిక ప్రకారం ప్రతిరోజూ సగటున 150 పైగా చిన్నారులపై నేరాలు నమోదవుతున్నాయి. లైంగిక దాడులు, అపహరణలు, గృహ హింసలు ప్రధానమైనవే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం 2012లో POCSO చట్టం అమలు చేసింది. కానీ చట్టాలు ఉన్నప్పటికీ అమలు లోపాలు, సమాజంలో అవగాహన కొరవడటం వల్ల చిన్నారుల భద్రత ఇంకా సందేహాస్పదంగానే ఉంది. డిజిటల్ యుగం పిల్లలపై కొత్త ప్రభావాలను చూపుతోంది. టెలివిజన్, మొబైల్, ఇంటర్నెట్ వాడకం పెరగడంతో వారి శారీరక చురుకుదనం తగ్గుతోంది. సాంకేతిక వ్యసనాలు, సైబర్ ముప్పులు, మానసిక ఒత్తిడి సమస్యలుగా మారుతున్నాయి. ఒక తాజా సర్వే ప్రకారం భారతదేశంలోని పిల్లల్లో 20% మంది ఇంటర్నెట్ లేదా గేమింగ్ వ్యసనంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు WHO నివేదిక ప్రకారం ప్రపంచంలో ప్రతి సంవత్సరం ఆత్మహత్య చేసుకునే యువతలో 15%–%19 ఏళ్ల వయసు పిల్లలే ఎక్కువగా ఉన్నారు. ఇది మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అత్యవసరాన్ని సూచిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు పేదరికం, విద్యా లోపం, పోషకాహార సమస్యలతో బాధపడుతుంటే, పట్టణాల్లో అధిక పోటీ, ఒత్తిడి, సాంకేతిక వ్యసనాలు ప్రధాన సమస్యలుగా మారాయి. ఈ రెండు వాతావరణాలూ భిన్నమైనవే అయినప్పటికీ, ఫలితం మాత్రం ఒకటే ‌ పిల్లల భవిష్యత్తు సవాళ్లమయం కావడం. ఈ నేపథ్యంలో పిల్లల సంరక్షణకు సమగ్ర దృష్టి అవసరం. తల్లిదండ్రులు ప్రేమ, ఆదరాభిమానాలు, సురక్షిత వాతావరణం కల్పించాలి. ఉపాధ్యాయులు జ్ఞానంతో పాటు విలువల విద్యనూ అందించాలి. ప్రభుత్వం పథకాల అమలులో పారదర్శకత పాటించి, చట్టాలను కఠినంగా అమలు చేయాలి. సమాజం పిల్లలను కాపాడే, వారిని ప్రోత్సహించే వాతావరణాన్ని ఏర్పరచాలి. పిల్లలు రేపటి దేశాన్ని తీర్చిదిద్దే శక్తి. ప్రతి చిన్నారి చిరునవ్వు మన సమాజపు నిజమైన సంపద. వారిని కాపాడటం, సంరక్షించడం అంటే మన భవిష్యత్తును కాపాడటమే. కాబట్టి పిల్లల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## నీటి‘బొట్టు’... జల‘సిరి’కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రైయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ ‘న్యూస్‌టుడే’తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850

ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20

యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు

చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# ముచ్చటగా మూడు రోడ్లు



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో మూడు ప్రధాన రహదారుల విస్తరణ, నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిధులు మంజూరు చేసింది. కొన్నేళ్లుగా ప్రతిపాదనల్లో ఉన్న ఈ మార్గాలకు మోక్షం కలిగించే విధంగా కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ చూపించారు. గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతులు అందించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర రోడ్లు, మౌలిక వసతుల నిధుల (సీఆర్ఐఎఫ్)ను కేటాయిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఈ మార్గాలకు మహర్దశ చేకూరనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 34 రోడ్లకు రూ.868 కోట్లు మంజూరవగా అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి మూడు రోడ్లకు రూ.150 కోట్లు రానుండటం శుభపరిణామం.

మార్గం : వేములవాడ- సిరికొండ

కి.మీ.లు : 18.2

నిధులు : రూ.23 కోట్లు

ప్రయోజనం : 8 గ్రామాలకు

స్వరూపం : సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల వారు నిజామాబాద్-కామారెడ్డి జిల్లాలకు వెళ్లేందుకు ఇది మరో మార్గంగా మారనుంది. మొత్తం ఈ మార్గం 76 కి.మీ.ల మేర ఉన్నప్పటికీ వేములవాడ, చందుర్తి, కోనరావుపేట మండలాల్లో 18.2 కి.మీ.ల మేర విస్తరించనున్నారు. సింగిల్ రోడ్డుగా ఉన్న దీన్ని నాలుగు వరుసలుగా మార్చనున్నారు. ప్రస్తుతం ఇరుగ్గా ఉన్న ఈ దారి అంతా గుంతలమయంగా ఉంది.

ఆర్నకొండ- మల్యాల చౌరస్తా

35 రూ.50 కోట్లు

9 గ్రామాలకు

పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లోని పలు మండలాలకు ఇది అనుసంధానంగా ఉన్న రోడ్డు. గడిచిన పదేళ్లుగా ఈ మార్గాన్ని విస్తరించాలనే డిమాండ్ ఉంది. కొడిమ్యాల, మల్యాల మండలాల ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండికి వెళ్లడానికి రవాణా మెరుగవనుంది. కల్వర్టుల నిర్మాణంతోపాటు విస్తరణ వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది.

గన్నేరువరం- కొత్తపల్లి

7

రూ.77 కోట్లు

మానేరుపై వంతెన

గన్నేరువరం మండల కేంద్రం నుంచి కరీంనగర్‌కు రావాలంటే దాదాపుగా 30 కి.మీ.లు తిరిగి వస్తున్నారు. మానేరుపై హైలెవల్ వంతెనతోపాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరవడంతో ప్రజలకు మంచి జరగనుంది. గడిచిన మూడున్నర దశాబ్దాలుగా ఈ వంతెన ఏర్పాటు కోసం పోరాటాలు, ఆందోళనలు చేపట్టారు. ఇది నిర్మిస్తే గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు దగ్గరి దారి ఏర్పాటవుతుంది.

**ఇంకొన్నింటికి నిధులు తెస్తా**

బండి సంజయ్‌కుమార్, హోంశాఖ సహాయ మంత్రి

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కేశవపట్నం- సైదాపూర్, కొడిమ్యాల- తాండ్రియాల, నారాయణపూర్ (ఎల్లారెడ్డిపేట)- బండలింగాపూర్ (ముస్తాబాద్) రోడ్ల ప్రతిపాదనలకు ఆమోదం రావాల్సి ఉంది. చందుర్తి- మోత్కురావుపేట, రామడుగు- కిష్టంపల్లి, శంకరపట్నం- అర్కండ్ల మధ్యన వంతెనలకు కూడా వినతులు ఇచ్చాను. వీటన్నింటి రూపురేఖలు మారుస్తాను.

# దాడులు పెరుగుతున్నా..చర్యలు శూన్యం




మంథని : మంథని పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల ప్రజలను శునకాలు, కోతులు ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఉదయం.. రాత్రి అనే తేడా లేకుండా వీధుల్లో తిష్ఠ వేస్తున్నాయి. పనుల నిమిత్తం ఇంటి నుంచి వెళ్లాలన్నా.. రావాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోతులు, కుక్కలు ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా సంచరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా దాడులకు గురవుతున్నారు.

**నివాసాల్లోనే ఆవాసం**నిత్యం వేకువజామునే కోతుల గుంపు ఇళ్లపై తిష్ఠ వేస్తున్నాయి. ఇంటి ఆవరణలోని మొక్కలను నాశనం చేస్తున్నాయి. వస్తువులను చిందర వందర పడేస్తున్నాయి. తలుపులు తీసి ఉంటే నిత్యావసరాలు, ఆహర పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుపడిన వారిపై దాడి చేస్తున్నాయి. మంథని పట్టణంలో కోతులు విచ్చలవిడిగా సంచరిస్తూ వాణిజ్య సముదాయాల్లోకి చొరబడి వస్తువులు ఎత్తుకెళున్నాయని వ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలు ఖర్చు పెట్టి జాలీలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ లాభం లేకుండా పోతుందని వాపోతున్నారు. కాటారం-మంథని రహదారిపై గాడుదుల గండి సమీపంలో అటవీ ప్రాంతం ఉండటంతో వానరాలు సంచరిస్తూ రాకపోకలు సాగించే ప్రయాణికులపై దాడి చేస్తున్నాయి. కోతుల దాడిలో కిందపడి గాయాలపాలైనవారు కోకొల్లలు. నాగారం గ్రామంలో కోతుల బారి నుంచి రక్షించాలని కోరుతూ సోమవారం స్థానికులు గ్రామకార్యదర్శికి వినతిపత్రం అందించారు. దీనిని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పిల్లలు ఒంటరిగా కనిపిస్తే చాలు..**

చిన్న పిల్లలు ఒంటరిగా కనిపిస్తే చాలు కుక్కలు వెంటపడుతున్నాయి. సోమవారం మంథని పట్టణంలో ఓ కుక్క పలువురిని గాయపరిచింది. పలు గ్రామాల పరిధిలో రహదారి సమీపంలోనే ఉంటూ వాహనాలను వెంబడిస్తున్నాయి. మంథని సామాజిక వైద్యశాల పరిధిలో కుక్కలు, కోతుల దాడిలో సెప్టెంబరు 1 నుంచి 15 వరకు 99, గద్దలవిల్లి పీహెచ్‌సీ పరిధిలో 30 కేసులు నమోదు అయినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కోతులను దూర ప్రాంతాలకు తరలించాలని, కుక్కల బారి నుంచి రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వ్యర్థాలు మండించి.. వెలుగులు పంచి



హైదరాబాద్: చెత్తను మండించి విద్యుత్తు ఉత్పత్తి చేయడంలో భాగ్యనగరం రికార్డు దిశగా అడుగులేస్తోంది. ఇప్పటికే జవహర్‌నగర్‌లో 24 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం, దుండిగల్‌లో 15 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం ఉన్నాయి. తాజాగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డులోనే నిర్మించిన రెండో విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్తును డిస్కంకు మళ్లించేందుకు అవసరమైన అనుమతుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. రాబోయే రెండేళ్లలో మరో మూడు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని బల్దియా చెబుతోంది. ఎక్కువ మొత్తంలో చెత్తను మండించి విద్యుత్తును ఉత్పత్తి చేసే నగరాల్లో హైదరాబాద్ రెండో స్థానంలో ఉందని కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**మొదటి స్థానం వైపుగా..**

నగరంలో రోజూ 8,500 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో పొడి చెత్త 4,500 టన్నులు. ప్రస్తుతం జవహర్‌నగర్‌లోని 24 మెగావాట్ల కేంద్రంలో రోజూ 1,350 టన్నుల పొడి చెత్త, దుండిగల్‌లో 800 టన్నుల పొడి చెత్త భస్మం అవుతోంది. రెండో విద్యుదుత్పత్తి కేంద్రం అందుబాటులోకి వస్తే మరో 1,350 టన్నుల చెత్త బూడిద కానుంది. మిగిలిన 1,000 టన్నుల పొడి చెత్తను దగ్గర్లోని సిమెంటు కంపెనీలకు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మరో 3విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి, చెత్త ద్వారా 100 మెగావాట్లకుపైగా విద్యుత్తును ఉత్పత్తి చేస్తామని, అప్పుడు హైదరాబాద్ నగరం దిల్లీని వెనక్కి నెట్టి మొదటి స్థానంలో నిలుస్తుందని జీహెచ్ఎంసీ చెబుతోంది.

## ‘గెల’గిలా కొట్టుకున్నా.. ముమ్మాటికీ అక్రమమే..!

అశ్వారావుపేట : ఆయిల్‌పాం గెలల రవాణాలో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. ఎకరాకు సగటున 157.81 టన్నుల దిగుబడి సాధించినట్లు దంపతులిద్దరూ అక్రమంగా రికార్డులు సృష్టించారు. అందులో భర్త బ్యాంకు ఖాతాకు గెలల సొమ్ము రూ.4కోట్లు, గెలల రవాణా రూపంలో సుమారు రూ.12లక్షలను ఆయిల్‌ఫెడ్ చెల్లించింది. టన్ను గెలల రవాణా ఛార్జీ 15కి.మీ.లోపు రూ.370, 15-30 కిలోమీటర్లు ఉంటే రూ.460 చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో గరిష్ఠ దిగుబడి 14టన్నులకు మించదని సమాచారం.

**దంపతుల పేరిట మోసం**

సత్తుపల్లి మండలం పాకలగూడెం వద్ద భర్త పేరిట పదెకరాలు, భార్య పేరిట ఆరెకరాల ఆయిల్‌పాం తోట ఉంది. వీరిద్దరికీ దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమ నుంచి ఫార్మర్ కోడ్ (ఎఫ్‌కోడ్)లు జారీ అయ్యాయి. ఈఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు పామాయిల్ పరిశ్రమకు 2,225 టన్నుల గెలలను ఆయన పంపించారు. అతడి భార్య పేరిట 300 టన్నుల గెలలను ఈఏడాది జులై 27, 28 తేదీల్లో, సెప్టెంబరు 3 నుంచి 10వరకు పరిశ్రమకు తరలించారు. దీనిపై కొంతమంది రైతులు ఫిర్యాదు చేసే వరకు అధికారులు మేల్కోలేదు. ఆరాతీస్తే దంపతులిద్దరూ తెలంగాణలోని సత్యనారాయణపురం, పాకలగూడెం, ఏపీలోని రాఘవాపురం, చింతంపల్లి, పట్టాయిగూడెం, గురుబట్లగూడెం, లింగగూడెం గ్రామాల్లోని కొంతమంది నుంచి గెలలు కొని అప్పారావుపేటకు తరలించారు. టీజీ ఆయిల్‌ఫెడ్ అనుమతి లేకుండా ఏకంగా కొనుగోలు కేంద్రాన్నే



ఏర్పాటుచేశారంటే అక్రమార్కులు ఎంతగా బరితెగించారో అర్థమవుతోంది. సమీప తోటల నుంచి ఎన్ని టన్నుల గెలలు రావొచ్చు? రవాణా స్థితి, ఎంతమంది రైతులు ఉన్నారో ఆయిల్‌ఫెడ్ సర్వే నిర్వహించి పూర్తిస్థాయి ఒప్పందాలతో దరఖాస్తు సమర్పించిన వ్యక్తికి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తుంది. ఆ కేంద్రానికి ఎఫ్‌కోడ్ కేటాయిస్తుంది. అక్రమంగా గెలలు కొన్న వ్యక్తులు తమ ఎఫ్‌కోడ్‌ల నుంచే అప్పారావుపేట పరిశ్రమకు గెలలను తరలించారు.

**హోల్డ్‌లో రూ.40 లక్షలు..!** పరిశ్రమలకు తరలించిన వారికి చెల్లించాల్సిన సొమ్ములను టీజీ ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు హోల్డ్‌లో పెట్టారు. ఆ సొమ్ములను తీయాలంటే తప్పనిసరిగా ఆయిల్‌ఫెడ్ అనుమతి కావాలి. ఇప్పటికే చెల్లించిన సొమ్ముల మాటేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ‘ఇద్దరు రైతులు పాకలగూడెం వద్ద గెలలు కొని పరిశ్రమకు తరలించారు. వారికి ఇప్పటికే రూ.4కోట్లు చెల్లించాం. అనుమతి లేకుండా కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి గెలలు సేకరిస్తున్నట్టు తెలియగానే ఎఫ్‌కోడ్‌లను నిలిపేశాం. వారికి చెల్లించాల్సిన రూ.40లక్షలను హోల్డ్‌లో ఉంచాం. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపనున్నారు’ అని అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమ మేనేజర్ కల్యాణ్‌కు తెలిపారు.

## కడుపు కోత.. తీరని వెత

నల్గొండ : ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తున్నా అవగాహన కల్పించే వారు కరవయ్యారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగి అమ్మాయి పుడితే రూ.13వేలు, అబ్బాయి అయితే రూ.12వేల నగదుతో పాటు ఎంసీహెచ్ కిట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం నగదు పథకం నిలిచిపోయింది. కిట్లు కూడా అందడం లేదు. దీంతో ఎక్కువ శాతం మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇలా వెళ్తున్నవారిలో 85 శాతం వరకు శస్త్రచికిత్సలే జరుగుతున్నాయి.ప్రభుత్వాసుపత్రులకు ప్రసవాల కోసం వస్తున్న బాధితులను కొందరు కింది స్థాయి ఉద్యోగులు కమీషన్లకు కక్కుర్తి పడి ప్రైవేటుకు పంపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కరిని ప్రైవేటులో చేర్చితే రూ.3-5 వేల వరకు కమీషన్ పొందుతున్నట్లు సమాచారం. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే బాధితులకు ముందుగానే రూ.50వేల నుంచి 60వేల వరకు ప్యాకేజీలు మాట్లాడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాండా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్గొండ**

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం. ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. వైద్యాధికారులతో పాటు సిబ్బందికి ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు చేస్తున్నాం. ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నాం. ఎక్కువ మొత్తంలో నగదు వసూలు చేస్తే పీసీపీఎన్‌డీటీ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

## పోషకాహారమే మహాభాగ్యం..!

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. చిన్నారుల నుంచి గర్భిణుల వరకు పోషక లోపాలతో సతమతమవుతున్నారు. వీరిలో కొంతమంది మంచాలకే పరిమితమవుతుంటే, మరికొందరు మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా బుధవారం (ఈనెల 17) నుంచి అక్టోబర్ 16 వరకు చిన్నారులు, మహిళల్లో పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. తక్కువ ఖర్చుతో స్వయంగా పోషక విలువలను పెంపొందించే విధానాలను విస్తృతపరచుకోవాలని సూచించనుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాలు నిర్వహించనుంది.

యంత్రాంగం చేపట్టనున్న కార్యకలాపాలు

చిన్నారులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యనందించేందుకు కసరత్తు చేస్తుంది.

జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గిస్తూ పంచదార, ఉప్పు, నూనె వాడకాన్ని ఎలా పరిమితం చేయాలనే అంశాలపై అవగాహన కల్పిస్తుంది.

శిశువు, చిన్నారుల్లో సక్రమమైన ఆహార అలవాట్లు అలవడేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

పోషకాహార మిషన్‌లో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధానాలను విశదీకరిస్తుంది.వోకల్ ఫర్ లోకల్ నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించి ఆత్మ నిర్భరతను పెంపొందించనుంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కార్యక్రమాలు చేపడుతుంది.

# నిబంధనలు తొండి.. అక్రమాలు దండి



తాండూరు : వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరు శివారులో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. వెంచర్లలో స్థలాలను ప్లాట్లుగా మార్చి గుంటల లెక్కన విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 15 ఏళ్ల కిందట పట్టణ శివారులో ఎకరం భూమి రూ.5- 10 లక్షల వరకు ఉండేది. కొందరు వ్యక్తిగతంగా, మరికొందరు బృందాలుగా ఏర్పడి కొన్నారు. అప్పట్లో చౌకగా కొన్నవి ప్రస్తుతం రూ.కోట్లలో పలుకుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అలాంటి భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లు అమ్ముకుంటున్నారు.

**వ్యాపార కేంద్రం కావడంతో..**

ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న స్థలాలు రెవెన్యూ దస్త్రాల్లో మాత్రం వ్యవసాయ భూములుగానే దర్శనమిస్తున్నాయి. వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే అక్కడ భూములకు బదులు ఇళ్లు కనిపిస్తున్నాయి. కొన్ని ప్లాట్ల చుట్టూ కంచె వేసుకున్నారు. మరికొందరు రాతి, సిమెంటు కడీలు పాతారు. తాండూరు పట్టణం ఉపాధి కేంద్రం కావడంతో సిమెంటు పరిశ్రమలు, నాపరాళ్లు, సుద్ద గనులు, రవాణా రంగం, పాలిష్ యూనిట్లలో పనిచేస్తూ జీవిస్తున్న చాలా మంది భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్లాట్లు కొంటున్నారు. పట్టణానికి పొరుగున ఉన్న మండలాలకు చెందిన చాలా మంది తీసుకున్నారు.

**ఇవీ నిబంధనలు..**

వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేయాలంటే నాలా అనుమతి తీసుకోవాలి. డీటీసీపీ లేఅవుట్‌గా మార్చాలి. 20 నుంచి 60 అడుగుల వెడల్పుతో అంతర్గత రహదారులు, వీధిదీపాల ఏర్పాటుకు స్తంభాలు, మురుగు ప్రవాహ కాలువలు నిర్మించాలి. తాగునీటి సరఫరాకు ఉపరితల ట్యాంకు, ఉద్యానవనం, పాఠశాల అందుబాటులో ఉండాలి. అన్నింటికి కలిపి 10 శాతం స్థలాన్ని పురపాలికకు అప్పగించాలి. ఇవన్నీ కావాలంటే లేఅవుట్ విస్తీర్ణాన్నిబట్టి భారీగానే ఖర్చవుతుంది. దీంతో ఇవేవీ లేకుండా స్థిరాస్థి వ్యాపారులు నేరుగా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి గజాల లెక్కన విక్రయించి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**200 ఎకరాలకుపైనే..**

కోకట్, అంతారం, సాయిపూరు, మల్‌రెడ్డిపల్లి, ఇందిరానగర్, రసూల్‌పూర్, బషీర్‌మియాతండా, బామ్లానాయక్ తండా, చెంగేష్‌పూరు, పాత తాండూరు, గౌతాపూరు, ఖాంజాపూరు, కందనెల్లి గ్రామాల శివారులో 200 ఎకరాలకుపైనే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించారు. ప్రస్తుతం అవన్నీ వ్యవసాయ భూములుగానే దస్త్రాల్లో దర్శనమిస్తున్నాయి.

**తాఖీదులు జారీ చేస్తాం- సుధాకర్, కోకట్ పంచాయతీ కార్యదర్శి**

పంచాయతీ పరిధిలో 2020 తరవాత అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసిన వారికి తాఖీదులిస్తాం. ఇప్పటికే ఓ వెంచర్‌కు సంబంధించిన యజమానికి అందించాం. 2020కి ముందు ఏర్పాటు చేసిన ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

# కేసులు తగ్గిన అక్రమాలు ఆగలే!

జగిత్యాల: రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ మొదలైంది. ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నమోదయ్యే కేసుల సంఖ్య మూడో వంతుకు తగ్గినప్పటికీ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. జిల్లాలో ఈ ఏడాది నమోదైన కేసులకు సంబంధించి తాజా గణాంకాలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

**దొరికింది 945 క్వింటాళ్లు**

జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 6ఏ కేసులు 109 నమోదయ్యాయి. ఇందులో 33 కేసులు ఎల్‌పీజీ సిలిండర్ల అక్రమ వినియోగానికి సంబంధించినవి. మిగిలిన 76 కేసులు పీడీఎస్ బియ్యానికి సంబంధించినవి. 6ఏ కింద వీటిని నమోదు చేసి 1,257 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 23 కేసులు మాత్రమే నమోదైనా 1,133.04 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 188 క్వింటాళ్లు మాత్రమే దొడ్డు బియ్యానివి. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 945 క్వింటాళ్ల సన్న బియ్యం దొరికాయి. ఇందులో ఓ రైస్ మిల్లులో దొరికిన సన్నబియ్యం 870



క్వింటాళ్లు కాగా, మరికొన్ని కేసుల్లో పౌరసరఫరాల అధికారులు మరో 75 క్వింటాళ్లు పట్టుకున్నారు.

**అనర్హులైన లబ్ధిదారులతోనే!**

ప్రభుత్వం ఆరు నెలల కిందట సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. పంపిణీలో పారదర్శకత కోసం ప్రతినెలా పీవోఎస్ విధానంలో లబ్ధిదారులకు అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నా బియ్యం అక్రమ రవాణా కొనసాగుతుండటంపై యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పేద, మధ్యతరగతి వర్గాలతో పాటు ధనికులకు కార్డులు జారీ చేయడం వల్లే బియ్యం పక్కదారి పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఓ ఆటోను పట్టుకున్న ఘటనలో ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరిస్తున్నానని డ్రైవర్ చెప్పడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

**నిఘా పెంచాం**

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యానికి ఆదరణ కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే 6ఏ కేసులు గణనీయంగా తగ్గాయి. రైస్ మిల్లుల్లో పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మినహాయిస్తే, ఈ ఏడాది పట్టుబడిన బియ్యం 75 క్వింటాళ్లే. అక్రమ రవాణాకు అవకాశం లేకుండా అన్ని విధాలుగా నిఘా పెంచాం. ఈ విషయంలో ఎవరైనా నిర్భయంగా సమాచారం ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

# రేషన్ దందా.. అక్రమార్కుల పంథా

భగత్‌నగర్: దొడ్డు బియ్యం చాలా మంది తినడం లేదని, సన్నబియ్యం అయితే ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం దీన్ని పంపిణీ చేస్తోంది. దీంతోపాటు బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించారు. అయినా అక్కడక్కడా అక్రమ రవాణా జరుగుతోంది.

**ఇంటింటికీ తిరిగి..**

రేషన్ బియ్యం చిరు వ్యాపారుల నుంచి దళారులకు అక్కడి నుంచి రైస్‌మిల్లులకు గొలుసుకట్టు విధానంలో చేరుతోంది. చిరు వ్యాపారులే స్వయంగా ఇంటింటికీ తిరిగి రూ.19 నుంచి రూ.20 వరకు వెచ్చించి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. మధ్య దళారులకు రూ.22 నుంచి రూ.23కు విక్రయిస్తున్నారు. వీరు ఆయా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇలా జిల్లాలో రోజుకు 15 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. ప్రత్యేకంగా అడ్డాలు ఏర్పాటు చేసుకొని మరీ దళారులు వ్యాపారం చేస్తున్నారు.

**ప్రభుత్వ ధాన్యంతోనే..**

రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి ధాన్యాన్ని కొనుగోలు చేసి మర ఆడించి నిరుపేదల ఆకలి తీర్చడానికి పంపిణీ చేస్తోంది. మర ఆడించడానికి ఇచ్చిన ధాన్యాన్ని వ్యాపారులు పక్కదారి పట్టిస్తుండగా



ఆ బియ్యం స్థానంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొని ప్రభుత్వానికి కస్టం మిల్లింగ్ బియ్యంలా అందిస్తున్నారు. రీసైక్లింగ్ చేస్తూ పలువురు రైస్‌మిల్లుల యజమానులు పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వ ధాన్యంతో దందా చేస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు. ఈ చర్యలను నిరోధించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

**అక్కడ ఆదర్శం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ బియ్యం దందాను అడ్డుకోవడానికి అధికారులు ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులకు కట్టడి చేశారు. బియ్యం కొనుగోలు చేసిన ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. వ్యాపారం కట్టడి కావడంతో రేషన్ బియ్యం సరఫరా చేసేవారు లేక అక్కడ దందాకు తెరపడింది. అయితే జిల్లాలో బాహటంగా జరుగుతున్న దందాను నిరోధించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నెలా మిల్లుల్లోని ధాన్యం నిల్వల లెక్కలు తనిఖీలు చేస్తే మిల్లర్లు రేషన్ బియ్యం కొనుగోలు చేయడానికి వెనకడుగు వేసే అవకాశం ఉంటుంది.

# యోధుల త్యాగఫలం.. ఏదీ ప్రతిఫలం



పెద్దపల్లి: పెద్దపల్లికి చెందిన సమరయోధుడు మల్లోజుల వెంకటయ్యకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాం సమీపంలో 5 ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేసింది. అయితే అది కాస్త ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైంది. దీంతో పరిహారం లేదా మరోచోట భూమి ఇవ్వకపోవడంతో వెంకటయ్య భార్య మధురమ్మ చనిపోయేంత వరకు కార్యాలయాల చుట్టూ తిరిగారు.

సమరయోధులకు భూమి పంపిణీ చేయగా అందులో అధికశాతం సాగుకు యోగ్యమైనవి కావు. గుట్టలు, చెట్లతో నిండగా మరికొన్నింటిలో చెక్‌డ్యాంలు సైతం ఉన్నాయి. వీటిని సాగు చేయలేకపోతున్నారు.

జాతీయ పండగలు వచ్చిన ప్రతిసారి సమరయోధులను స్మరించుకోవడం, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం వరకే సరిపోతుంది. వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, నాయకులు ఇసుమంతైనా స్పందించిన దాఖలాలు కనిపించడంలేదు. పెద్దపల్లిలో భూసంబంధ సమస్య పరిష్కారానికి వచ్చిన ఓ సమరయోధుడి భార్య సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా అంతటా నెలకొంది.

**దరఖాస్తులపై పట్టింపేది?** జీవో 185 ప్రకారం సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం 5 ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్ట భూమి, ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంటుంది. తోటపల్లి గాంధీగా గుర్తింపు పొందిన బోయినపల్లి వెంకటరమణారావు ఆధ్వర్యంలో రేకుర్తి సమీపంలో 300 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరగగా.. కొంతమందికే ప్లాట్లు లభించాయి. ఉమ్మడి జిల్లాలో మరెక్కడా ఇలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇళ్ల స్థలాలకు అభ్యర్థించిన దరఖాస్తులు కూడా మోక్షానికి నోచుకోలేదు.

**వారసుల్లో ఆందోళన**

సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో వారి వారసులు ప్రయోజనం అందుకోలేకపోతున్నారు. ఇచ్చిన భూమిని అమ్ముకునేందుకు ఎన్‌వోసీ ఇవ్వడంలేదు. వీరితోపాటు మాజీ సైనికులకు ఇచ్చిన భూములు ధరణిలో నిషేధిత జాబితాలో చేర్చడంతో.. కష్టకాలంలో వాటిని అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. వేదికపై చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో జరిగే పనులకు పొంతన కుదరడంలేదు.

**నిషేధిత జాబితా నుంచి తొలగించాలి**

సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు ధరణిలో నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వం సమస్యను పరిష్కరించి వారసుల కుటుంబాలకు ఊరట కల్పించాలి. ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలి. వెంకటేశం, వారసుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు

# కలిపేసుకున్నారు.. కట్టేస్తున్నారు



హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములుంటే అక్రమార్కులకు పండగే. ఖాళీ స్థలాలు, రహదారులను ఆక్రమిస్తున్నారు. కొన్ని నెలల నుంచి తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ టోల్‌ప్లాజాకు సమీపంలో సర్వీసు రోడ్డును కబ్జా చేసి భవనాలు నిర్మిస్తున్నారు. పట్టాభూములను కొనుగోలు చేసి.. వాటి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు సరిహద్దులను కలిపేసుకున్నారు. లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు సరిహద్దుల్లో మెట్లు నిర్మించారు. శంషాబాద్ మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వకున్నా చకచకా కట్టేస్తున్నారు.

**ఉదయం.. సాయంత్రం..**

తొండుపల్లి టోల్‌ప్లాజా ఎగ్జిట్ 16 వద్ద సర్వీస్ రహదారి సరిహద్దుల్లో భవనాలుండడం, అక్కడికి వచ్చే వారి బండ్లను సర్వీస్ రోడ్డుపై ఉంచడంతో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు ఒక్కసారిగా నిలిచిపోతున్నాయి. వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఒక్కోసారి కిలోమీటర్ వరకు వాహనాలు ఆగిపోతున్నాయి. వ్యాపారులు బయేట కౌంటర్లు ఏర్పాటు చేయడం, వారి వాహనాలను కూడా బయటే పార్కింగ్ చేస్తున్నారు. వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఒక్కోసారి డ్రైవర్లు భారీ వాహనాలను పక్కనపెట్టి దారి చేసుకొని వెళ్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది ఉన్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

**విస్తరణ ప్రతిపాదన పక్కన పడేశారు**

తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద రద్దీ పెరుగుతోంది. దీంతో విస్తరణకు హెచ్‌ఎండీఏ అధికారులు చేసిన ప్రతిపాదనలకు మోక్షం కలగడంలేదు. సర్వీస్ రోడ్డు సరిహద్దుల్లో అక్రమ నిర్మాణాలతో ప్రస్తుతం విస్తరణ సాధ్యం కాదు. వాటిని శంషాబాద్ మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. టోల్‌ప్లాజా సమీపంలో ఓ వ్యక్తి సెల్లార్‌తో కూడిన భారీ భవన నిర్మాణం చేపడుతున్నా మున్సిపాలిటీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

# ఇరుకు గదులు.. ఇక్కట్ల నడుమ చదువులు

పెద్దపల్లి :విద్యార్థులు వరండాలో ఉన్న ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 166 మంది విద్యార్థులు, మరో 24 మంది పూర్వప్రాథమిక పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైపెచ్చులు ఊడిపోయి, ఉరుస్తున్నాయి. మిగిలిన మూడు గదుల్లో తరగతులను నడుపుతుండగా మరో గదిని స్టాఫ్‌రూంగా వినియోగిస్తూనే అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. మిగతా తరగతులను వరండాల్లో కొనసాగిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న పాఠశాల భవనం పురాతనంగా మారడంతో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద నిర్మించిన నూతన పాఠశాల భవనం ఇదీ. రూ.28 లక్షల సీడీపీ, రూ.7.80 లక్షల 'మన ఊరు- మనబడి' నిధులను వెచ్చించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో నాలుగు తరగతి గదులున్నాయి. ఈ భవనం వెనుకాలే రూ.24 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.3.40 లక్షల ఈజీఎస్ నిధులతో వంటగది, బాలురు, బాలికలకు వేర్వేరుగా రూ.12.40 లక్షలతో శౌచాలయాలు,



రూ.9.50 లక్షల ఈజీఎస్ నిధులతో ప్రహరీలను నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.4 లక్షల విలువైన కరెంటు, రంగులు వేసే పనులు మిగిలిపోయాయి. ఇలా అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తయి సుమారు నాలుగేళ్లు దాటుతున్నా వినియోగంలోకి తేవడం లేదు. జిల్లాలో 503 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద 283 బడులను ఎంపిక చేశారు. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యుత్తు, తాగునీరు, భవనాల మరమ్మతులు, శౌచాలయాల మరమ్మతులు, లేనిచోట కొత్తగా నిర్మాణాలు తదితర కనీస వసతుల కల్పనకు రూ.11 కోట్లు వెచ్చించారు. అంతకుముందు 'మన ఊరు- మన బడి'లో భాగంగా 172 పాఠశాలల్లో ఆయా వసతులు కల్పించారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. 128 సర్కారు బడుల్లో కనీసం 189 అదనపు తరగతి గదులు అత్యవసరమని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు లేక అనేక పాఠశాలలు నీరసించిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇరుకు గదులు, వరండాలు, చెట్ల కింద తమ చదువులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి, పాఠశాలల్లో నెలకొన్న అదనపు తరగతి గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు: వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నిత్యం సందర్శిస్తున్నాం. ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కొరతను గుర్తిస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నాం. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడడమే మా లక్ష్యం. నిధులు మంజూరు కాగానే అదనపు తరగతి గదుల నిర్మాణాల పనులు చేపడుతాం.

# తెల్ల కాగితాలకు.. పట్టారూపు

పెద్దపల్లి : తెల్ల కాగితాలపై రాసుకున్న భూ కొనుగోలు ఒప్పంద పత్రాలు(సాదాబైనామా) దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. 2020 అక్టోబరు 12 నుంచి నవంబర్ 11 వరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులకు మోక్షం లభించనుంది. ఒప్పంద పత్రాల ఆధారంగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తున్నారు. 2024 జూన్ 2 కంటే ముందు జరిగిన భూముల లావాదేవీలకు మాత్రమే నిబంధనలు వర్తించనున్నాయి. ఇటీవల భూభారతిలో దరఖాస్తు చేయకున్నా.. గతంలో ఆన్‌లైన్‌లో ఉన్నవాటిని పరిష్కరించనున్నారు.

**35,560 దరఖాస్తులకు కదలిక**

జిల్లా వ్యాప్తంగా 35,560 దరఖాస్తులురాగా.. ఆన్‌లైన్ ఆధారంగా కొనుగోళ్ల వివరాల పత్రాలపై పరిశీలిస్తున్నారు. కాస్తులో ఉన్నాయా?



శిఖం, పరంపోగు భూములా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. కోర్టు కేసులు, ఇతర అంశాలపై ముడిపడి ఉందోననే విషయాలపై అధికారులు విచారిస్తున్నారు.

**కొందరి అక్రమ ఎత్తుగడ**

సాదాబైనామాలో భూముల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం జీవో జారీ చేయడంతో కొందరు అక్రమ ఎత్తుగడ వేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు ఇనాం, వక్ఫ్, అటవీ, శిఖం భూములకు పత్రాలు రాసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూదస్త్రాల శుద్ధీకరణలో అప్పటి రెవెన్యూ అధికారులు తమ బంధువులు, కుటుంబసభ్యుల పేరిట ఆన్‌లైన్ చేశారనే విమర్శలు తలెత్తుతున్నాయి. కొత్త చట్టం ప్రకారం ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం క్షేత్ర పరిశీలన చేసిన తర్వాత వివాదాలు లేని భూములకు క్రమబద్ధీకరణ చేయనున్నారు. జిల్లాలో ఇప్పటికే చాలాచోట్ల దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరింది. పలు దరఖాస్తులు వివాదాల్లో ఉన్నట్లు విచారణలో తేలుతోంది.

చురకలు
శనివారం 20 సెప్టెంబర్ 2025

# మన మిరపకు విశ్వ 'తేజ'స్సు..!

ఖమ్మం : రాష్ట్రంలో మరో పదకొండు ఉద్యాన ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్) పొందేందుకు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం సన్నాహాలు చేస్తోంది. వీటిలో ఖమ్మం జిల్లాకు చెందిన 'తేజ' మిరప ఉండటం విశేషం. ఇక్కడ అత్యధికంగా సాగు చేస్తున్న ఈరకం మిరప వివిధ దేశాలకు ఎగుమతి అవుతోంది.

**పాతికేళ్ల ప్రస్థానం..**

సుమారు పాతికేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన ఓ వ్యాపారి తేజ రకం విత్తనాలను తెచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులతో ప్రయోగాత్మకంగా సాగు చేయించారు. అంతకుముందు పండించిన రకాలతో పోల్చితే దిగుబడులు అనూహ్యంగా పెరగటంతో రైతులు దీనిపై అసక్తి పెంచుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో గతేడాది సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పండించారు. తెలంగాణలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలో తేజ రకం మిరప సాగవుతోంది. ఈ మిరపకు ఘాటు ఎక్కువగా ఉంటుంది. నాణ్యత బాగుంటుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. కూరలు, ఔషధాలు, నూనె తయారీలో దీనిని అధికంగా వాడతారు. ఖమ్మం తేజ రకం మిరపకు భౌగోళిక గుర్తింపు లభిస్తే.. ప్రత్యేకత, నాణ్యత కారణంగా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. రైతులకు మేలు జరుగుతుంది. నకిలీ ఉత్పత్తులను నిరోధించేందుకు సహాయ పడుతుంది. **వివిధ దేశాలకు ఎగుమతి**



ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పండించే 'తేజ' మిరపను ఏటా వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్థాన్ తదితర దేశాలకు పంపుతారు. చైనా దేశస్థులు 15 ఏళ్ల క్రితం ముదిగొండలో 'తేజ' మిరప కోసం ఆయిల్ కర్మాగారం ఏర్పాటుచేశారు. ఖమ్మం మార్కెట్ నుంచి పెద్దఎత్తున సరకును ఈ కంపెనీ కొంటుంది. చైనాతో పాటు మరో 15 దేశాలకు గృహావసరాల నిమిత్తం సరఫరా చేస్తుంది. అందుకే విశ్వవ్యాప్త పంటగా 'తేజ' మిరప గుర్తింపు పొందింది. ములకలపల్లి, కురవి, హైదరాబాద్ వంటి చోట్ల ఔత్సాహికులు ఆయిల్ కర్మాగారాలు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. 'ఖమ్మం తేజ రకం మిరపకు భౌగోళిక గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నాం. తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది' అని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి ఎంవీ మధుసూదన్‌కు తెలిపారు.

# కాగితాల్లోనే లెక్కలు.. జాడలేని మొక్కలు

అశ్వారావుపేట : సత్సంకల్పంతో ప్రారంభించిన 'వన మహోత్సవం' చిన్నబోయింది. పల్లెల్లో మొక్కలు పెంచి వాటిని పంపిణీ చేయాలని నెలకొల్పిన నర్సరీలు వెలవెలబోతున్నాయి. కాగితాల్లో తప్ప కార్యస్థానాల్లో చాలాచోట్ల మొక్కలను నాటిన జాడలు కనిపించడం లేదు. అధికారుల అలసత్వం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి మొక్కల పెంపకం అంతంతమాత్రంగానే సాగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో 2025లో 471 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. సుమారు 1.20 కోట్ల మొక్కలు పెంచేందుకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.7 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. ఈ ఏడాది 'వన మహోత్సవం'లో జిల్లావ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో నర్సరీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక స్థానిక సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో మొక్కలు పెరగలేదు. రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, ఈ ఏడాది 'వనమహోత్సవం'పై ఉన్నతాధికారులు సైతం చిత్తశుద్ధి చూపక మమ అనిపించారనే ఆరోపణలు ఉన్నాయి.

**నర్సరీల్లో బెడ్లన్నీ ఖాళీ...**

'వన మహోత్సవం' విజయవంతమైనట్లు రాతల్లో చూపడం తప్ప క్షేత్రస్థాయిలో మొక్కలు నాటిన, ఇళ్లకు పంచిన ఆనవాళ్లు తక్కువగా



ఉన్నాయనే విమర్శలున్నాయి. జిల్లాలో 471 నర్సరీలు ఏర్పాటు చేయగా.. కొన్నింట్లో సక్రమంగా పెంచారు. పంచాయతీ కార్యదర్శులు నర్సరీలను పట్టించుకోకపోవడంతో చాలా వాటిలో మొలవక, మొలిచినవి ఎండిపోయి బెడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

అశ్వారావుపేట నియోజకవర్గంలో 105 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా అశ్వారావుపేట మండలంలోని 27 పంచాయతీల్లో నర్సరీలు నెలకొల్పగా.. ఊట్లపల్లి, ఆసుపాక, బచ్చువారి గూడెం, అనంతారం, గాండ్లగూడెం, కోయరంగాపురం, మామిళ్లవారి గూడెం, కావడిగుండ్ల, కొత్తకన్నాయిగూడెం, కేశప్పగూడెం, మద్దికొండ, నారంవారిగూడెం పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలు ఏర్పాటు చేశాం. వీటిని పరిశీలిస్తున్నాను. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఏపీఓలను పరిశీలించాలని ఆదేశిస్తా. నర్సరీల్లో మొక్కల పెంపకంపై, వన మహోత్సవం అమలుపై నిర్లక్ష్యం వహించినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– విద్యాచందన, డీఆర్డీఓ

# ఆపినా ఆగరు.. అవగాహన కలిగించరు



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో 78 ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. ఇవి కొన్ని చోట్ల పనిచేయడం లేదని, రోడ్డు దాటాలంటే ఇబ్బందులు తప్పడం లేదని పాదచారులు వాపోతున్నారు పరిశీలనలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.పాదచారులు రోడ్డు దాటేందుకు పెలికాన్ సిగ్నల్ బటన్ నొక్కినా వాహనదారులు ఆగడం లేదు. పెలికాన్ సిగ్నల్ ప్రారంభించి రెండేళ్లు దాటినా వాహనదారులు ఇంకా వీటిని గుర్తించడం లేదు. పెలికాన్ సిగ్నల్ ఉపయోగించి రోడ్డు దాటొచ్చనే అవగాహన చాలా మందిలో లేదు.ట్యాంక్‌బండ్ వద్ద పాదచారులు రోడ్డు దాటడానికి గతంలో పెలికాన్ సిగ్నల్ అమర్చారు. ఈ పెలికాన్ సిగ్నల్ స్తంభాన్ని తాకారంటే విద్యుదాఘాతానికి గురికావాల్సిందే. ఇటీవల వర్షాలు కరిసిన సమయంలో ఈ స్తంభాన్ని పరిశీలించగా విద్యుత్ సరఫరా అవుతోందని తేలింది. సందర్శకుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్యాంక్‌బండ్‌లో ఉన్నా లవ్ హైదరాబాద్ దగ్గర చాలామంది సందర్శకులు వచ్చి ఫొటోలు తీసుకుంటారు. దానికి దగ్గరే ఉన్నా స్తంభానికి అమర్చిన పెలికాన్ సిగ్నల్ బాక్స్ ప్రమాదకరంగా తెరుచుకొని ఉంది.

బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రి వద్ద పెలికాన్ బటన్ నొక్కితే పెలికాన్ సిగ్నల్ గుర్తులు రాకుండా సాధారణ సిగ్నల్ వస్తుంది. చాలామంది వాహనదారులు సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్తున్నారు. పెలికాన్ సిగ్నల్ రాక పాదచారులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు.

బంజారాహిల్స్ విరించి ఆసుపత్రి దగ్గర ఉన్నా పెలికాన్ సిగ్నల్ పనిచేయడం లేదు. నిరంతరం ఒకటే సిగ్నల్ చూపిస్తోంది.

# పనులు, సేవలకు సాంకేతిక దన్ను



హైదరాబాద్ : సాంకేతికతను అందిపుచ్చుకుంటూ జలమండలి తాగు, మురుగు నీటి సరఫరా సమస్యల పరిష్కారంలో ముందుకెళ్తోంది. ప్రమాదకరమైన పరిస్థితుల్లో భద్రత ఉండేలా, తక్కువ సమయంలో ఎక్కువ శ్రమలేకుండా కచ్చితమైన ఫలితాలు అందుకునేలా ఆధునిక యంత్రాలను వినియోగించుకుంటోంది.స్మార్ట్‌వాల్వ్ సాంకేతికత: పలు సమస్యలకు స్మార్ట్ వాల్వ్ సాంకేతికత పరిష్కారం చూపుతుంది. వ్యక్తుల ప్రమేయం లేకుండా నీటిని నిర్ణీత వేళల్లో నిర్దేశించిన పరిమాణం మేరకు, నిర్ణయించిన సమయం వరకు విడుదల చేయడం దీని ప్రత్యేకత. నీటి సరఫరాతో పాటు నాణ్యతను గుర్తిస్తుంది.మినీ సీవర్ జెట్టింగ్ మిషన్: మ్యాన్‌హోళ్లు, మురుగునీటి కాలువలను శుభ్రం చేయడానికి ఈ యంత్రాలు వినియోగిస్తారు. పూడికతీతలో కీలకంగా పని చేస్తున్నాయి. వ్యక్తులు మ్యాన్‌హోళ్లు, మురుగునీటి కాలువల్లో దిగడాన్ని ఇది వంద శాతం లేకుండా చేసింది. నాణ్యతకు ప్రత్యేక చర్యలు: రోజువారీగా నీటి నమూనాలను సేకరించి నాణ్యతను పర్యవేక్షించడం. రిజర్వాయర్ లెవల్ సెన్సార్లు, నిర్దేశించిన స్థాయికి నీరు చేరితే అప్రమత్తం చేయడం వీటి ప్రత్యేకత.

హైడ్రాలిక్ సిల్ట్ గ్రాబర్స్: మనుషుల ప్రమేయం లేకుండా మ్యాన్‌హోళ్ల నుంచి మట్టిని తొలగించడానికి ఈ యంత్రాలు వినియోగిస్తారు.

సీవర్ క్రాక్స్: రోబోటిక్ పరికరాలు, మ్యాన్‌హోల్స్‌లో గట్టిపడిన మట్టిని తొలగించడంలో ఇవి కీలకంగా పని చేస్తున్నాయి.

**హోమో సెప్ సీవర్ రోబోటిక్ యంత్రం**

డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో అవరోధాలు, పూడికను సమర్థంగా గుర్తించి పక్కాగా మురుగునీటి వ్యవస్థను నిర్వహించేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుంది. హోమో సెప్ సీవర్ పేరిట తయారు చేసిన రోబో ద్వారా మ్యాన్‌హోళ్లలోకి దిగే అవసరం లేకుండా, అత్యాధునిక కెమెరాలతో పూడికను గుర్తిస్తుంది. వ్యర్థాలను తీస్తుంది. మ్యాన్‌హోల్ మూత తీయకుండానే పరిస్థితిని అంచనా వేసి సురక్షితంగా పనులు చేయడానికి సాధ్యపడుతుంది.

# ఏటా తనిఖీలు.. వెలుగులోకి అక్రమాలు



బొంరాస్‌పేట : బొంరాస్‌పేట మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.7.70 కోట్ల ఉపాధిహామీ పనులపై ఈనెల 18న మండల కేంద్రంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. చేసిన పనుల్లో పలు అవకతవకలు జరిగినట్లు తనిఖీ సిబ్బంది గుర్తించారు. దీనికిగాను సిబ్బందికి రూ.76 వేలు జరిమానా విధించారు. రూ.6.71 లక్షలు రికవరీ చేయాని ఆదేశించారు.

రెణ్నెల్ల కిందట పూడూరులో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక లోనూ తప్పులు వెలుగులోకి వచ్చాయి. రూ.48 వేలు జరిమానా వేశారు. రూ.1.20 లక్షల రికవరీకి ఆదేశించారు. దోమ మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీలోనూ రూ.52 వేలు జరిమానా విధించారు.గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించడానికి అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో లోపాలు బయటపడుతున్నాయి. ఏటా రూ.కోట్ల పనులు చేస్తున్నారు. పారదర్శకంగా జరుగుతున్నాయా.. లేదా నిర్ధారించడానికి ఏటా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన పనులను పరిశీలించి పలు లోపాలను గుర్తించి ఎత్తి చూపుతున్నారు. సంబంధిత సిబ్బందికి జరిమానాలు విధించి సొమ్ము రికవరీకి ఆదేశాలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పనుల నిర్వహణలో మాత్రం మార్పు రావడం లేదు. అవే తప్పులు పునరావృతమవుతున్నాయి.

**విజిలెన్స్ కమిటీలు కాగితాలకే పరిమితం..**

ఈ పథకంలో అవకతవకలను అరికట్టడానికి కొన్ని నెలల కిందట ప్రభుత్వం గ్రామస్థాయిలో అయిదుగురితో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చింది. వాటిని కాగితాలకే పరిమితం చేశారు. సభ్యులకు అవగాహన కల్పించి బలోపేతం చేస్తే నిధుల దుర్వినియోగం, బోగస్ కూలీల నమోదు వంటి వాటికి చెక్‌పెట్టడానికి అవకాశం ఉంటుంది.

**ఏటా రూ.కోట్లతో పనులు..**జిల్లాలో ఉపాధిహామీ పథకంలో ఏటా రూ.కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. సిమెంటు రోడ్ల నిర్మాణం, నీటి నిల్వ కట్టడాలు, మొక్కల పెంపకం, పాటు కాలువల మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి ఎన్నో పనులు చేస్తున్నారు. ఈ పనులు చేయడానికి జాబ్‌కార్డు ఉన్న కూలీలు హాజరవుతున్నారు. కొన్నిచోట్ల కూలీలు రాకున్నా వచ్చినట్లు హాజరు వేయడం, పని కొలతల్లో ఎక్కువ, తక్కువ నమోదు చేయడం, గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా చెల్లింపులు.. వంటివి సాగుతున్నాయి. ఆయా పనులపై క్షేత్రస్థాయిలో నిఘా, పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలున్నాయి.

# డెంగీ జ్వరం.. భయం భయం

వికారాబాద్ : జిల్లాలో డెంగీ మహమ్మారి పంజా విసురుతోంది. వర్షాలు కురిసి నిలిచిపోవటంతో కేసులు అధికమయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 40 కేసులు నమోదయ్యాయి. వాటిలో 32 జులై, ఆగస్టు నెలలవే ఉన్నాయి. వికారాబాద్, తాండూరు పట్టణాల్లోనే ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. వికారాబాద్ పుర పరిధి కొత్తగడి, ఆలంపల్లి, శివారెడ్డిపేటలోని కొన్ని ప్రాంతాలు పూర్తిగా అపరిశుభ్రంగా మారడంతో రెండ్రోజుల్లో ముగ్గురికి నిర్ధారణ అయింది.**పల్లెలు, పట్టణాల్లో..**జిల్లాలో జూన్ వరకు పూడూరు, వికారాబాద్, తాండూరు, ధారూరు, నవాబ్‌పేట, బొంరాస్‌పేటలో 8 కేసులు నమోదయ్యాయి. జులై, ఆగస్టు నెలల్లో 32 నిర్ధారణ అయ్యాయి. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా జిల్లాలో అక్కడక్కడా డెంగీ కేసులు వెలుగు చూస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 2023లో 89, 2024లో 125, 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు 40 కేసులు బటయపడ్డాయి. అనధికార లెక్కల ప్రకారం ఏటా సుమారుగా 140కిపైనే డెంగీతో ఇబ్బంది పడ్డారు.మిగతా జిల్లాలతో పోలిస్తే తక్కువే..మిగతా జిల్లాలతో పోలిస్తే వికారాబాద్‌లో డెంగీ కేసులు తక్కువే నమోదయ్యాయి. ఇతర జిల్లాల్లో ఒకే రోజు 40 కేసుల వరకు వస్తున్నాయి. ఇక్కడ వైద్యాధికారులు తీసుకున్న చర్యల కారణంగా కసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. వికారాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించా. డెంగీ వ్యాధి ఉన్నట్లు గుర్తిస్తే ఆ పరిసరాల్లోని 50 ఇళ్ల కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహిస్తాం. చుట్టు పక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.డా.రవీందర్‌యాదవ్, జిల్లా వ్యాధుల నివారణ కార్యక్రమ అధికారి, వికారాబాద్

# కొత్త వైద్యులొస్తేనే పాత చిక్కులు తొలిగేది..!

ఖమ్మం : వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను ఏళ్లుగా నిపుణుల కొరత వేధిస్తోంది. ముఖ్య విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో రోగులకు 24గంటల సేవలు లభించడం లేదు. కొన్నిచోట్ల కనీసం డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు కూడా లేకపోవడంతో బాధితులు ఇతర ఆస్పత్రులు, ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో చికిత్సలు లభించక రోగుల ప్రాణాలకు ముప్పువాటిల్లుతుంది. ప్రస్తుత జ్వరాల సీజన్లో ఓవైపు డెంగీ కేసులు భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో వైద్య నిపుణుల నియామకానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గతానుభవాల దృష్ట్యా అర్హులు విధుల్లో చేరి, ఖాళీలన్నీ భర్తీ అయితేనే ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

**ఎక్కడెక్కడ, ఏఏ విభాగాల్లో..**

జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, నేలకొండపల్లి, మధిర, తిరుమలాయపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అన్నిచోట్లా వైద్యుల కొరత నెలకొంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడీయాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ విభాగాల్లో నిపుణులు లేరు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల్లో ఖాళీలతో నాడీపట్టే నాథుడు కరవయ్యారు. నిజానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చితే వీటిలో మెరుగైన సేవలందాలి. జిల్లా ఆసుపత్రిపై భారం పడకుండా ప్రత్యేక నిపుణులు, శస్త్రచికిత్స



వైద్యులు అందుబాటులో ఉండాలి. గ్రామీణుల అవసరాలు తీర్చాలి. ఉన్నత సేవలు అటుంచి సాధారణ జ్వరం, దగ్గు వంటి చిన్నపాటి సమస్యలకూ చికిత్స అందడం లేదు. చిన్నపిల్లలకు సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్సలు లభించడం లేదు. స్త్రీ సంబంధిత సమస్యలకు, ప్రసవాలు, గర్భిణులు, తల్లులకు అవసరమైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. నిపుణుల కొరతతో శస్త్ర చికిత్సలు నిండుకున్నాయి. ఏది ఏమైనా తాత్కాలిక ప్రాతిపదిక స్థానంలో శాశ్వత పద్ధతిలో సిబ్బందిని నియమిస్తే సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుంది.

**దరఖాస్తులు ఆహ్వానించాం**

డా. రాజశేఖర్‌గౌడ్, టీవీవీపీ ఆస్పత్రుల సమన్వయాధికారి

జిల్లాలోని అన్ని ఆస్పత్రులు ఆరు గైనకాలజీ, మూడు అనస్తీషియా, రెండు ఆప్తాల్మాలజీ, రెండు పీడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్‌లో ఒక్కోటి, ఒక సివిల్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అర్హులైన వైద్యులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఈ నెల 6న ఐడీవోసీలోని జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. ప్రత్యేక నిపుణులకు రూ.లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్)కు రూ.52,351 చొప్పున నెలవారీ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# సేవల్లో నాణ్యత భక్తులకు భరోసా

భద్రాచలం : దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో భక్తులకు ఆన్‌లైన్‌లో పరోక్షంగా.. ఆఫ్‌లైన్ ద్వారా ప్రత్యక్షంగా సేవలు అందుతున్నాయి. ఏడాదికి 24 లక్షల మంది దర్శనానికి వస్తుండగా వార్షిక ఆదాయం సుమారు రూ.80 కోట్లకు చేరింది. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో రద్దీ బాగానే ఉంటోంది. ఇలాంటి చోట అందించే సేవలకు త్వరలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్(ఐఎస్‌ఓ) ధ్రువీకరణ పొందేందుకు అవసరమైన ప్రక్రియ ఆరంభమైంది. ఐఎస్‌ఓ అనేది అంతర్జాతీయ ప్రభుత్వేతర స్వతంత్ర సంస్థ. నాణ్యత, భద్రత, సామర్థ్యం పనితీరును నిర్ధారించేందుకు ఈ సంస్థకు నిపుణులు రూపొందించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా ఉంటేనే ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఇది ఉంటే అదో గొప్పగా పరిగణిస్తారు. ప్రమాణాలు పకడ్బందీగా ఉన్నాయన్న భరోసా ఉంటుంది.

**యాదగిరిగుట్ట తరహాలో...**

సాధారణంగా పెద్దపెద్ద వ్యాపార సంస్థలు, కర్మాగారాలు తమ వినియోగదారుల ఆదరణ పొందేందుకు ఇలాంటివి పొందుతుంటాయి. దేవాదాయశాఖ సైతం తమ భక్తులకు అందించే సేవల విశిష్టతను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ సంస్థ సూచించే ప్రమాణాలను పాటిస్తున్నాయి. ఇప్పటికే యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు వచ్చింది. వేములవాడ రాజన్న ఆలయానికి త్వరలో ఈ సర్టిఫికెట్ కేటాయించే వీలుంది. వారం కిందట ఈ ప్రతినిధులు భద్రాచలం రామాలయాన్ని సదర్శించి కొన్ని సూచనలు చేశారు. అన్నదానం, ప్రసాదాల తయారీ, శేష వస్త్ర దుకాణం, వివిధ కౌంటర్లలో రికార్డుల నిర్వహణతో పాటు పారిశుధ్య చర్యలనూ పరిగణలోకి తీసుకున్నారు. మరోసారి ఈ బృందం వచ్చి సమగ్ర పరిశీలన చేసి సర్టిఫికెట్ కేటాయించనుందని భావిస్తున్నారు.

**హక్కులు.. ఆహార భద్రత**

ఈ దేవస్థానంలోని ధ్రువమూర్తుల చిత్రాలపై రామాలయానికి మే 23న కాపీరైట్స్ లభించాయి. ప్రధాన కోవెలలో సీతారామ లక్ష్మణుల వారి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఇందులో అలంకరణ ఛాయాచిత్రం, అలంకరణ లేకుండా మరోచిత్రం ఎక్కువగా ముద్రణలో, జ్ఞాపికల్లో కనిపిస్తుంటాయి. అనుమతి లేకుండా ఎవరైనా ఈ ఫొటోలను ముద్రించినా.. వీటిని వ్యాపారం కోసం విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రామాలయానికి హక్కులు వచ్చాయి. ప్రసాదాలు, అన్నదాన విభాగాలపై మరింత పారదర్శకత ఉండేందుకు ఫుడ్ సేఫ్టీ ధ్రువీకరణను పొందారు.

**కాగిత రహిత పాలన దిశగా...**

భక్తుల సౌకర్యం కోసం ఆన్‌లైన్‌తో పాటు డిజిటల్ సేవలు అందిస్తున్నారు. అలాగే కార్యాలయ నిర్వహణలోనూ కాగిత రహిత పాలనలో భాగంగా వేగంగా దస్త్రాల పరిష్కారానికి 'ఈ-ఆఫీస్' వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇది పూర్తిగా కార్యాలయ వ్యవహారాలకు సంబంధించిన పారదర్శకతను చాటేందుకు ఏర్పాటు చేసిన ప్రక్రియ. ఇందులో మొదటగా అకౌంట్స్ విభాగంలో ఈనెల 1న ఆన్‌లైన్ ప్రారంభమైంది. ఇలా మరో పది విభాగాల్లో ఆన్‌లైన్ అమలు చేయనున్నారు. ఇందుకు కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు సరిపోవు. మరో 20 కొనేందుకు రూ.15 లక్షలు అవసరమని అంచనా. కంప్యూటర్ పరిజ్ఞానం లేని సిబ్బందికి శిక్షణ ఇచ్చే వీలుందని ఆలయ వర్గాలు తెలిపాయి.

# కదలని వరద.. వదలని బురద

పత్తికొండ : గుంతకల్లు-గుంటూరు రైల్వే లైను వెంట ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్‌సీ గేట్లు తొలగించారు. వాటి స్థానంలో అండర్ పాస్‌లు నిర్మించారు. గుత్తేదారులు నిబంధనలు పాటించలేదు. వరద నీరు వెళ్లడానికి కాల్వలు సరిగా నిర్మించలేదు. దీంతో పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది.. ఏటా ఎనిమిది నెలలపాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. విధిలేక రైతులు వరద నీటిలోనే వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

మద్దికెర- చిప్పగిరి గ్రామాల మధ్య రైతులు పొలాలకు వెళ్లేందుకు రూ.2 కోట్లు వెచ్చించి అండర్‌పాస్ నిర్మించారు. చిప్పగిరి, కుందనగుర్తి, ఆలూరు, నేమకల్లు తదితర గ్రామాలకు దగ్గరి దారి కావడంతో వెళుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది.

**ఎక్కడ ఎలా ఉందంటే**

చిప్పగిరి మండలం గుమ్మనూరు-దేగులహాల్ గ్రామాల మధ్య అండర్ పాస్ (లోలెవల్ వంతెన) నిర్మించారు.. పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ ఉంటోంది..

మద్దికెర వద్ద రెండు అడుగుల ఎత్తులో నిర్మించడంతో నీరు వెళ్లడం లేదు.. మద్దికెర వద్ద రెండుచోట్ల, అగ్రహారం వద్ద 2, యడవలి, పెరవలి, హంప తదితర గ్రామాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

మద్దికెర-చిప్పగిరి ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెనలో వర్షం కురిసిన సమయంలో 4 మీటర్ల మేర నీరు నిలుస్తోంది. దీంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లే అవకాశమే లేకుండా పోయింది.

80 కి.మీ. రూ.100 కోట్లు

ఒక్కోదానికి పొడవు, వెడల్పు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు వెచ్చించారు. మొత్తం నిర్మాణాలకు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. మద్దికెర- డోన్ మధ్య ఐవో డబ్ల్యూ, ఐవోడబ్ల్యూ పరిధిలో 25 శాశ్వత అండర్‌పాస్‌లున్నాయి. 80 కి.మీ. మేర రైల్వే ట్రాక్



వెంట నిర్మించిన భూగర్భ వంతెనల్లో నీరు నిలుస్తోంది.

అండర్ పాస్‌లు 6 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు చొప్పున నిర్మించారు. వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా సమాంతరంగా కాల్వలు తవ్వాలి. వరద నీరు ప్రధాన కాల్వ వరకు వెళ్లేలా మార్గం సుగమం చేయాలి. చాలాచోట్ల కొంత వరకు తవ్వి వదిలేశారు.. 20-30 మీటర్ల వరకు సమాంతర కాల్వ తవ్వి అక్కడ చిన్నపాటి గుంత తీశారు. నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.

**వంతెన దాటాలంటే కష్టమే**

కిష్టన్న, రైతు, మద్దికెర

నాకున్న మూడెకరాల పొలంలో వాము పంట సాగు చేశా. 20 రోజులుగా పొలానికి వెళ్లే మార్గంలోని రైల్వే వంతెనలో నీరు నిలుస్తోంది. అండర్‌పాస్‌లో నీరు తగ్గిందని వెళ్తే ద్విచక్ర వాహనం నిలిచిపోయింది. సైలెన్సర్‌లోకి నీరు చేరడంతో బండి స్టార్ట్ కావడం లేదు. దీంతో వెనక్కు తోసుకుంటూ వచ్చా. వేలాది మంది రైతులు ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు.

# వసతి పర్యవే'క్షీణం'

కర్నూలు : డోన్ బాలుర కళాశాల వసతిగృహంలో ఈనెల 7న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో వసతిగృహ అధికారిణి అక్కడ లేరు. ఆమె గతేడాది వరకు ప్రీమెట్రిక్ వసతిగృహానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. అక్కడ రెగ్యులర్ అధికారిని నియమించారు. ప్రస్తుతం చూస్తున్నది ఒక హాస్టల్ బాధ్యతలే అయినాసరే సరిగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి.

బీసీ వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52 వసతి గృహాల్లో 9,729 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 38 చోట్ల సంక్షేమాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో అధికారి రెండు వసతిగృహాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకొని నిధులు బొక్కేస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి**

నిబంధనల ప్రకారం సమీపంలోని వసతిగృహ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. లేదా సమీపంలోని ఎస్సీ వసతిగృహ అధికారికీ ఇవ్వొచ్చు. ఎవరూ అందుబాటులో లేకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతంలోని వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించకూడదు. వసతిగృహ అధికారులు రెగ్యులర్‌గా పనిచేస్తున్న చోట ఉదయం, ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్‌లో సాయంత్రం వేళ ఎఫ్ఆర్ఎస్ వేయాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు. 30 నుంచి 40 కి.మీ దూరంలోని వసతిగృహాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ భారంగా మారుతోంది. అంతదూరం వెళ్లలేక పనిచేసే సిబ్బందిపైనే నిర్వహణ భారం మోపి చేతులు దులిపేసుకుంటున్నారు. విద్యార్థులకు సరైన మెనూ అమలుకావడం లేదు.

**వసూళ్ల పర్వం**

ఆలూరు కళాశాల వసతిగృహంలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 వసూలు చేశారంటూ తహసీల్దారుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. కర్నూలులోని బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పనిచేస్తున్న రాజేశ్వరి అక్రమాలకు పాల్పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆరు నెలల తర్వాత నందికొట్కూరు బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పోస్టింగ్ ఇచ్చారు. కొంత కాలానికే ఆమెకు బ్రాహ్మణకొట్కూరు ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఆదోని కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేస్తున్న అజీంకు మంత్రాలయం ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆదోని నుంచి మంత్రాలయానికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం వెళ్లి పర్యవేక్షించాలంటే కష్టమైనా అధికారులు దృష్టి సారించడం లేదు.

పత్తికొండ కళాశాల వసతిగృహ అధికారికి మద్దికెర ప్రీమెట్రిక్ వసతిగృహ అధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన కర్నూలు కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడి సస్పెండయ్యారు. ఇలాంటి వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వకూడదన్న నిబంధనలు చెబుతున్నాయి.

# స్వస్థ్ నారీ.. సుస్తీ పరారీ..!



గాజువాక : మహిళలకు మెరుగైన వైద్యసేవలు, ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తిమంతమైన కుటుంబం) తలపెట్టాయి. ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకూ సమగ్ర ఆరోగ్యప్రచార, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. విశాఖ జిల్లాలో నిర్దేశిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు కొనసాగుతాయి. ఇప్పటికే పీహెచ్‌సీల వారీగా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టారు.

**ఉద్దేశం ఇదీ..**

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, పోషకాహార ఆవశ్యకత వివరించడం.. కుటుంబాలను స్వశక్తిగా బలపేతం చేయడం.

తల్లీబిడ్డల ఆరోగ్యం ప్రధాన లక్ష్యంగా వైద్యబృందాలు రంగంలోకి దిగుతున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వరకూ శిబిరాలు ఏర్పాటు చేస్తారు. వైద్య నిపుణులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

**శిబిరాల్లో వైద్యసేవలివీ..**

మహిళల్లో గుండెజబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లను గుర్తించి తగిన పరీక్షలు నిర్వహిస్తారు.

మహిళలు, కిశోరబాలికల్లో రక్తహీనత గుర్తించటం, క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్యసేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేస్తారు.

గర్భిణులకు మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డులిస్తారు. పోషకాహారంపై తగిన అవగాహన, కౌన్సెలింగ్ చేస్తారు. పిల్లల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఉంటే గుర్తిస్తారు.

చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. యుక్తవయసు బాలికలకు శుభ్రత గురించి వివరిస్తారు. అయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులిస్తారు.

ప్రతీ పీహెచ్‌సీకి వైద్యశిబిరాల నిర్వహణకు ఒక్కో నోడల్ అధికారి ఉంటారు. పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు, చర్మవ్యాధి నిపుణులు, జనరల్ మెడికల్ ఆఫీసర్లు ఇందులో పాల్గొంటారు.

గాజువాక నియోజకవర్గంలో తొలిరోజు 65వ వార్డు గంగవరం యూపీహెచ్‌సీ వద్ద వైద్యశిబిరాన్ని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభిస్తారని స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నోడల్ ఆఫీసర్, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

సమయం: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు శిబిరాలు కొనసాగుతాయి.

**జిల్లాలో ఇలా..**

మొత్తం పీహెచ్‌సీలు: 9

యూపీహెచ్‌సీలు: 65

# కుమ్మక్కవుదాం.. సొమ్ములు నొక్కేద్దాం!!



విశాఖపట్నం : ఈ చిత్రం 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోఎస్ కాలనీలోనిది. 200 చదరపు గజాల్లో ఏకంగా నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఓ మాజీ కార్పొరేటర్ సహకారంతో దర్జాగా నిర్మాణం సాగిస్తున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాల్లో ఉన్న భారీ భవంతుల చుట్టూ పరదాలు కప్పేస్తున్నారు. ఇదేదో జాగ్రత్తకోసం కాదు. వాటి మాటున జరుగుతున్న అక్రమాలు బయటకు కనిపించకుండా సాగిస్తున్న తతంగం ఏమిటో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. నిర్మాణదారులతో కొందరు అధికారులు కుమ్మక్కై రెండు చేతులా సంపాదించుకుంటున్నట్లు సమాచారం.

ఈ భవనం పీఎంపాలెం 7వవార్డులోనిది. జీం2కి అనుమతి గతంలో పొందారు. నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగింది. అందులో కొన్ని కుటుంబాలు ఏడాదిగా జీవనం చేస్తున్నాయి. తాజాగా ఎలాంటి అనుమతుల్లేకుండా అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో టీడీఆర్ కొనుగోలు చేయకుండానే నిర్మాణం తుది దశకు తెచ్చారు.

6వ వార్డులో ఓ చోట జీం2కు ప్లాన్ అనుమతులు పొందారు. అదనంగా పెంట్‌హౌస్ పేరుతో 60 శాతం స్లాబ్ పూర్తి చేశారు. అధికారులు తెలిసినా అడ్డుకోలేకపోతున్నారు. ఇవే కాదు...ఈ ప్రాంతంలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. టీడీఆర్ ఉపయోగించకుండా: నిర్మాణ సమయంలో టీడీఆర్‌తో ప్లాన్‌కు వెళితే ఫ్లోర్ ఎత్తు, సెట్‌బ్యాక్‌లు నిబంధనల ప్రకారం అనుమతి ఉన్నంత వరకే నిర్మించాలి. కొందరు ఈ నిబంధనలు ఉల్లంఘించేందుకు ... టీడీఆర్ కొనుగోలు చేయకుండా, గుట్టు చప్పుడు కాకుండా అక్రమ అంతస్తులు కట్టేస్తున్నారు. ఫలితంగా రహదారుల విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోయి టీడీఆర్‌లు పొందిన బాధితులు అవి అమ్ముడుపోక నష్టపోతున్నారు. చివరకు తక్కువ ధరకే ఇచ్చేస్తున్న పరిస్థితి.

ఇదే అవకాశంగా: ఎలా కట్టిన నిర్మాణమైనా బీపీఎస్‌లో క్రమబద్ధీకరణ చేసి, అనధికార నిర్మాణాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన. రుసుంలు ఎంత వసూలు చేస్తారనే అంశంపై ఇంకా కసరత్తు సాగుతోంది. దీంతో కొందరు నిర్మాణదారులు రాత్రికిరాత్రే స్లాబ్ వేసి తెల్ల సున్నం వేసేస్తున్నారు. ఇవన్నీ ఆగస్టు 31లోపు జరిగినట్లు చూపించడానికి పలు చోట్ల పట్టణ ప్రణాళిక అధికారులతో బేరాలు మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది.

**భద్రత ప్రశ్నార్థకం..**పాత భవనాలపై అదనంగా అంతస్తులు వేయడం వల్ల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల వన్‌టౌన్ ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ పక్కకు ఒరిగిపోయిన తీరు కలకలం రేపింది. అదనపు అంతస్తులపై ఎవరైనా అర్జీలిచ్చి జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తే... వారి చర్యల నుంచి ఎలా తప్పించుకోవాలో ముందుగా పట్టణ ప్రణాళిక విభాగంలో కొందరు అక్రమ నిర్మాణదారులకు ఉచిత సలహాలిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి.

# ఆస్తులపై అధికారం.. ఇదిగో అవకాశం



పాయకరావుపేట : రియల్టర్ల మాయాజాలంలో చిక్కుకుని అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి ఊరటనిచ్చే అవకాశం వచ్చింది. అనుమతి లేకుండా కొనుగోలు చేసిన స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పథకాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అక్రమ లే అవుట్లు 400కు పైగా గుర్తించగా జిల్లా పరిధిలో 200 వరకు ఉన్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో 50కి పైగా అనధికార లేఅవుట్లుగా తేల్చారు. వీటిల్లో స్థలాలు కొనుగోలు చేసిన వారికి బ్యాంకు రుణాలు పొందాలంటే వీలుండటం లేదు. అంతేగాక ఇంటి నిర్మాణానికి అనుమతులు తెచ్చుకోవడం తలకు మించిన భారమే అవుతోంది.

నిబంధనల ప్రకారం పంచాయతీల పరిధిలో జీం2 వరకు భవనాలకు అనుమతి ఇస్తారు. దానికి విరుద్ధంగా కొన్నిచోట్ల జీం5 భవంతులు నిర్మించేశారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లోనే ఇలా 60కి పైగా బహుళ అంతస్తుల భవనాలు వీఎంఆర్‌డీఏ అనుమతి తీసుకోకుండా నిర్మించేశారు. జీం2 దాటిన పై అంతస్తుల్లోని అపార్ట్‌మెంట్లకు పన్నులు వేయడం లేదు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. **దరఖాస్తు ఇలా:** ప్రజల ఇబ్బందులు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (భూమి క్రమబద్ధీకరణ పథకం) అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఉన్న అన్ని అనధికారిక లేఅవుట్లలోని స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. మార్కెట్ విలువ మేరకు 10 శాతం అపరాధ రుసుంగా చెల్లించి భూమి దస్తావేజులతో ఆన్‌లైన్ వీఎంఆర్‌డీఏకు దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత ఛార్జీలు చెల్లించాక అధికారుల పరిశీలన అనంతరం అనుమతులు ఇవ్వనున్నారు.

**అర్హత ఇదీ :** ఈ ఏడాది జూన్ 30లోగా లేఅవుట్లు, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. వివరాలకు మున్సిపాలిటీ సహా గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

**చేయాల్సింది ఇదీ:** ఇప్పుడు అవకాశం వినియోగించుకోవాలనుకునే వారు అక్టోబర్ 23వ తేదీలోగా %https://dtcp.ap.gov.in/lrs% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్టర్ విక్రయ దస్తావేజు, లింకు డాక్యుమెంటు, సైట్ ప్లాన్‌ను దరఖాస్తు జత చేయాలి. సబ్ రిజిస్ట్రార్ నిర్ధారించిన ఈసీ, మార్కెట్ విలువ, భూమార్పిడి ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. నోటిఫికేషన్ తేదీ నుంచి 45 రోజుల్లోపు దరఖాస్తుదారులు పూర్తి రుసుం చెల్లిస్తే 10 శాతం రాయితీ, 90 రోజుల్లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుంది. 14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలపై 50 శాతం రాయితీ ఉంటుంది.

**అవగాహన కల్పిస్తున్నాం**ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌లపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. దీనిపై అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇ.సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

# కమీషన్ల 'కాటా'.. మామూళ్ల వేట

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సరకు తీసుకొచ్చినప్పటి నుంచి ఇంటికెళ్లే వరకు అడుగడుగునా మోసపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసి రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు దోపిడీలో పాలుపంచుకుంటున్నారు.

**పీడిస్తున్న హమాలీలు**

ఒక సంచిని వాహనం నుంచి కిందకు దింపినందుకు రైతులు హమాలీ ఛార్జీ రూ.5.04 చెల్లించాలి. లైసెన్స్‌డ్ హమాలీలు వాహనం నుంచి సరకు కిందకు దింపాలి. కానీ మార్కెట్‌లో లైసెన్స్‌డ్ హమాలీలకు బినామీలుగా చలామణి అవుతున కార్మికులు సరకును కిందకు దింపుతున్నారు. ఛార్జీలకు అదనంగా డ్రైవర్ మామూళ్లు, హమాలీలు రూ.300 నుంచి రూ.500 వరకు, అదే లారీలో సరకు తీసుకొస్తే రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు.

**రూ.2 కోట్లకుపైగా వసూలు**

విపణికి నిత్యం చిన్న, పెద్ద వాహనాలు 500 వరకు వస్తుంటాయి. ప్రస్తుతం ఉల్లి వాహనాలే 300 వరకు ఉన్నాయి. మామూళ్ల పేరుతో



రైతుల నుంచి వసూలు చేసే అదనపు మొత్తమే రూ.1.50 లక్షల వరకు ఉంటుంది. సీజన్‌లో 6 నెలల వ్యవధిలోనే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు రైతుల నుంచి పిండుకుంటున్నారు.

**పచ్చి సరకు పేరుతో..**

క్వింటాకు రూ.2 చొప్పున రైతులు కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఉల్లి పంటకు మాత్రం క్వింటా రూ.4 చొప్పున కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

ఉల్లి పచ్చి సరకని గతంలో మార్కెట్ కమిటీ ఈ మేరకు ఛార్జీలను నిర్ణయించింది. ఈ కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తూకాల్లోనూ మోసాలు**

మార్కెట్ యార్డులో తూకాల్లో మోసాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ యంత్రాలతో అనుసంధానం చేయడం లేదు. ఫలితంగా మోసాలు జరుగుతున్నాయి. కొందరు కమీషన్ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో ముందస్తుగానే క్వింటాకు 2 నుంచి 4 కిలోల వరకు మైనస్‌లో పెట్టేస్తున్నారు.

బయట తూకం వేసే క్రమంలో అంతా సరిగానే ఉన్నట్లు కనిపిస్తుండటంతో రైతులు మోసాలను పసిగట్టలేకపోతున్నారు.

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ పరికరాలను అనుసంధానం చేస్తే ఈ-నామ్‌లో కచ్చితమైన తూకం ఉంటుంది. మార్కెట్‌లో మాత్రం ఇది అమలు కావడం లేదు.

**ఈ-పోస్.. ఉష్**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ఈ-పోస్ యంత్రాలను సమకూర్చుకోవడంపై అధికారులు దృష్టిపెట్టడం లేదు. రూ.2- 3 లక్షలు వెచ్చిస్తే పాడైన ఈ-పోస్ యంత్రాలకు మరమ్మతులు చేయించొచ్చు. లేదా కొత్తవి కొనుగోలు చేయొచ్చు.

ఈ-నామ్ అమలైనప్పటి నుంచి ఇక్కడ ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసిన దాఖలాలు లేవు. ఇవి అందుబాటులో ఉంటే మార్కెట్ కమిటీ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కాటాదారుల దోపిడీకి అవకాశం ఉండదు. ఇవి లేకుంటేనే రోజువారీగా ముడుపులు ముడుతుంటాయి. అందుకే ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసే పద్ధతిని పక్కన పెట్టేశారు.

# గనుల దారుల్లో ఘోరీలు

డోన్ : ఖనిజ గ్రామాల్లో 'దారి'ణంగా మారాయి. వాహనాలు అధిక బరువుతో ఖనిజాలు తీసుకెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మోకాలి లోతు గుంతలు, రహదారులపై కడ్డీలు తేలి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో గనులెక్కువ. జిల్లా పరిధిలో వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్ట్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. ఇక్కడ ముడి ఖనిజాన్ని తీసి పరిశ్రమలకు తరలిస్తారు. పౌడర్, సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన ముడిసరకును వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ తయారైన సిమెంటు, పౌడర్‌తోపాటు నాపరాయి, పాలిష్ బండలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్యాపిలి నుంచి బనగానపల్లి మార్గంలో ఓ సిమెంటు పరిశ్రమకు సంబంధించి నిత్యం వంద వరకు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. 52 కి.మీ. మేర దూరం ఉన్న ఈ రహదారి ప్యాపిలి నుంచి గార్లదిన్నె వరకు చాలాచోట్ల దెబ్బతింది. ఈ రోడ్డుపై 35 నుంచి 40 టన్నుల బరువుతోనే వాహనాలు వెళ్లాలి.. కానీ 55 నుంచి 65 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా మారింది.

**నిధులు మళ్లించిన వైకాపా**

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలు, రోడ్ల తదితర పనులకు వినియోగించుకోవాలి. గత వైకాపా ప్రభుత్వంలో డీఎంఎఫ్ నిధుల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యాయి. డబ్బుల వినియోగంపై ఆంక్షలు పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించారు. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**కోవెలకుంట్ల-మయలూరు మార్గంలో చెన్నైకు సిమెంట్ లారీలు వెళ్తుంటారు. అధిక సామర్థ్యంతో ముడిసరకును తీసుకెళ్తుండటంతో రహదారి బాగా దెబ్బతింది. ప్యాపిలి-బనగానపల్లి మార్గంలో గార్లదిన్నె వద్ద అధ్వానంగా మారింది. వెంగళాంపల్లె గ్రామ సమీపంలో గుంతలు పడి కంకర తేలింది. వెంకటాపల్లె, ఎన్.రంగాపురం వద్ద రహదారిపై కడ్డీలు తేలాయి. పసుపల గ్రామ సమీపంలోనూ రహదారి పలుచోట్ల గుంతలు పడింది. యాగంటిపల్లె, పాతపాడు సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల నుంచి సిమెంటునగర్ మీదుగా తమ్మరాజుపల్లెకు వెళ్లే రహదారిలో 6.5 కి.మీల దారి పలుచోట్ల దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# వ్యసనాలకు బా'నిషా'!

అనకాపల్లి : అనకాపల్లి మండలం సుబ్రహ్మణ్య కాలనీకి చెందిన ముగ్గురు యువకులు విలాసాలకు అలవాటు పడ్డారు. ఖర్చుకు డబ్బులు లేకపోవడంతో ఇటీవల పొలాల్లో విద్యుత్తు తీగలను దొంగతనం చేశారు. వాటిని కాల్చి లోపల రాగిని వేరుచేసి ఎలమంచిలి తుక్కు దుకాణంలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా పోలీసులకు చిక్కారు. మాడుగులకు చెందిన ఓ యువకుడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఇటీవల మాడుగులలో రెండిళ్లలో చోరీ చేసి.. బంగారం, వెండి వస్తువులను కాజేశాడు. వాటిని అమ్ముతుండగా పోలీసులు పక్కా వ్యూహంతో అతడిని అరెస్టు చేశారు.

విలాసాలకు, వ్యసనాలకు అలవాటు పడిన యువత పక్కదారి పడుతున్నారు. ఇటీవల కాలంలో ఇళ్లల్లో, ఆలయాల్లో, పొలాల్లో చోరీలకు పాల్పడిన నిందితుల్లో యువకుల నేపథ్యాన్ని గమనిస్తే వారంతా జల్సాల కోసమే తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో గంజాయి విచ్చలవిడిగా దొరికేది. కొంతమంది యువత సరకు రవాణాకు ఎస్కార్టుగా వ్యవహరించేవారు. మరికొంత మంది చిన్నచిన్న పొట్లాలుగా చుట్టి అమ్మేవారు. దాంతో వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. దాన్ని కట్టడి చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి రవాణాపై నిఘా పెంచి, మాదకద్రవ్య నిరోధక చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. దీనికితోడు శివారు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో డ్రోన్ల తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో ఏళ్లగా విలాసాలకు అలవాటుపడిన యువకులు ప్రస్తుతం చోరీల



బాటపట్టారు. ఇటీవల ముగ్గురు స్నేహితులు దర్జీనగర్‌లో వరుసగా దొంగతనాలు చేశారు. అపహరించిన వస్తువులను ఓ ఇంట్లో ఉంచి.. అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరంతా యువకులే. తాళాలేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతోపాటు అనకాపల్లి పట్టణంలోని తుమ్మపాల రైల్వేబ్రిడ్జి దగ్గర అర్ధరాత్రి సమయాల్లో కొంతమంది గంజాయి తాగి.. దారిదోపిడీలకు పాల్పడుతున్నారు.

**అంతటా నిఘా..:** పోలీస్‌స్టేషన్ పరిధిలో నిఘా కట్టుదిట్టం చేశాం. గతంలో గంజాయితో పట్టుబడిన కేసుల్లో ఉన్నవారిపై నిఘా పెట్టాం. ప్రస్తుతం విలాసాలకు అలవాటుపడి యువత ఇళ్లు, విద్యుత్తు వైర్లు దొంగతనానికి పాల్పడుతున్నారు. ఇటువంటివారిని గుర్తించి కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నాం.అశోక్ కుమార్, అనకాపల్లి రూరల్, సీఐ

# ఆహారం నిండుగా.. ఆరోగ్యం మెండుగా

నర్సీపట్నం : మన జీవన శైలిలో మారిన ఆహారపు అలవాట్లు రోగాలకు కారణమవుతున్నాయి. గర్భిణులు, బాలింతల సహా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను సైతం వ్యాధులు వెంటాడుతున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందుతున్న పోషకాహారాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. దీంతో రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రారంభమైన పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బలవర్ధక ఆహార పదార్థాల తయారీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మాతా శిశు మరణాలకు పోషకాహార లోపం సైతం ఒక కారణంగా గుర్తించారు. దీనిపై ఏటా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను చేపడుతున్నారు. సంపూర్ణ ఆహారం ప్రాధాన్యాన్ని తెలియజేయడంతో పాటు స్వయంగా విలువలతో కూడిన పదార్థాలను తయారుచేసి చూపించాలని ప్రభుత్వ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలోని 1049 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

అన్ని కేంద్రాల్లోనూ వచ్చే అక్టోబర్ నెల 16 వరకు బలాన్నిచ్చే వంటకాల తయారీ, తక్కువ ధరలకే లభించే పండ్లపై విస్తృతంగా అందరికీ అవగాహన కల్పించనున్నారు. అవసరమైన వారి ఇళ్లకే వెళ్లి కార్యకర్తలు



వీటి గురించి వివరిస్తారు. జామ, బొప్పాయి, అరటి పండ్లు తినేలా అవగాహన కల్పిస్తున్నారు.

రాగులు, సజ్జలు, జొన్నలు అరికెలు, ఊదలు తదితర తృణధాన్యాలతో వంటకాల తయారీ విధానం గురించి వివరించాలన్నారు. జంక్ ఫుడ్‌తో కలిగే నష్టాలు, ఊబకాయం, మధుమేహం తదితర వ్యాధులకు ఆహారపు అలవాట్లులోని కారణాలను తెలియజేస్తారు. ఎప్పుడు ఏ వయస్సు వారు ఎంత మోతాదులో ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలనే దానిపై పూర్తి అవగాహన కల్పిస్తారు.

పోషక విలువుల నష్టపోకుండా ఆహారాన్ని అందరితో తయారు చేయించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. కేంద్రాల్లోనూ గ్రామాల్లోని బహిరంగ ప్రాంతాల్లో న్యూట్రిషన్లతో పౌష్టికాహార వంటకాలను చేయించే డిమాన్‌స్ట్రేషన్లను ఏర్పాటు చేయనున్నాం.ఈ ఆహారం తయారీపై పోటీలు నిర్వహిస్తాం. ఎదిగే అయిదేళ్ల లోపు పిల్లల ఏఏ వయస్సులో ఎన్ని కప్పుల ఆహారాన్ని తీసుకోవాలో వివరిస్తారు. ఆకుకూరలు, కాయగూరలను ముందుగా నీళ్లతో బాగా కడిగిన తరువాతే కత్తిరిస్తే అవి పోషకాలను కోల్పోకుండా ఉంటాయని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి వివరించారు.

# బృహత్తర లక్ష్యానికి చెదలు



గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో జల్‌జీవన్ మిషన్ కింద రెండేళ్ల కిందట మంజూరైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పథకాల నిర్మాణాలకు నిధులను భరించాల్సి ఉంది. కేంద్రం నిధులు ఇచ్చినా అప్పటి వైకాపా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ఈకారణంగానే పనులు పడకేశాయి. మూడు నియోజకవర్గాల్లో రూ.156.55 కోట్లతో రెండో విడతలో వైకాపా ప్రభుత్వం నీటి పథకాల పనులను మంజూరు చేసింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు పనులను పర్యవేక్షించారు. తొలి, మలి విడతల్లో మంజూరు చేసిన పనులను ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేకపోవడంతోనే పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇంజినీర్లు గ్రామాల్లోని తాగునీటి పథకాలకు అదనంగా బోర్లు వేశారు. కుళాయి కనెక్షన్లు ఇస్తూ వచ్చారు.

**నిధులురాక.. పనులు సాగక!**

ప్రభుత్వం మారిపోవడంతో మొదలు కాని పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. మూడు నియోజకవర్గాల్లో 763 పనులకు గాను 114 పనులు పూర్తి చేశారు. అన్నీ పూర్తయితే గ్రామీణులకు తాగునీటి సమస్య తీరి రక్షిత నీరు అందుతుంది. ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా బోర్ల నుంచి నీరు రావడం లేదు. మూడేళ్ల కిందటి వరకు వేసవిలో అధికారులు ట్యాంకర్లతో ప్రజలకు తాగునీరు అందించేవారు. తర్వాత ఆ తరహా సాంత్వన చర్యలు ఏవీ లేకుండా పోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**డీపీఆర్‌లో మార్పులు చేసినా..**

పథకాలకు అదనంగా నీటి వనరులను కల్పించేందుకు బోర్లు వేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని ఇప్పటి ప్రభుత్వం డీపీఆర్‌లో మార్పులు చేసింది. బోర్లలో నీరు భవిష్యత్తులో ఇంకిపోయే ప్రమాదం ఉందని గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాలకు ఎంపీఆర్ డ్యామ్ నుంచి నీరు ఇవ్వాలని నిర్ణయించింది. తాడిపత్రి నియోజకవర్గానికి గండికోట నుంచి నీరు ఇవ్వాలని ఇంజినీర్లు తీర్మానించారు. ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గానికి పీఏబీఆర్ నుంచి నీరు ఇవ్వాలనుకున్నారు. ఈమేరకు డీపీఆర్‌లను ప్రభుత్వం తీసుకుంది. అయితే పనులను కొత్తగా మంజూరు చేసి నిధులు ఇవ్వలేకపోతోంది. రద్దు చేసిన పనులు కొత్త అంచనాలతో ఇంకా ప్రభుత్వం మంజూరు చేయలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ తెలిపారు.

# అక్కడ కూరగాయలు కిలో 25 పైసలే!



పుట్టపర్తి: బుక్కపట్నం బాలికల పాఠశాలను వసతుల లేమి కారణంగా పుట్టపర్తి సమీపంలోని బీడుపల్లి రోడ్డులో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పచ్చిమిరపకాయలు నాసిరకంగా ఉన్నాయి. మొత్తం 291 విద్యార్థినులకుగాను 247 మంది హాజరయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్‌ను అడగగా కొందరు జ్వరంతో బాధపడుతున్నారు, మరికొందరు ఆధార్ నమోదు కోసం వెళ్లగా.. మరికొందరు గైర్హాజరయ్యారని తెలిపారు. కూరగాయలు, పండ్లు.. వీటిలో ఏవి కావాలన్నా.. నచ్చిన ధరకు కాదు కాదు.. మీరు ఆశ్చర్యపోయే ధరకు లభిస్తాయి. ఎక్కడో తెలుసా.. శ్రీసత్యసాయి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపులె పాఠశాలలు, కళాశాలలకు కూరగాయలు, పండ్లు సఫరా చేసే గుత్తేదారుల వద్ద.. అవును మరి కొన్ని నెలలుగా వారు సరకులను సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని బుక్కపట్నం, రాంపురం, రొద్దం, రేగాటిపల్లి, నసనకోటలో మహాత్మాజ్యోతిబా ఫులే ఉన్నత పాఠశాలలు, టేకులోడు, లేపాక్షి, గుడిబండ, గుండుమలలో పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పౌష్టికాహారం అందిస్తుంది. కూటమి సర్కారు వచ్చాక సన్న బియ్యం సరఫరా చేస్తోంది. మరింత శ్రద్ధ తీసుకుని మెనూ అమలు చేస్తోంది. ఈక్రమంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఎలా సాధ్యం? దోసకాయ, మునక్కాయ, దొండకాయ, గుమ్మడికాయ, క్యాలీఫ్లవర్, గోరుచిక్కుడు, ఎర్రముల్లంగి, బెంగళూరు మిరపకాయ, పుదీన, కొత్తిమీర, కరివేపాకు ఇవన్నీ కిలో 25 పైసలకే సరఫరా చేస్తామన్నారు.ప్రస్తుతం ఇవన్నీ మార్కెట్లో కిలో రూ.20 నుంచి 50 వరకు పలుకుతున్నాయి. అంత తక్కువ ధరకు ఎలా సాధ్యమవుతుందన్న విషయాన్ని అధికారులు ఆలోచించకపోవడం గమనార్హం.

**విద్యార్థుల సంఖ్య.. హాజరుకు పొంతనేదీ..**

విద్యార్థుల సంఖ్యకు, హాజరైనవారి మధ్య పొంతన కుదరడం లేదు. ఉదాహరణకు ప్రతి విద్యార్థికి 100 ఎంఎల్ చొప్పున పాలు ఇవ్వాల్సి ఉంటుంది. అంటే 300 మంది విద్యార్థులుంటే.. 30 లీటర్ల పాలు సరఫరా చేయాలి. వారు ఎన్ని ప్యాకెట్లు ఇస్తున్నారన్నది ప్రిన్సిపల్, గుత్తేదారుకు తప్ప ఇతరులకు తెలియదు. పాలను తప్పనిసరిగా ప్యాకెట్ల రూపంలోనే సరఫరా చేయాలి. కొన్నిచోట్ల విడిగా పంపిణీ చేస్తున్నారు. కూరగాయల నాణ్యత, పరిమాణంలో తేడాలు ఉంటున్నాయి.

జిల్లా: శ్రీసత్యసాయి

మహాత్మా జ్యోతిబాపులె విద్యాలయాలు: 13

మొత్తం విద్యార్థులు: 7,218

నిబంధనల మేరకే బిల్లులిస్తాం..: జమునాబాయ్, ఎంజేపీ విద్యాలయాల కన్వీనర్

గుత్తేదారులు టెండరు సమయంలో ఎంత పేర్కొన్నారో అంతే బిల్లులు చేస్తాం. నాణ్యత, పరిమాణంలో తేడాలుంటే సరకు వెనక్కి పంపుతాం. కొన్నిచోట్ల పాలు విడిగా ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కడైనా అవకతవకలుంటే విచారించి చర్యలు తీసుకుంటాం.

# కాలుష్యం ముంగిట కౌండిన్య



పలమనేరు : కౌండిన్య నదిలో నీరు ప్రమాదకరంగా మారుతోంది. పట్టణంలోని మురుగు మొత్తం నదిలో చేరి కలుషితమవుతోంది. ఇటీవల వర్షాలకు కొంత వరకు నీరు నదిలోకి వచ్చింది. పూర్తిస్థాయిలో వస్తే తరువాత దాన్ని ప్రజలకు అందివ్వాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. మురుగును దారి మళ్లిస్తే తప్పా ఈ నీరు తాగడానికి పనికిరాదు. ఏం జరుగుతోంది పట్టణంలోని మురుగు మొత్తం పెద్దచెరువులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఆ నీరు మరవ ద్వారా బొమ్మదొడ్డి చెరువుకు చేరి అక్కడి నుంచి కౌండిన్య నదిలోకి ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలోకి కొంత నీరు చేరింది. వర్షపు నీటితో పాటు మురుగు నదిలో కలిసిపోయింది. వర్షపు నీరు తక్కువ కావడంతో మురుగు ప్రస్తుతం నీటిపైన నిలిచింది. ఏటా భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు నిండి అదనపు నీరు తమిళనాడు రాష్ట్రంలోని అడవిలోకి చేరేది. అప్పుడు అదనపు వరద నీటితో పాటు మురుగు మొత్తం ప్రాజెక్టును దాటుకుని అవతలికి కొట్టుకుపోయేది. ఇప్పుడు నీరు తక్కువగా ఉండటంతో మురుగు ఇక్కడే నిలిచిపోయింది.

**స్థలాన్వేషణ**

మురుగును శుద్ధి చేసే ఎస్‌టీపీ కోసం అధికారులు స్థలాన్వేషణలో ఉన్నారు. ప్రైవేటు భూములను తీసుకోవాలని గతంలో ఆలోచించారు. అయితే ప్రభుత్వం కేవలం ప్రభుత్వ భూమిని మాత్రమే ఇందుకు పరిశీలించాలని ఆదేశించడంతో పట్టణానికి సమీపంలోని పాత కంపోస్టు యార్డు స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రజలు కూడా ఈ ప్రతిపాదనపై సమ్మతి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మురుగును శుద్ధి చేస్తే తాగునీటిలో మురుగు కలిసే ప్రమాదం ఉండదు.

పట్టణ జనాభా: 50వేలు

వార్డులు : 26

నీటి వనరులు : క్యాటిల్‌ఫారం వద్ద సంప్, కౌండిన్య నదిలోని ప్రాజెక్టు, బోర్ల ద్వారా భూగర్భజలాలు, వేసవిలో ట్యాంకర్ల ద్వారా

సమస్య పరిష్కరిస్తాం ఎస్‌టీపీ కోసం స్థలాన్ని ఎంపిక చేసే పనిలో ఉన్నాం. త్వరలోనే మురుగు సమస్య తీరుస్తాం. వర్షాకాలంలో కూడా శుద్ధి చేసిన నీటినే ఇస్తున్నాం.ఎన్వీరమణారెడ్డి, కమిషనర్, పలమనేరు.

# రాయితీ సవరణ.. సంఘాలకు ఆదరణ

చిత్తూరు : గత ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సున్నా, పావలా వడ్డీ పేరుతో కొంతమేర మాత్రమే ఉపశమనం ఇచ్చేది. కూటమి ప్రభుత్వం రుణం మొత్తానికి రాయితీ వర్తించేలా చేయడంతో సంఘాల సభ్యులకు వడ్డీలో ఊరట లభించనుంది. గతంలో బ్యాంకు లింకేజీ రుణంపై 13 శాతం, స్త్రీనిధి రుణంపై 12 శాతం వడ్డీలు ఉండేవి. కూటమి ప్రభుత్వం వడ్డీ రేట్లను సవరించింది.సంఘంలోని సభ్యులు రుణం తీసుకుంటే రూపాయి వడ్డీతో వాయిదా పద్ధతిలో చెల్లించేవారు. ఈ భారాన్ని కూటమి ప్రభుత్వం 95 పైసలకు తగ్గించింది. ఇప్పుడు ఎంత రుణం తీసుకున్నా రెండు శాతం వడ్డీ రాయితీ అందిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో సభ్యులు తీసుకునే స్త్రీనిధి, బ్యాంకు రుణాలపై వడ్డీ భారం తగ్గడంతో ఉపశమనం లభించనుంది. సభ్యులు చేయాల్సిందల్లా ప్రతి నెలా పదో తేదీలోగా వాయిదాలు చెల్లించాలంతే.

# వసతిగృహ విద్యార్థులకు తీపికబురు

పాయకరావుపేట : జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న వారికి నగదు అందించనున్నారు. టూత్ పేస్టులు, కొబ్బరి నూనె, షాంపూలు, సబ్బులు తదితర వస్తువుల కొనుగోలుకు నెలకు కొద్ది మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 30 వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న వారికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం 3,569 మంది విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటున్నారు. బాల, బాలికల అవసరాలకు అనుగుణంగా తరగతుల వారీగా రూ.125 నుంచి రూ.255 వరకు నెలవారీ కాస్మెటిక్ ఛార్జీలు చెల్లిస్తారు. దీనిలో హెయిర్ కటింగుకు రూ. 50 చెల్లిస్తారు.

ప్రస్తుతం అలంకరణ సామగ్రి కొనుగోలు ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం



మొదటి విడతలో రూ.23 లక్షలు, రెండో విడతగా రూ.16 లక్షలు మంజూరు చేసింది.మూడు నుంచి ఆరు తరగతులు చదివే బాలురకు రూ. 125, బాలికలకు రూ. 130, ఏడు నుంచి 10 చదివే బాలురకు రూ. 150, బాలికలకు రూ. 200 నగదు చొప్పున నెలకు చెల్లిస్తారు. ఇంటర్ ఆపై చదువుతున్న బాలురకు రూ. 200 నుంచి రూ. 265 వరకు చెల్లించనున్నారు.

**తల్లుల ఖాతాల్లో జమ...:** కాస్మోటిక్ ఛార్జీల నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తాం. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. వసతిగృహ విద్యార్థులకు ఛార్జీలు సకాలంలోనే చెల్లిస్తున్నాం. వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం.బి. రామనాథం, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు

# గుట్టుగా ఆక్రమిం'కేసీ'

నంద్యాల : భగత్‌సింగ్ కాలనీలో కేసీ పంట కాల్వపై కల్వర్టు నిర్మించారు. స్థిరాస్తి వ్యాపారులు దీన్ని పూడ్చి సమాంతరంగా మరో ప్రదేశంలో తవ్వారు. కాల్వ ఆరు మీటర్లకు బదులు మూడు మీటర్లు ఉండేలా నిర్మించడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది.

జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో 16 కి.మీ. మేర ప్రవహించే కర్నూలు-కడప (కేసీ) పంట కాల్వలను స్థిరాస్తి వ్యాపారులు పూడ్చేస్తున్నారు. పట్టణంలో నూతన కాలనీలు వెలుస్తున్నాయి. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. స్థలాల విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్కడ వాలిపోతున్నారు.

**కానరాని 'పరిరక్షణ**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేసీ కాల్వ సాగునీటి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. పలు ప్రాంతాల్లో ధ్వంసం చేశారు. అనధికార అనుమతులతో ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఆనవాళ్లు లేకుండా చేశారు. పంట కాల్వ గట్లను అటూఇటూ



కలిపేసుకొని ప్లాట్లుగా మార్చారు. కాల్వ పరిరక్షణకు హద్దుల నిర్ణయించాలని గతంలో చర్చించారు. సర్వే చేసి శిఖం భూములను గుర్తించాలనే ప్రయత్నాలు జరిగాయి. కానీ అడుగులు పడటం లేదు. ఇదే సమయంలో ఆక్రమణలు ఆగడం లేదు. సెంటు స్థలం రూ.లక్షలు పలుకుతున్న ప్రాంతంలో కనీస చర్యలు లేకపోవడంతో ఆక్రమణలకు అంతే లేకుండా పోయింది.

**పెద్ద చెరువు నుంచి మొదలై**

నంద్యాల పెద్ద చెరువు సమీపంలోని ఎస్బీఐ కాలనీ వద్ద కేసీ ప్రధాన కాలువ ప్రారంభమవుతుంది. అక్కడినుంచి ఫరూక్‌నగర్, బాలాజీ కాంప్లెక్స్, ఎన్జీవో కాలనీ, నూనెపల్లె, రైతునగరం, కాంతినగర్, కానాల, చాపిరేవుల గ్రామ శివారు మీదుగా పంట కాల్వలు వెళ్తాయి.

ఏటా కాల్వ శిఖం భూమిని పూడ్చేస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారులు పంట కాల్వలను పూడ్చి వెంచర్లలో కలిపేస్తున్నారు. నూనెపల్లె నుంచి కానాల, నూనెపల్లె నుంచి రైతునగరం మీదుగా కాంతినగర్ వరకు పదుల సంఖ్యలో వేసిన వెంచర్లతో కేసీ కాల్వ చిక్కుకుంది.

# మండపం.. కాలక్షేపానికే పనికొస్తోంది!

విజయనగరం : విజయనగరంలోని సంతపేట జగన్నాథస్వామి ఆలయానికి చెందిన పురాణ కాలక్షేప మండపం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రూ.80 లక్షల నిధులతో దేవాలయ స్థలంలో నాలుగేళ్ల కిందట దీనిని నిర్మించారు. అప్పటి నుంచి కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. ప్రహరీ లేని కారణంగా వినియోగించడం లేదు. ఇక్కడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. అవసరం మేరకు లీజుకు ఇచ్చేందుకు సైతం దేవాదాయశాఖ భావిస్తోంది. ఆ చర్యలేవీ లేకపోవడంతో జూదానికి కేంద్రంగా మారింది. సాయంత్రం వేళల్లో మందుబాబులు, గంజాయి తాగేవారు తిష్ఠ వేస్తున్నారు. మరికొన్ని పనులు ఉన్నాయని, పూర్తి చేసి, లీజుకు కేటాయిస్తామని సహాయ కమిషనర్ శిరీష తెలిపారు.

## జీర్ణకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స

విశాఖపట్నం : మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా జీర్ణకోశ వ్యాధులు పెరిగాయి. నిత్యం వందలాది మంది ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విమ్స్, కేజీహెచ్‌కు రోగుల తాకిడి అధికంగా ఉంటోంది. ఇక్కడ ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

**అందిస్తున్న సేవలు..:** అన్నవాహిక, పొట్ట, కాలేయం, పాంక్రియాస్, పేగుల వ్యాధులకు విమ్స్‌లో అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నారు. శస్త్రచికిత్స అవసరం లేకుండా ల్యాప్రోస్కోపి, ఈఆర్‌సీపీ పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రతను అంచనా వేసి మందులతో తగ్గిస్తున్నారు. అప్పటికీ తగ్గని వారికి తదుపరి కొలనోస్కోపి, సిగ్మాయిడో స్కోపి లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పేగు పూతలు, రక్తస్రావం, హెర్నియా తదితర




సమస్యలు ఉన్న వారికి స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ, గ్యాస్ట్రిక్ బైపాస్, పాంక్రియాస్, కాలేయ శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

**ఓపీకి రోజుకు 1200 మంది:** ఈ విభాగంలో ఇద్దరు వైద్యులు, ఏడుగురు సహాయ సిబ్బంది ఉన్నారు. రోజుకు సుమారు 1200 మంది ఓపీకి వస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా సుమారు 150 చికిత్స పొందుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎండోస్కోపికి రూ.3వేల నుంచి రూ.50వేల వరకు, ఈఆర్‌సీపీకి సుమారు రూ.50వేలు, కొలనోస్కోపికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు, సిగ్మాయిడో స్కోపికి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు. విమ్స్‌లో ఇవన్నీ ఉచితంగా చేస్తున్నారు.

**వ్యాధి తీవ్రతను బట్టి శస్త్రచికిత్సలు:** జీర్ణకోశ వ్యాధులతో వచ్చేవారికి ముందుగా మందులు అందించి, ఆహారపు అలవాట్లు, పొగ తాగటం, మద్యం, గుట్కా, పాన్ మసాలా మానేయాలని సూచిస్తున్నాం. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండేవారికి వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నాం. డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

## భూ'కాసురులు'


నంద్యాల : అవుకు మండలం సంగపట్నం గ్రామంలో ఎస్సార్బీసీ గట్టు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా కొందరికి ఆన్‌లైన్ చేసేశారు. ఏకంగా 45 ఎకరాలను కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. పేదల పేరుతో పలువురు పెద్దలు కొట్టేశారన్న ఆరోపణలున్నాయి. ఆయా భూముల విలువ సుమారు రూ.6.75 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**న్యాయస్థానం పరిధిలో ఉన్నా..**

సంగపట్నం గ్రామంలోని సర్వే నంబర్లు 603, 334లో ఉన్న భూములు.. ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నాయి. ఆయా కేసులు పూర్తైతేగానీ.. వాటిని పంపిణీ చేయకూడదు. అయినప్పటికీ వీటిని పలువురికి పంచేశారు. 334వ సర్వే నంబరులోని భూములకు సంబంధించిన పట్టాలను మాత్రం అధికారులు పంపిణీ చేయలేదు. అయినప్పటికీ కొందరు నేతలు ఆ సర్వే నంబరులో ఎక్కడి భూమిని, ఎవరికి కేటాయించారన్న విషయాన్ని అనధికారికంగా కొందరికి చెప్పారు. దీంతో ఆయా భూములను పలువురు తమ అధీనంలో ఉంచుకున్నారు.

**వైకాపా నేతల కన్ను**

సంగపట్నం గ్రామ పరిధిలోని కొండ దిగువన పలు సర్వే నంబర్లలో వంద ఎకరాల వరకు ప్రభుత్వ భూములున్నాయి. ఎస్సార్బీసీని ఆ ప్రాంతం మీదుగా తవ్వడంతో ఆయా భూముల విలువ ఒక్కసారిగా పెరిగింది. వైకాపా హయాంలో కొందరు నాయకుల కళ్లు వీటిపై పడ్డాయి. ఎన్నికల ముందు ఈ భూములను పేదలకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. పేదల పేరుతో కొందరు పెద్దలు



దరఖాస్తు చేసుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లు భరించలేక స్థానిక అధికారులు అనర్హుల పేర్లను సైతం రాసి భూ పంపిణీకి రంగం సిద్ధం చేశారు. ఎసైన్‌మెంట్ కమిటీలో తహసీల్దారు, ఆర్డీవో, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జేసీ సంతకాలుండాలి. దస్త్రంపై అప్పటి జేసీ సంతకాలు లేకుండానే కొందరికి పట్టాలు పంపిణీ చేశారు. కొందరికి పట్టాలు ఇవ్వకుండా ఎక్కడి భూములు కేటాయించారన్న విషయాన్ని చెప్పారు. దీంతో పలువురు ఆయా భూములను అనధికారికంగా స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నారు.

**విచారణ చేపట్టకనే..**

సంగపట్నం గ్రామంలోని ప్రభుత్వ సర్వే నంబర్లు 327, 328, 334, 432, 597, 598, 599, 600, 602, 603లలోని మొత్తం 82 ఎకరాలను అధికారులు పంపిణీ చేశారు. వారిలో కూడా పలువురు అనర్హులున్నారన్న విమర్శలున్నా ఆయా ఆరోపణలపై విచారణ చేపట్టలేదు. ఒక్కొక్కరికి 25 సెంట్ల నుంచి మూడు ఎకరాల వరకు పంపిణీ చేశారు. సంగపట్నం గ్రామానికి చెందిన ఓ మహిళ భర్తకు ఏడెకరాల వరకు పొలం ఉంది. అయినప్పటికీ ఆమె నిరుపేద అని చెప్పి 75 సెంట్ల భూమి తీసుకున్నారు.

భూముల పొందినవారి జాబితాలో ఉన్న ఇద్దరు మహిళలు సంగపట్నం గ్రామానికి చెందినవారే కాదు. వారిద్దరికీ ఒకటిన్నర ఎకరం చొప్పున కేటాయించారు. ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు : సాయికిరణ్, మహబూబ్‌వలి, హసన్, సంగపట్నం గ్రామస్థులు

సంగపట్నం గ్రామంలో పలువురు పట్టాలు లేకుండానే ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులే కాదు. పలువురి పేర్లను అధికారులు అడ్డగోలుగా ఆన్‌లైన్ చేశారు. గ్రామంలో పేదలున్నప్పటికీ వారిని కాదని వేరే గ్రామాలవారికి భూములిచ్చారు.

# 'అధికార' వల.. చేపకు చెర



పత్తికొండ : పత్తికొండ మండలం పందికోన రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు గ్రామ పంచాయతీకి నిర్దేశించిన పన్ను చెల్లించి.. తర్వాత విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులే సొమ్ము చేసుకుంటున్నారు.

మత్స్యకారులకు చేదోడుగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం రిజర్వాయర్లు, చెరువులను వారికి అప్పగించింది. నిర్దేశించిన మత్స్యకార సంఘాలు చేపలు పట్టుకోవడం, విక్రయించాలన్నది నిబంధన. ఉమ్మడి జిల్లాలో మత్స్యకార సంఘాలు చేపలను విక్రయిస్తున్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా.. వెనుక బడాబాబుల ఆధ్వర్యంలోనే క్రయవిక్రయాలు సాగుతున్నాయి.

**సంఘాల పేరుతో 'పెత్తనం'**

కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 32 మత్స్యకార సంఘాలున్నాయి. కర్నూలులో 1,642 మంది, నంద్యాల జిల్లా పరిధిలో 2,153 మంది సభ్యులున్నారు. వీరి ఆధ్వర్యంలోనే జలాశయాలు, చెరువుల్లో చేపలు పడుతున్నారు.

వలలు, దాణా, పుట్టీలు తదితరాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం మత్స్యకారులకు రుణాలు మంజూరు చేస్తుంది. చాలాచోట్ల వీరు కేవలం చేపలు పట్టేందుకు మాత్రమే పరిమితమవుతున్నారు. వీటిని 'బడాబాబులు' నామమాత్రపు ధరకు కొనుగోలు చేసి బహిరంగ విపణిలో ఎక్కువ మొత్తాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**అధికారంలో ఏ పార్టీ ఉంటే వారిదే..**

గత కొన్నేళ్లుగా కొందరు నాయకులు రిజర్వాయర్లు, చెరువులను అనధికారికంగా కబ్జా చేశారు. మత్స్యకారుల నుంచి నేరుగా చేపలను కొనుగోలు చేసి అక్కడే ఐస్ డబ్బాల్లో ప్యాక్ చేసి చేపల మార్కెట్లకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల చేపలను మత్స్యకారుల పేరుతో వీరే వేటాడుతున్నారు. మరికొన్నిచోట్ల ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ నియోజకవర్గ నాయకుల పెత్తనం సాగుతోంది. కాదంటే చేపలను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

మంత్రాలయం నియోజకవర్గ పరిధి.. కోసిగి మండలంలోని పులికనుమ రిజర్వాయరు, పెద్దకడబూరు మండలంలోని రాయల చెరువులో పట్టే చేపలను ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు ప్రభావితం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఒక నాయకుడి హవా నడిపిస్తే.. గతేడాది నుంచి మరో నేత పెద్దఎత్తున ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

శ్రమ ఒకరిది.. లెక్క మరొకరిది

కర్నూలు జిల్లాలో 425.76 ఎకరాల్లో మంచినీటి చేపలు పెంచుతున్నారు. గాజులదిన్నె, కృష్ణగిరి, పందికోన, పులికనుమ రిజర్వాయర్లతోపాటు 52 చెరువుల్లో ఏటా సగటున 57 లక్షల చేప పిల్లలు వదులుతున్నారు.

నంద్యాల జిల్లాలో వెలుగోడు, గోరుకల్లు, అవుకు, శ్రీశైలం రిజర్వాయర్లతోపాటు 124 చెరువుల్లో సగటున 60 లక్షల చేప పిల్లలు వదులుతున్నారు. కర్నూలు జిల్లాలో 10,846 టన్నుల చేపలు, 23 టన్నుల రొయ్యలు, నంద్యాల జిల్లాలో 21,129 టన్నుల చేపలు, 11.61 టన్నుల రొయ్యలు ఉత్పత్తి జరుగుతుంది. ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నా మత్స్యకార సంఘాలకు ఆదాయం చేరడం లేదు. చాలాచోట్ల చేపలను మత్స్యకారులు వేటాడిన తర్వాత బడాబాబులు సగటున కిలో రూ.50 నుంచి రూ.60కు కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ విపణిలో రూ.150కు అమ్ముకుంటున్నారు.

# అద్దె భవనం.. యువతకు వసతి కష్టం



కర్నూలు : పేదింటి బిడ్డలు.. ఉన్నత చదువులకు పట్టణాల కొచ్చారు.. 'అద్దె'భారం భరించలేక పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో ఉంటున్నారు. వీరంతా ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువుతున్నవారే. 31 వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అక్కడి సమస్యలు యువత చదువుకు ఆటంకంగా మారాయి. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.1,600 కేటాయిస్తుంది. ఈ నిధులతో మెనూ అమలు చేయడంతో పాటు గ్యాస్, మరమ్మతులకు వెచ్చించాల్సి ఉంటుంది. అద్దె, విద్యుత్తు బిల్లును ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతుండటంతో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు.

**ఐదు వేల మంది..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28 బీసీ పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో 3,031 మంది విద్యార్థులు ఉన్నారు. 17 వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.. సొంత భవనాలన్నీ శిథిలావస్థకు చేరాయి.

21 ఎస్సీ పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో 2,655 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 12 వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గిరిజన విద్యార్థులకు సంబంధించి నంద్యాల జిల్లాలో మూడు వసతి గృహాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో 250 మంది వరకు గిరిజన యువత ఉంటోంది.

**బిల్లులు రావు.. పర్యవేక్షణ లేదు**

బీసీ విద్యార్థులకు సంబంధించి ఐదు నెలల నుంచి డైట్ బిల్లులు రాకపోవడంతో చాలామంది వార్డెన్లు అప్పులు చేసి వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. దీంతో మెనూ అమలు కావడం లేదు. విద్యార్థులకు వండే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించింది. కళాశాల విద్యార్థులతో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు వేయించాల్సి రావడం తలనొప్పిగా మారిందని వసతిగృహ అధికారులు పేర్కొంటున్నారు. 15 బీసీ వసతిగృహాల వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి బాధ్యత ఇన్‌ఛార్జులే చూస్తున్నారు. దీంతో హాస్టళ్ల నిర్వహణ గాడితప్పింది. జిల్లా అధికారులు ప్రతినెలా వసతిగృహాలను పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల సమస్యల గురించి పట్టించుకునేవారే కరవయ్యారు.

**మూడు పట్టణాల్లోనే ఎక్కువ**

కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తక్కువ గదులు ఉండటం.. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు, స్నానం గదులు లేక ఆరుబయట ప్రాంతాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్నింటికి నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఆయా భవనాల యజమానుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. సంక్షేమాధికారులు వీరికి సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. అద్దె భవనాల్లో విద్యుత్తు దీపాలు పాడైనా, ఏవైనా మరమ్మతులు చేయించాలన్నా వార్డెన్లు సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం సరిపడా నిధులు ఇవ్వక, అన్ని సౌకర్యాలతో కూడిన అద్దె భవనాలు లభించక అసౌకర్యాల మధ్యే కాలం నెట్టుకురావాల్సి వస్తోంది. బీసీ వసతి గృహాల్లో అక్కడక్కడా నాలుగో తరగతి సిబ్బంది ఉండగా.. ఎస్సీ వసతి గృహాల్లో పూర్తిగా లేరు. విద్యార్థులే సిబ్బందిని నియమించుకుని ఉపకార వేతనాల్లో కొంత చెల్లిస్తున్నారు. వసతి గృహాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రైవేటు ట్యాంకుల ద్వారా నీటిని తెప్పించాల్సి వస్తోంది.

# గోరుకల్లుకు కరకట్టలు



కర్నూలు : గోరుకల్లు జలాశయం కట్ట పటిష్ఠతకు రూ.53 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం వైకాపా హయాంలో నిర్వహణ చేపట్టక కట్ట కుంగింది.. మరమ్మతులు చేసేందుకు నిధులివ్వాలని అధికారులు అభ్యర్థించినా పట్టించుకోలేదు.. సమస్యను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జలాశయం వద్ద నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు రూ.99 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో తొలిదశలో రూ.58.90 కోట్లు కేటాయించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ పంపారు. ఈ నేపథ్యంలో రూ.53 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జలాశయం ప్రధాన కరకట్ట బలోపేతం చేస్తారు. ఇప్పుడున్న బండ్ ఎత్తు 261 మీటర్ల నుంచి 265.40 మీటర్లకు పెంచనున్నారు.

## అతివలకు అండగా..

చోడవరం : కూటమి ప్రభుత్వంలో మహిళలను ఆర్థికంగా సుస్థిరం చేసేందుకు వడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా మహిళా డెయిరీ సహకార సంఘాల పేరిట గ్రామాల్లో పాలను సేకరించి డెయిరీలకు సరఫరా చేసేలా ఓ పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అండతో చేపట్టే ఈ సంఘాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కమీషన్ రూపంలో వచ్చే నగదుతోపాటు కొలతలో మిగులు పాలను సహకార సంఘాన్ని నిర్వహించేందుకు ఆర్థిక వనరుగా వినియోగిస్తారు. ఈ సంఘాల ఏర్పాటులో పశుసంవర్ధక శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. సంఘం ఏర్పాటుకు గ్రామంలో కనీసం 11 మంది సభ్యులు ఉండాలి. వీరిలో ఇద్దరు మహిళలు ప్రమోటర్-1, ప్రమోటర్-2లు ఎంపిక చేసుకుని వారిద్దరి పేరున సంయుక్తంగా బ్యాంకు ఖాతాలను తెరుస్తారు. పాలు సేకరణ, కొలతలు తదితరమైన పనులకు కార్యదర్శి ఉంటారు. సేకరించిన పాలను పలు ప్రైవేటు డెయిరీలకు విక్రయించాల్సి ఉంటుంది. ఏ డెయిరీ అధిక ధరను చెల్లిస్తే దానినే సంఘాలు ఎంపిక



చేసుకోవచ్చు. లావాదేవీలన్నీ సంఘం ఆధ్వర్యంలోనే జరుగుతాయి. మహిళలు సహకార సంఘంగా ఏర్పడితే పశుసంవర్ధక శాఖ సిఫార్సుతో ధ్రువపత్రం అందజేస్తారు. రికార్డులు, గణాంకాలు నిక్షిప్తం చేసేందుకు కంప్యూటర్, పరీక్షలు నిర్వహించే పరికరాలు కేంద్రం ఉచితంగా అందజేస్తుంది.

**సంఘం ద్వారా జరిగే కార్యకలాపాలు ఇలా..**

పశువుల పెంపకం క్షీర సేకరణ, రవాణా, విక్రయం

పాల పరీక్షలు (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ వంటి చేయడం)

మహిళలకు శిక్షణ కార్యక్రమాలు జరపడం అవగాహన కల్పిస్తున్నాం: జి.శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారి  పాలు సేకరించి డెయిరీలకు విక్రయించడంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 30 వరకు ఈ సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికి నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రక్రియ పూర్తిచేస్తాం.

## జన ఔషధిని మింగేస్తున్నారు

ఆదోని : ఉమ్మడి జిల్లాలో జన ఔషధి కేంద్రాలను మందులోళ్లు మింగేస్తున్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పనతో పాటు రోగులకు చౌకగా, మన్నికగా ఔషధాలు అందించాలనే సంకల్పంతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన కింద వీటిని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఓ వైపు ప్రచారలేమి, పెద్ద కంపెనీల ఆధిపత్యం పెరగడం, వైద్యులు ప్రోత్సహించకపోవడం.. తదితర కారణాల వల్ల కేంద్రాల లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి.

**జ్వరం నుంచి క్యాన్సర్ వరకు**

ఉమ్మడి జిల్లాలో జన ఔషధి కేంద్రాల సంఖ్య కేవలం 30. ఇదే ప్రైవేటు ఔషధి కేంద్రాలు 3-4 వేలు ఉంటాయి. జన ఔషధి కేంద్రాల్లో సుమారు వెయ్యికి పైగా ఔషధాలు, 200లకు పైగా శస్త్రచికిత్స (సర్జరీ) సామగ్రి అందుబాటులో ఉంచాలి. 50 నుంచి 90 శాతం రాయితీతో అందించాలి. జ్వరం మొదలు కీళ్ల నొప్పుల నుంచి క్యాన్సర్ వరకు పలు రకాలు మందులు అందుబాటులో ఉంటాయి.

**ఏర్పాటుకు ముందుకురాని యువత**

నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు పడటం లేదు. గతంలో కేవలం బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ చేసిన వారికే అనుమతులిచ్చేవారు. ప్రస్తుతం నిబంధనలు సడలించి పొదుపు సంఘాలకూ అవకాశం కల్పించింది. వీరితోపాటు నిరుద్యోగ యువత, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, విశ్రాంత సైనికులు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకు రుణ సదుపాయం, రాయితీ ఇస్తారు. వ్యాపారం అనుకూలంగా లేకపోవడంతో యువత ముందుకురావడం లేదు.

**వారు రాసిందే మందు**

బడా మందుల కంపెనీలు మాఫియాగా మారి జన ఔషధ కేంద్రాలకు ఆదరణ లేకుండా చేస్తున్నారు. బ్రాండెడ్ ఔషధాలతో పోలిస్తే.. జనరిక్ మందులకు ఆదరణ దక్కడం లేదు. రెండింటిలో ఒకే రకమైన ఔషధ లక్షణాలున్నా.. అధిక ధరల్లో లభించే మందులే మేలైనవని, తక్కువ ధరకు లభించే ఔషధం పనిచేయదనే భావన ప్రజల్లో ఉంటోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వైద్యులూ జనరిక్ మందులను సిఫార్సు చేయడం లేదు. బ్రాండెడ్ వాటినే రాస్తున్నారు. ఆయా ఔషధి కంపెనీలు అందించే రాయితీలు, ఆఫర్లు, బహుమతులు వంటి వాటికి ఆకర్షితులవుతున్నారు.

## పేరుకు ప్రాంతీయ ఆసుపత్రి

చీపురుపల్లి : పట్టణానికి చెందిన ఓ గర్భిణిని ప్రసవానికి ప్రాంతీయాసుపత్రికి తీసుకురాగా.. వైద్యులు వెంటనే 30 కి.మీ దూరంలో ఉన్న విజయనగరం ఘోషా ఆసుపత్రికి రిఫర్ చేసేశారు. అక్కడకు వెళ్లిన రెండు నిమిషాల్లోనే ఆమెకు సాధారణ ప్రసవం జరిగింది. గుర్ల మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శ్వాస సంబంధ సమస్యతో ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదించగా.. వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపారు. చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో వైద్యం గగనమవుతోంది. రోజుకు కనీసం 300 మందికి పైగా ఓపీ, ఐపీ సేవలకు వస్తున్నారు. ఎక్కువమందిని వైద్య సిబ్బంది విజయనగరం పంపేస్తున్నారు. రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినా ఇదే తీరు.

**100.. ఉన్నవి 30 పడకలే..**

గతంలో 30 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిని 2023 డిసెంబరు నుంచి వంద పడకల ప్రాంతీయాసుపత్రిగా ఉన్నతీకరించారు. అందుకు తగ్గ వైద్యులు, సిబ్బంది, భవనాలు, వసతులు, విభాగాలు, పరికరాలేవీ నేటికీ సమకూర్చలేదు. ప్రస్తుతానికి 30 మంచాలే ఉన్నాయి. మొత్తం 18 మంది వైద్యులున్నా సేవలు అంతంతే.

ప్రైవేటు ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులు

ఇక్కడ పనిచేసే కొందరు వైద్యులు ఉదయం 9 గంటలకు హాజరు వేసుకుని, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. చీపురుపల్లిలో ఒక ప్రైవేటు ఆసుపత్రి అంతా ప్రభుత్వ వైద్యులపైనే ఆధారపడి నడుస్తోందనేది పట్టణవాసుల ఆరోపణ.

**ప్రసవాలూ తగ్గుతున్నాయి..**

ఆసుపత్రిలో ప్రసవాలు, సీజర్లు తగ్గిపోతున్నాయి. 30 పడకల ఆసుపత్రిగా ఉన్నప్పుడు మొత్తం ముగ్గురు, నలుగురు వైద్యులతో ప్రతి నెలా 70 నుంచి 100 వరకు వరకు ప్రసవాలు, సీజర్లు జరిగేవి. ప్రస్తుతం ముగ్గురు గైనకాలజిస్టులు, ఇద్దరు మత్తు వైద్యులు, ఆరోగ్యశ్రీ అమల్లో ఉన్నా నెలకు 30 దాటి ప్రసవాలు జరగడం లేదు. ఎముకల విభాగానికి వైద్యుడున్నా పరికరాల్లేవని రోగులను పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు.

## పౌష్టికాహారంలో మాయాజాలం

అనంతపురం : శింగనమల ప్రాజెక్టులో గతేడాది జనవరి నుంచి 484 సంచుల్లో ఉండే 3,872 బాలామృతం చిన్నపొట్లాల సంఖ్య తేలలేదు. పొట్లాలు మాయం అయ్యాయా...ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదా అన్న దానిపై విచారణ సాగుతోంది. ఇది పర్యవేక్షణ లోపానికి నిదర్శనం.అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు ఇచ్చే కోడిగుడ్లు, పాలు, బాలసంజీవని కిట్లతోపాటు బియ్యం, కందిపప్పు, వంటనూనె, బాలామృతం... వంటి పౌష్టికాహార పంపిణీ లెక్కల్లో భారీ తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తేదారుల సరఫరా గణాంకాలు.. సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల పంపిణీ రికార్డులకు పొంతనే లేదు. కొన్ని చోట్ల ఇండెంట్లోనూ మతలబు ఉన్నట్లు తేలింది. జిల్లాలోని 11 ప్రాజెక్టు కార్యాలయాలు, ర్యాండమ్‌గా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల దస్త్రాలను ప్రత్యేక బృందం పరిశీలన చేస్తోంది. ఇప్పటికి శింగనమల, నార్పల, అనంత అర్బన్ ప్రాజెక్టుల్లో పరిశీలన ప్రక్రియ



పూర్తయింది.

**20 నెలల్లో..**గతేడాది జనవరి నుంచి 20 నెలల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన అన్ని రకాల పౌష్టికాహార గణాంకాలను పరిశీలిస్తున్నారు. గత వైకాపా హయాంలోనే ఎక్కువ లెక్కలు తారుమారైనట్లు తెలుస్తోంది. గుత్తేదారులు తక్కువ సరఫరా చేసినా.. కేంద్రాల్లో ఎక్కువ నమోదు చేయడం, సూపర్‌వైజర్ల లెక్కల్లోనూ అదే రీతిలో తేడాలు వెలుగుచూ శాయి. బీకే సముద్రం, శింగనమల మండలాల్లో బాలామృతానికి సంబంధించి వ్యత్యాసం ఉన్నట్లు వెలుగుచూసింది. నార్పల ప్రాజెక్టు పరిధిలోని పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లోనూ కొన్ని బాగోతాలు ఉన్నట్లు సమాచారం.

**పరిశీలన చేస్తున్నాం..నాగమణి, పీడీ, ఐసీడీఎస్**

కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులతోపాటు సూపర్‌వైజర్లు, సీడీపీఓల రిజిస్టర్లను ర్యాండమ్‌గా పరిశీలన చేస్తున్నాం. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరిగాయో చూస్తున్నాం. అన్ని ప్రాజెక్టులు పూర్తిగానే ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

## కుప్పంలో పట్టాలెక్కిన ప్రగతి!

కుప్పం : ఐదేళ్లలో వైకాపా పాలనలో కుప్పం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పేరుకు క్రీడా మైదానం ఉన్నా ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో క్రీడాకారులు నానా అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కుప్పం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అసంపూర్తి అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేయడంతో అవి పట్టాలెక్కాయి.

**రూ.3 కోట్లతో సుందరంగా శ్మశానవాటిక**

కుప్పంలో శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు 2017లో తెదేపా ప్రభుత్వం పనులు చేపట్టింది. రూర్బన్ పథకంలో భాగంగా రూ. 1.60 కోట్లతో అంత్యక్రియలకు వచ్చే వారి సౌకర్యార్థం సామాజిక భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఫలితంగా శ్మశాన భూమిలో పిచ్చిమొక్కలు పెరిగి ఆకతాయిలకు అడ్డాగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులకు రూ. 3 కోట్లు మంజూరు చేసింది.

**నిర్వహణపై నిర్లక్ష్యం చూపారు..**



కుప్పం పురపాలిక పరిధిలోని వడ్డిపల్లె వద్ద ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క క్రీడా మైదానం అభివృద్ధిని వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కుప్పం ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ. 22 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మైదానంలోని భారీ బండ రాళ్లను యంత్రాలతో తొలగించి చదును చేస్తున్నారు.

**నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తాం: వికాస్ మర్మత్, పీడీ, కడా**

అభివృద్ధిలో కుప్పాన్ని ఆదర్శంగా నిలిపేందుకు శరవేగంగా పనులు చేపడుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్వర్ణ కుప్పం విజన్ దిశగా పనులు చేస్తున్నాం. నిర్దేశించిన లక్ష్యంలోగా పనులు పూర్తి చేస్తాం.

## కూల్చిన చోటే పాగా వేసి..

రేణిగుంట : వైకాపా హయాంలో వాగు పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు కూల్చిన అధికారులు.. కూటమి ప్రభుత్వం అక్కడే.. అదే చోటా నాయకుడు భారీ నిర్మాణాలు చేపడుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు. తన జోలికి వస్తే ఉపేక్షించబోనని సదరు వ్యక్తి భయపెడుతుండటంతో యంత్రాగం ఆ వైపు చూడటం లేదని సమాచారం. ఈ దందాకు రేణిగుంట మండలం వేదికైంది. మండలంలోని కొత్తపాళెం లెక్కదాఖల సర్వే నంబరు 3లో 1.77 ఎకరాల్లో వాగు పొరంబోకు భూమి ఉంది. అక్కడ ఇప్పటికీ నీరు పారుతోంది. ఇది నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి ఆనుకుని ఉంది. ఇంత విలువైన భూమిలో ఈ చోటా నేత సిమెంటు రాళ్ల తయారీ పరిశ్రమ నిర్మించారు. పక్కనే ఉన్న వాగు భూమిని సైతం తను ఆక్రమించి షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు.

**అప్పట్లో ఏం జరిగిందంటే..**

వైకాపా హయాంలోనూ ఇతను నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు వాటిని అసంపూర్తిగా కూల్చివేశారు. ఈ క్రమంలో అదే స్థలంలో భారీగా షెడ్డు వేసి గదులు నిర్మించి గేటు కూడా ఏర్పాటు చేశారు. తన వెనుక కీలక ప్రజాప్రతినిధులున్నారని, తన జోలికి వస్తే అంతే సంగతులంటూ యంత్రాంగాన్ని సైతం హెచ్చరిస్తున్నట్లు సమాచారం. **కూల్చివేయిస్తాం..** ఇక్కడ నిర్మాణాలు పరిశీలించాలని సిబ్బందిని పంపిస్తా. రెండు రోజుల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేయిస్తా. చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, రేణిగుంట

# కోనేరులో ముక్తి మునక ఏనాటికో?



కదిరి : శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ, అందుకు అనుగుణంగా ఆదాయమూ పెరుగుతోంది. వసతుల కల్పనలో మాత్రం వేగం పెరగడం లేదు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు కోనేరులో ముక్తి మునకకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. 2019 ఆఖరున మొదలైన ఆధునీకీకరణ పనులతో కోనేరును సిమెంటు తొట్టిలా మార్చారన్న విమర్శలు ఉన్నాయి. రెండు విడతల పనులకు రూ.6 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించారు. ఆరేళ్ల కిందటే పనులు మొదలయ్యాయి. పునాదులు తీసి, అడుగు భాగంలో సిమెంటు వేసి, చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఇక అంతటితో ఆగిపోయాయి. ఏడాదిన్నర గడుస్తున్నా పనులు మొదలవ్వలేదు.

**ఆధ్యాత్మికత ఉట్టిపడేలా డిజైన్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కోనేరు నిర్మాణానికి డిజైన్ రూపకల్పనకు ఉపక్రమించారు. దీన్ని ఏజెన్సీ ద్వారా చేయిస్తున్నారు. అయితే సకాలంలో ప్రణాళిక తయారీలో జాప్యం జరుగుతోంది. ఈ విషయంపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులతో సమీక్షించారు. అయినా డిజైన్ సిద్ధం చేయటంలో ఆలస్యం అవుతోంది. **పాత ధరలతో పని కాదంటున్న గుత్తేదారు**

కోనేరు పనులు ఆగి ఏడాదికిపైగా అయింది. దీంతో టెండరు వేసినప్పటి ధరలకు, ప్రస్తుతానికి వ్యత్యాసం ఎక్కువ ఉంది. పాత ధరలకే పనులు పూర్తి చేయడం కష్టమని గుత్తేదారు, దేవాదాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయి సుమారు రూ.5 కోట్ల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుత నిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా అంచనాలు తయారు చేయాలి. ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అందుకు పనుల మార్పుతో రూపొందించే డిజైన్ సిద్ధం చేయాల్సి ఉంది. ఇదంతా జరగాలంటే సమయం పట్టేలా ఉంది. దీంతో కోనేటి కథ మళ్లీ మొదటికొచ్చింది. కోనేరు ప్రహరీ నిర్మాణం కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఎలాంటి రక్షణ లేదు.

**బ్రహ్మోత్సవాలకు ముందే పూర్తి చేస్తాం** శ్రీనివాసరెడ్డి, ఈవో

కోనేరు పనుల్లో జాప్యమైంది. కొత్తగా రూపొందిస్తున్న డిజైన్ రావాల్సి ఉంది. గుత్తేదారుకు సామగ్రి ధరలు పెంచి ఇవ్వటానికి సమస్య లేదు. ప్రహరీ చుట్టూ మట్టి నింపటం, సుందరీకరణ వంటి 20 శాతం పనులు మిగిలాయి. బ్రహ్మోత్సవాలకు ముందే కోనేరును అందుబాటులోకి తెస్తాం.

# తాగునీటి కుళాయిల్లో అవినీతి ధార



అనంతపురం : అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. నిర్మాణ సమయంలోనే నిబంధనలు అతిక్రమించిన భవనాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వరు. తాగునీటి విభాగానికి చెందిన సిబ్బందితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని అనధికారికంగా తాగునీటి కనెక్షన్లు తీసుకుంటారు. పట్టణ ప్రణాళికకు సంబంధించిన అన్ని రుసుములు చెల్లించిన తర్వాత స్వాధీనం చేస్తున్నట్లు అధికారికంగా ఉత్తర్వులు ఇస్తారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన హోటళ్లు, బహుళ అంతస్తులు, ప్రైవేటు కళాశాలలు, కళ్యాణ మండపాలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలకు మూడు రెట్లు అధికంగా కుళాయి పన్నులు వసూళ్లు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ లేకపోవడంతో తాగునీరు కుళాయి పన్నుల వసూళ్లలో కొత్త దందా వెలుగులోకి వచ్చింది. చేతితో రాసి ఇచ్చే బిల్లు కావడంతో అక్రమార్కులకు పంట పండుతోంది. పన్ను తగ్గించినందుకు మాకేం ఇస్తావంటూ వసూళ్లకు తెర తీశారు. మళ్లీ బీపీఎస్ వచ్చే వరకు కుళాయి పన్నులు మూడు రెట్లు చెల్లించాలి. పన్ను తగ్గిస్తామంటూ అటు నగరపాలకకు ఆదాయానికి గండి కొడుతూ తగ్గించినందుకు మీకింత మాకింత అంటూ భవన యజమానులతో అందినకాడికి గుంజుతున్నారు.

**బిల్లు రూ.లక్షల్లో బేరం!**

గుత్తిరోడ్డులో ఉన్న ఓ వ్యాపార సముదాయం వద్దకు తాగునీటి విభాగంలో పని చేస్తున్న ఇద్దరు పొరుగుసేవల ఉద్యోగులు రూ.8.50 లక్షలు కుళాయి పన్నుకు సంబంధించిన బిల్లు ఇచ్చారు. మూడు రెట్లు పన్ను వేశామని ఇది బీపీఎస్ వచ్చే వరకు కట్టాల్సి ఉంటుందని చెప్పడంతో సదరు యజమాని బెంబేలెత్తాడు. తగ్గించే మార్గం చూపాలని కోరడంతో మాకు ఇవ్వాల్సింది ఇస్తే సార్‌తో మాట్లాడి రూ.2.50 లక్షలకు బిల్లు వచ్చే విధంగా ఇస్తామంటూ నమ్మపలికారు. బిల్లులో కనీసం ఒక్క అధికారి సంతకం లేకుండా ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. వ్యాపార సముదాయాల నుంచి సంవత్సరానికి రూ.1.10 కోట్లు పన్నులు వసూళ్లు కావాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో సొమ్ముకు లెక్కల్లేకుండా బిల్లులు ఇస్తుంటే ఎవరికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలోని అరవింద్‌నగర్, హౌసింగ్ బోర్డు, రాంనగర్, శారదానగర్, శ్రీనగర్‌కాలనీ, కమలానగర్, గుత్తిరోడ్డు, సుభాష్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో మూడు రెట్లు కుళాయి పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపార సముదాయాలు ఉండటంతో కాసుల పంట పండుతోంది.

**అనంత నగరపరిధిలో**

నివాసాల కుళాయి కనెక్షన్లు : 37,000

వ్యాపార కనెక్షన్లు : 541

అక్రమంగా... : 9,000

బకాయిలు : రూ.18 కోట్లు

మూడు రెట్లు పన్ను పరిధి వచ్చేవి : 150

# 'పురం'.. ఆదాయానికి ఆమడ దూరం



హిందూపురం : పాలకులకు అవగాహన ఉండదు.. మున్సిపల్ అధికారులకు ముందుచూపు ఉండదు... కన్సెల్‌టెంట్లకు కనీస ఆలోచన లేక పోవడంతో అందరూ కలిసి హిందూపురం మున్సిపాలిటీని నిండా ముంచేశారు. మున్సిపాలిటీకి పట్టణ నడిబొడ్డున ఉన్న రూ. కోట్ల విలువైన భూములను సద్వినియోగం చేసుకొని, సంపద సృష్టించాల్సింది పోయి, ఉన్న అరకొర నిధులను వాటిపై ఖర్చు పెట్టి వృథా చేశారు. ఇదీ హిందూపురంలో నూతన మార్కెట్, లేపాక్షి రోడ్‌లో మినీ మార్కెట్ల పరిస్థితి.

**రూ.30 కోట్లు ఖర్చు పెట్టి.. ఆరున్నరేళ్లుగా వదిలేసి...**

పట్టణ నడిబొడ్డున రూ.100 కోట్ల విలువైన మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆరేళ్ల కిందట రూ.30 కోట్లు వెచ్చించి మార్కెట్‌ను నిర్మించారు. ఇందులో 321 గదులు ఉన్నాయి. గది కనీస అద్దె రూ. 8వేలు. ఎస్సీ, ఎస్టీలకు నామమాత్రపు అద్దెకు కేటాయించిన గదులను తీసివేసినా, అన్ని గదులను అద్దెకు ఇచ్చి ఉంటే నెలకు కనీసం రూ.25 లక్షలు ఆదాయం వస్తుంది. మార్కెట్‌ను సరైన ప్రణాళికతో నిర్మించక పోవడం, చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించకపోవడం, తోపుడు బండ్లను మార్కెట్‌కు దూరంగా ఉంచకపోవడం తదితర కారణాలతో మార్కెట్‌లో గదులను అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వచ్చిన వారు సైతం వ్యాపారాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయి వదిలేశారు.

**18 ఏళ్లుగా ఖాళీగా ..**

డీబీ కాలనీలో లేపాక్షికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన 18 ఏళ్ల క్రితం 2007లో రూ.50 లక్షలు వెచ్చించి 37 గదులతో మినీ మార్కెట్‌ను నిర్మించారు. గదులను బయట వైపుకు కాకుండా లోపలి వైపు ఉండేలా డిజైన్ చేసి కట్టడంతో వాటిని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో చివరకు అద్దెను గదికి రూ.6 వేలు నుంచి రూ.3 వేలకు తగ్గించారు. ఇప్పటికి 20 సార్లు వేలం పాటలు నిర్వహించినా ఒక్క గదిని అద్దెకు ఇవ్వలేకపోయారు. నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందనుకొంటే, పైసా రాలేదు. ఇప్పటి దాక అద్దె ఆదాయం రూ.2 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.

**చర్యలు తీసుకొంటున్నాం**

మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

పట్టణంలోని మార్కెట్లు ఖాళీగా ఉన్న మాట నిజమే. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి చర్యలు చేపట్టాం. పెద్ద మార్కెట్ చుట్టూ ఇటీవల అక్రమణలను తొలగించాం. నాలుగు వైపులా రహదారులు ఏర్పాటు చేస్తాం. మినీ మార్కెట్‌ను పరిశీలించి, తగు ప్రణాళిక సిద్ధం చేస్తాం.

## తిరుపతి రైతుబజార్‌కు కొత్త కళ

తిరుపతి : వివాదాలకు నిలయంగా ఉన్న తిరుపతి రైతుబజార్‌లో ప్రక్షాళన ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక్కో రైతుబజార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు యత్నాలు ప్రారంభించడంతో పాటు ఇప్పటికే సేవలందిస్తున్న రైతుబజార్లలోని సమస్యల పరిష్కారంపై దృష్టిసారించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోనే అధిక ఆదాయం కలిగిన తిరుపతి రైతుబజార్‌ను మరింతగా విస్తృతం చేయాలని నిర్ణయించారు. స్థానిక రైతుబజార్‌లో ప్రస్తుతం వంద దుకాణాలు అండగా.. వాటిని రైతులు, డ్వాక్రా సంఘాలకు నెలవారీ అద్దె ప్రాతిపదికన కేటాయించారు.ప్రధాన ద్వారం వద్ద అక్రమ దుకాణాలు, లోనికి ప్రవేశించగానే దుకాణాలను వదిలి బయట దారుల నిండా సరకులతో నింపేసేవారు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగునీరు, అపరిశుభ్రత, అడుగుపెట్టలేని విధంగా ఉన్న మరుగుదొడ్లతో గందరగోళంగా ఉండేది. దీనికితోడు వ్యాపారులు చెప్పిందే ధర అన్నట్లు సాగేది.



**మెరుగైన వాతావరణం**

రైతుబజార్‌లో ప్రస్తుతం పరిస్థితి మారింది. ఆవరణలో గుట్టలుగా ఉన్న వ్యర్థాలను తొలగించి, దుకాణాల పైకప్పులపై ఉన్న ఆకులు, ఇతర వ్యర్థాలను తరలించారు. రోడ్డుపైకి విస్తరించిన దుకాణాలను వారికి కేటాయించిన స్థలాలకే పరిమితం చేయాలని ఆదేశించారు. వ్యాపారులతో మాట్లాడి రైతుబజార్ నిబంధనలను వివరించారు. ప్రధానద్వారం వద్ద ఉన్న అనధికారిక వ్యాపారుల కట్టడికి చర్యలు చేపట్టారు. మరుగుదొడ్లు, శుద్ధి చేసిన నీటిని అందుబాటులోకి తెచ్చారు. ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. వినియోగదారుల్ని మోసగించినట్లు ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

**ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం: అనిల్‌కుమార్, ఎస్టేట్ అధికారి**

తిరుపతి రైతుబజార్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, రైతు బజార్ నియమనిబంధనలు కచ్చితంగా అమలు చేస్తాం. వినియోగదారులకు అండగా నిలిచి వారి సహకారంతో వ్యాపారులు ఆర్థికంగా లాభపడేలా చేస్తాం. శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. అనధికార వ్యాపారుల్ని లేకుండా చూస్తాం.

## 'సంచి మార్చి' ముంచేస్తున్నారు!

అనకాపల్లి : ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యాపారులపై సరైన నిఘా లేకపోవడం అన్నదాతల పాలిట శాపంగా మారింది. ఖరీఫ్ పనులు ఒక్కసారిగా జోరందుకోవడంతో రైతుల అవకాశాన్ని, ఆరాటాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతవరకు ఎరువులు అధిక ధరలకు అమ్మకం చేయడం, తూకంలో తేడాలు చేయడం వంటి పనులే చేసేవారు. ఇప్పుడు ఏకంగా కల్తీ ఎరువుల విక్రయానికి తెరలేపారు.

జిల్లాలో 92 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతోపాటు 175 మంది ప్రైవేటు డీలర్లు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు విక్రయిస్తున్నారు. జిల్లాలో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నంలో ఎరువుల అమ్మకాలు ఎక్కువగా సాగుతుంటాయి. సీజన్‌లో తరచూ యూరియా ఎరువులకు కొరత ఏర్పడుతోంది. ఈసారి అదే పరిస్థితి ఏర్పడింది. తుపాను కారణంగా జిల్లా అంతటా భారీ వర్షాలు పడ్డాయి. దీంతో రైతులంతా ఒకేసారి వరి నాట్లు వేయడం ప్రారంభించారు. దమ్ములోనే రైతులు యూరియా, డీఏపీ ఎరువులు వేస్తుంటారు. దీంతో ఎరువులకు డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు బస్తాకు రూ. 30 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకొంతమంది బస్తాలో రెండు, మూడు కేజీలు తస్కరించి తక్కువ పరిమాణంలో విక్రయిస్తున్నారు. ఇప్పుడు చోడవరంలో ఓ వ్యాపారి ప్రముఖ కంపెనీ పేరుతో సృచిలు తయారుచేయించి దానిలో వేరే ఎరువు నింపి అమ్మకాలు చేస్తూ విజిలెన్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు.

**తేడాలుంటే సహించం**

దీనిపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావును వివరణ కోరగా ఎరువులు అధిక ధరలకు అమ్మినా, తూకంలో తేడాలున్నా చర్యలు తప్పవన్నారు. దుకాణాలను తరచూ తనిఖీ చేస్తుంటామన్నారు. వచ్చినా చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఇప్పటికే యూరియా 2,256 టన్నులు, డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువులు 1,491 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. మరో 661 టన్నులు యూరియా, వంద టన్నులు డీఏపీ జిల్లాకు వస్తున్నాయని తెలిపారు.




చోడవరంలో నకిలీ ఎరువులు విక్రయిస్తున్న వ్యవహారం విజిలెన్సు దాడుల్లో వెలుగుచూసింది. స్థానిక లక్ష్మమ్మ కోవెల సమీపంలో శ్రీ లక్ష్మీదేవి ఫెర్టిలెజర్స్ అండ్ పెస్టిసైడ్స్ పేరిట సింహాద్రిపురానికి చెందిన పెన్నాడ శ్రీనివాసరావు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఎరువుల వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఎరువుల దుకాణంతో పాటు లైసెన్సు పొందిన రెండు గోదాములు ఉన్నాయి. అనధికారికంగా మరో గోదాంను నిర్వహిస్తున్నారు. తక్కువ ధరకు లభించే ఎరువును డీఏపీ, గ్రోమోర్ సంచుల్లో నింపి బస్తాకు అదనంగా రూ. 450 నుంచి రూ.550 దండుకుంటున్నారు. స్పిక్ ప్రోమ్ బస్తా ధర రూ. 800 కాగా దీన్ని రూ.1350లకు విక్రయించే డీఏపీ సంచిలో నింపి అమ్ముతున్నారు. రూ. 1300కు లభ్యమయ్యే 20.20.013 రకం ఎరువును, రూ. 1750లకు దొరికే 28.28.0 (గ్రోమోర్) సంచుల్లోకి మార్చి అన్నదాతలకు విక్రయిస్తున్నారు. అచ్చం అసలైనవాటిని పోలి ఉండే నకిలీ సంచులను తుని నుంచి కొనుగోలు చేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వ్యవసాయాధికారిణి పావని ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావు, అతని కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు తెలిపారు.

## నాగిని ఫోజులతో కసిగా కవ్విస్తున్న ఫరియా అబ్దుల్లా..

ఫరియా అబ్దుల్లా.. ఆరడుగుల బుల్లెట్ అంటే హీరోలే గుర్తొస్తారు. కానీ హీరోయిన్ లలోనూ ఆరడుగుల బుల్లెట్ ఉంటారని ఫరియా అబ్దుల్లాని చూస్తే అర్థమవుతుంది. ఎందుకంటే ఫరియా అబ్దుల్లా తన హైట్ తో ఎంతోమందిని ఆకట్టుకుంది.. ప్రభాస్ లాంటి కటౌట్, హైట్ తో ఉండే ఫరియా అబ్దుల్లా తన రియల్ నేమ్ కంటే ఎక్కువగా చిట్టి అనే పేరుతోనే ఫేమస్ అయింది. అనుదీప్ డైరెక్షన్లో వచ్చిన 'జాతి రత్నాలు' మూవీలో నవీన్ పోలిశెట్టి ఫరియా అబ్దుల్లా లు నటించారు. ఈ సినిమాలో చిట్టి అనే పాత్రతో ఫరియా అబ్దుల్లా చాలా ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత రావణాసుర, ఆ ఒక్కటి అడక్కు సినిమాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ బంగార్రాజు మూవీలో స్పెషల్ సాంగ్ కూడా చేసింది. అంతేకాకుండా మత్తు వదలరా-2 సినిమాతో పాటు ప్రభాస్ నటించిన కల్కి 2898 AD మూవీలో స్పెషల్ సాంగ్ లో కనిపించింది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఎద అందాలతో కుర్రకారుకు పిచ్చెక్కిస్తోంది. తాజాగా కొబ్బరి చెట్టు చాటున ఉన్న ఫోటోలను షేర్ చేసుకున్న ఈ ముద్దుగుమ్మ ఆ ఫోటోలలో చాలా హాట్ గా యూత్ కి చెమటలు పట్టించేలా తన ఎద అందాలను



హైలెట్ చేసింది.. గ్రీన్ కలర్ మినీ స్కర్ట్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది. కొబ్బరి చెట్టు వెనుక ఉన్న కొన్ని హాట్ ఫొటోస్ ని కూడా షేర్ చేసింది. అందులో ఫరియా అబ్దుల్లా ఎద అందాలతో పాటు థైస్ అందాలు కూడా హైలెట్ గా నిలిచాయి. ఈ గ్రీన్ కలర్ మినీ స్కర్ట్ లో ఉన్న ఫోటోలను షేర్ చేయడమే కాకుండా కింద క్యాప్షన్ గా "గురువారం రోజు మీకు కొన్ని నాగిని వైబ్స్ పంపిస్తున్నాను" అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇంస్టాగ్రామ్ లో వైరల్ గా మారడంతో చిట్టి భలే క్యూట్ గా ఉందే అంటూ కామెంట్లు పెడుతున్నారు ఈ ఫొటోస్ చూసిన ఆమె అభిమానులు.. ఫరియా అబ్దుల్లా గురించి చూసుకుంటే.. హీరోయిన్ కాకపోతే నేను కొరియోగ్రాఫర్ ని అయ్యేదాన్ని అని పలు ఇంటర్వ్యూలలో చెప్పుకొచ్చింది. అలా తనకి హీరోయిన్ అవ్వడం కంటే కొరియోగ్రాఫర్ అవ్వడం ఇష్టమని,ఒకవేళ లేడీ కొరియోగ్రాఫర్ గా అవకాశం వస్తే రామ్ చరణ్, అల్లు అర్జున్ వంటి దిగ్గజ హీరోల సినిమాలకు కొరియోగ్రఫీ చేస్తాను అంటూ చెప్పుకొచ్చింది. అంతేకాకుండా పలు డాన్స్ షోలకు జడ్జిగా కూడా చేస్తోంది. అలాగే షాప్ ఓపెనింగ్ లు, ఈవెంట్లు చేస్తూ రెండు చేతులా సంపాదిస్తుంది. ఇక ఫరియా అబ్దుల్లా సినిమాల విషయానికి వస్తే.. ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం తమిళంలో సుసింథిరన్ దర్శకత్వం వహిస్తున్న వల్లి మయిల్ అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో విజయ్ ఆంటోనీ, ఫరియా అబ్దుల్లా, సత్యరాజ్ లు కీలకపాత్రల్లో నటిస్తున్నారు..

## ఆగిన దగ్గరే మొదలెట్టనున్న మనోజ్?

టాలీవుడ్ నటుల్లో ఒకరైన మంచు మనోజ్ యాక్టింగ్ గురించి అందరికీ తెలుసు. అయితే ఎంత మంచి యాక్టర్లకైనా ఒక్కోసారి బ్యాడ్ ఫేజ్ ఉంటుంది. అలాంటప్పుడు వారేం చేసినా కలిసిరాదు. మొన్నటివరకు మంచు మనోజ్ కూడా దాదాపు అలాంటి పరిస్థితుల్లోనే ఉన్నారు. కానీ మిరాయ్ సినిమా మనోజ్ కెరీర్ ను ఒక్కసారిగా మార్చేసింది. తేజ సజ్జా ప్రధాన పాత్రలో వచ్చిన మిరాయ్ లో మనోజ్ కీలక పాత్ర చేయగా, ఆ క్యారెక్టర్ కు ఆడియన్స్ నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది.

**మిరాయ్‌తో కంబ్యాక్ ఇచ్చిన మనోజ్...** కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన మిరాయ్ సినిమా సెప్టెంబర్ 12న రిలీజ్ కాగా, ఫస్ట్ షో నుంచే ఆ సినిమాకు మంచి టాక్ వచ్చింది. మిరాయ్ సినిమాతో మనోజ్ మంచి కంబ్యాక్ అందుకున్నారు. సినిమాలో మనోజ్ యాక్టింగ్, స్క్రీన్ ప్రెజెన్స్ కు ఆడియన్స్ నుంచి మంచి ప్రశంసలొస్తున్నాయి. గత కొన్నేళ్లుగా మనోజ్ రెండు మూడు సినిమాలను అనౌన్స్ చేశారు.



**రెమ్యూనరేషన్ ను పెంచేసిన మనోజ్**... సినిమాలైతే అనౌన్స్ చేశారు కానీ అందులో ఏవీ ఇప్పటివరకు పూర్తైంది లేదు. మిరాయ్ సక్సెస్ తర్వాత మనోజ్ కెరీర్ పరంగా చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. ఎలాంటి తొందర పడకుండా గతంలో ఉన్న సినిమాలను పూర్తి చేస్తూ, కొత్త ప్రాజెక్టులను ఒకప్పుకోవాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మనోజ్ తన రెమ్యూనరేషన్ ను కూడా పెంచారని తెలుస్తోంది.

**వరుస ప్రాజెక్టులతో బిజీ బిజీ...** నిర్మాతలు కూడా మిరాయ్ లో మనోజ్ క్యారెక్టర్ చూసి అతనిపై ఇన్వెస్ట్ చేయడానికి రెడీ అవుతున్నారు. గతంలో అహం బ్రహ్మాస్మి సినిమాను గ్రాండ్ గా స్టార్ట్ చేసిన మనోజ్, ఇప్పుడా సినిమాను తిరిగి మొదలుపెట్టాలని చూస్తున్నారట. ప్రీ పొడక్షన్ లో ఉన్న వాట్ ది ఫిష్ సినిమా కోసం డిస్కషన్స్ జరుపుతున్న మనోజ్, కొత్త డైరెక్టర్ తో డేవిడ్ రెడ్డి అనే సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. మిరాయ్ లో బ్లాక్ స్వార్డ్ పాత్రలో మనోజ్ యాక్టింగ్ కు మంచి అప్లాజ్ వచ్చాక, కేవలం హీరోగానే కాకుండా ఛాలెంజింగ్ రోల్స్ చేయడానికి కూడా మనోజ్ ఇంట్రెస్టింగ్ గా ఉన్నారని అంటున్నారు. ఇవన్నీ చూస్తుంటే రాబోయే రోజుల్లో మనోజ్ వరుస ప్రాజెక్టులతో బిజీ అవడం ఖాయమనే అనిపిస్తుంది. త్వరలోనే మనోజ్ చేయబోయే తర్వాతి ప్రాజెక్టులకు సంబంధించిన అప్డేట్స్ రానున్నాయి.




## 2025 బిగ్గెస్ట్ డిజాస్టర్.. బెడిసి కొట్టిన సీక్వెల్ ప్లాన్



ఇటీవలి కాలంలో బ్లాక్ బస్టర్ సినిమాలకు సీక్వెల్స్ తెరకెక్కించానే అత్యుత్సాహం ఫిలింమేకర్స్ లో కనిపిస్తోంది. కానీ అన్నిసార్లు పప్పులు ఉడకవు అని నిరూపణ అవుతోంది. బాహుబలి సీక్వెల్, కేజీఎఫ్ సీక్వెల్, పుష్ప సీక్వెల్ ఇవన్నీ సంచలనాల విజయాల్ని సాధించడంతో, ఇతర హిట్ సినిమాలకు సీక్వెల్స్ తెరకెక్కించడం ద్వారా ప్రజల్లో ఉన్న క్రేజ్ ను ఎన్ క్యాష్ చేయాలనే ఆలోచన చేస్తున్నారు. కానీ చాలా సార్లు ఇలాంటి ప్రయత్నాలు బూమరాంగ్ గా మారుతున్నాయి. కొన్నిటికి టైమింగ్ చాలా ముఖ్యం. కొన్నేళ్ల క్రితం వచ్చిన సినిమాకి సీక్వెల్ సినిమా తీస్తే, నాటి క్రేజ్ ఇప్పుడు ఉండకపోవచ్చు. పైగా మొదటి భాగంలో కథ, కంటెంట్ ని కనెక్ట్ చేసినట్టు, ఇప్పుడు సీక్వెల్ సినిమాలో కనెక్ట్ చేయలేకపోతే అది బూమరాంగ్ గా మారుతుంది. అలాంటి ఒక ఫెయిల్యూర్ ఎపిసోడ్ బాలీవుడ్ అగ్ర హీరో అజయ్ దేవగన్ ని తీవ్రంగా నిరాశపరిచింది. అతడు నటించిన సన్ ఆఫ్ సర్ధార్ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద దారుణంగా విఫలమైంది. ఈ సినిమాని దాదాపు 150 కోట్ల బడ్జెట్ నిర్మించగా, కేవలం 60కోట్లు మాత్రమే ప్రపంచవ్యాప్తంగా వసూలు చేసింది. బయ్యర్లు సగానికి సగం నష్టపోవాల్సి వచ్చింది. పైగా అజయ్ దేవగన్ లాంటి పెద్ద హీరో నటించిన సినిమాకి 30కోట్ల లోపు తొలి వీకెండ్ (3 రోజుల్లో) వసూళ్లు దక్కడం ఆశ్చర్యపరిచింది. మొదటి నాలుగు రోజులు కేవలం 30 కోట్లు మాత్రమే వసూలు చేసింది. నాలుగో రోజు నుంచి పూర్తిగా చతికిలబడింది. ఈ సినిమా వీక్ స్టోరి, దర్శకత్వ వైఫల్యం కారణంగా ప్రజల్లో మౌత్ టాక్ బ్యాడ్ గా వచ్చింది. దీంతో నాలుగో రోజు నుంచే థియేటర్లు ఖాళీ అయిపోయాయని ట్రేడ్ నిరాశను వ్యక్తం చేసింది. ఇక క్రిటిక్స్ నుంచి ఈ సినిమాకి మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రంలో అజయ్ దేవగన్ తో పాటు రవి కిషన్, రోష్ని వాలియా, మృణాల్ ఠాకూర్, సంజయ్ మిశ్రా, విందు దారా సింగ్, దీపక్ డోబ్రియాల్, కుబ్రా సైత్, చుంకీ పాండే, పంజాబీ నటి నీరు బజ్వా, దివంగత ముకుల్ దేవ్ తదితరులు నటించారు. భారీ తారాగణం నటించినా కానీ ఈ చిత్రం ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచలేకపోయింది. ఈ ఏడాది పరిమిత బడ్జెట్ లో రూపొందించిన పలు చిత్రాలు భారీ బ్లాక్ బస్టర్ ని సాధించాయి. కానీ పెద్ద బడ్జెట్ తో రూపొందించిన సన్నాఫ్ సర్ధార్-2 లాంటి సినిమాలు డిజాస్టర్ అవ్వడం హాట్ టాపిక్ గా మారింది. ఇటీవలే టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ కేవలం మూడు నాలుగు రోజుల్లోనే 100 కోట్ల క్లబ్ లో చేరడం ఇతర హీరోలకు హెచ్చరికగా గుర్తుంచుకోవాలి. కంటెంట్ ఉంటే లాజిక్కులు వెతక్కుండా, ప్రజలు సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నారనడానికి ఇది ఉదాహరణగా నిలిచింది. అజయ్ దేవగన్ సహా పలువురు సీనియర్ స్టార్లు తమ పరాజయాల వెనక కారణాలను వెతికే ప్రయత్నంలో ఉన్నారు.

## నానాటికీ పెరుగుతున్న పొంగల్ పోటీ!



సినిమాలకు మంచి సీజన్ అంటే పండగ సీజనే. సంక్రాంతికి సెలవలుంటాయి కాబట్టి మామూలుగా అయితే ఒక టికెట్ తెగేది పండగ టైమ్ లో ఫ్యామిలీ మొత్తానికి టికెట్స్ తెగుతాయని చాలామంది దర్శకనిర్మాతలు తమ సినిమాలను పండగకు తీసుకురావాలని టార్గెట్ గా పెట్టుకుంటారు.

పండగ సీజన్ లో సినిమాకు మంచి టాక్ వస్తే ఇక ఆ సక్సెస్ ఏ రేంజ్ లో ఉంటుందో ఈ ఇయర్ రిలీజైన సంక్రాంతికి వస్తున్నాం సినిమా చూపించింది.

**మన శంకర వరప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు...** అందుకే ప్రతీ సంక్రాంతికి చాలా సినిమాలు పోటీ పడుతుంటాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది సంక్రాంతికి పలు సినిమాలు షెడ్యూల్ అయ్యాయి. చూస్తుంటే ఈసారి పోటీ కాస్త గట్టిగానే ఉండేట్టుంది. ఇప్పటికే సంక్రాంతికి కొన్ని సినిమాలు రానున్నట్టు ప్రకటించగా, మరికొన్ని సినిమాలు సంక్రాంతిపై కన్నేశాయి. అందులో అందరికంటే ముందే సంక్రాంతికి తమ సినిమా వస్తుందని చెప్పింది చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరూ చేస్తున్న మన శంకరవరప్రసాద్ గారు సంక్రాంతికి రిలీజ్ కానుంది.

**పోటీలో రాజా సాబ్, అఖండ2 కూడా..** మొన్నటివరకు తమ సినిమాను డిసెంబర్ 5న రిలీజ్ చేస్తామని చెప్పిన ది రాజా సాబ్ కూడా ఇప్పుడు పండగ బరిలోకే రానుంది. జనవరి 9న రాజా సాబ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇది కాకుండా బాలకృష్ణ అఖండ2 కూడా సంక్రాంతి పోటీకి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. రవితేజ- కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాను మేకర్స్ సంక్రాంతికే రిలీజ్ చేస్తామని అనౌన్స్‌మెంట్ రోజే చెప్పారు. నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు జనవరి 14న రిలీజ్ కానుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. వీటితో పాటూ ఇప్పుడు మరిన్ని సినిమాలు సంక్రాంతి వైపు చూస్తున్నాయని తెలుస్తోంది.

శర్వానంద్ నారీ నారీ నడుమ మురారితో పాటూ అల్లరి నరేష్ ఆల్కహాల్ కూడా అదే సీజన్ పై కన్నేశాయంటున్నారు. మరి వీటిలో చివరకు పండగ బరిలో ఏయే సినిమాలు నిలుస్తాయో? వాటిలో ఏ మూవీ పండగ విజేతగా నిలుస్తుందో చూడాలి.

## ఆర్యన్ ఖాన్ ప్రీమియర్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిన ఆలియా.. డ్రెస్ ప్రత్యేకతలివే!

బాలీవుడ్ బ్యూటీ అలియాభట్ ఓవైపు భార్యగా..తల్లిగా.. తన బాధ్యతలు కొనసాగిస్తూనే.. మరోవైపు నటిగా ఇండస్ట్రీలో రాణిస్తోంది. అయితే అలాంటి ఈ హీరోయిన్ తాజాగా షారుఖ్ ఖాన్ కొడుకు ఆర్యన్ ఖాన్ డైరెక్టర్ గా చేసిన తొలి వెబ్ సిరీస్ ప్రీమియర్ షో చూడడానికి వచ్చింది. అయితే ఈ ప్రీమియర్ షోలో అందరిలో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది అలియా భట్. దానికి కారణం ఆమె ధరించిన గూచి బ్రాండ్ కి సంబంధించిన స్పెషల్ డిజైన్ తో ఉన్న డ్రెస్.. మరి ఇంతకీ ఆ డ్రెస్ కి ఉన్న స్పెషాలిటీ ఏంటి.. ? దాని ధర ఎంత ?అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. బాలీవుడ్ కింగ్ ఖాన్ అయినటువంటి షారుఖ్ ఖాన్ తనయుడు మొదటిసారి 'ది బాలిలిలిడ్స్ ఆఫ్ బాలీవుడ్' అనే వెబ్ సిరీస్ తెరకెక్కించారు. అయితే ఈ వెబ్ సిరీస్ కి సంబంధించిన ప్రీమియర్ షో చూడడం కోసం చాలామంది బాలీవుడ్ సెలబ్రిటీలు తరలివచ్చారు. అయితే వీరందరిలో అలియా భట్ - రణబీర్ కపూర్ జంట చాలా స్పెషల్ గా నిలిచారు. దానికి కారణం అలియా భట్ వేసుకున్న డ్రెస్సే. అలియా భట్ తెలుపు రంగు డ్రెస్ లో దర్శనమిచ్చింది. 1996 నాటి గూచి కలెక్షన్ నుండి ఆర్కైవల్ టామ్ ఫోర్డ్ పీస్ ని ఈవెంట్ కోసం స్పెషల్ గా వేసుకుంది.. ఆర్కైవల్ వైట్ జెర్సీ డ్రెస్ లో G- బకిల్ బెల్ట్ పెట్టుకొని కనిపించింది.. అలాగే గూచి బాంబూ 1947 మినీ బ్యాగ్, టిఫనీ ఆభరణాలతో తన



అందాన్ని రెట్టింపు చేసుకుంది. అలాగే తన అందమైన జుట్టుని సొగసైన బన్ తో ముడి పెట్టింది. అలియా భట్ వేసుకున్న ఈ డ్రెస్ అందరిలో సెంటరాఫ్ అట్రాక్షన్ గా ఉండడంతో చాలామంది అలియా భట్ లుక్ పై ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా అలియా భట్ ఈ డ్రెస్ లో ఉన్న ఫోటోలను ఇంస్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేయడంతో చాలామంది సెలబ్రిటీలు కూడా లైక్ లు, పోస్టులు పెట్టారు. దీపిక పదుకొనే అద్భుతంగా ఉంది అంటూ కొనియాడింది. అలా అద్భుతమైన వైట్ కలర్ డ్రెస్ లో రణబీర్ తో కలిసి ఆలియా నడుచుకుంటూ వస్తూ ఉంటే చూడడానికి రెండు కళ్ళు చాలడం లేదని మరో నెటిజెన్ కామెంట్ పెట్టాడు.. అలా ఈ జంట ఫోటోగ్రాఫర్లకు ఫోజులిచ్చి ప్రీమియర్ షోలో అందరి దృష్టిని ఆకర్షించారు.. ఇకపోతే గూచి బ్రాండ్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ డ్రెస్ ఖరీదు సుమారుగా కొన్ని లక్షల్లో ఉంటుందని సమాచారం. అలియా భట్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఈ హీరోయిన్ నటించిన 'ఆల్ఫా' మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ మూవీ యష్ రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ లో 7వ భాగం డిసెంబర్ 25న విడుదలవుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.. ఇందులో అలియా భట్ ఒక కొత్త డైనమిక్ అవతారంలో కనిపించబోతున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా మాత్రమే కాకుండా సంజయ్ లీలా భన్సాలీ డైరెక్షన్లో 'లవ్ & వార్' లో కూడా నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ లు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

## తన ఫోటోలపై జాన్వీ కపూర్ సీరియస్ కౌంటర్

ఇప్పటికే సోషల్ మీడియాలో సెలబ్రిటీలను ట్రోల్ చేయడం, చిన్న దానికి కూడా తీవ్రంగా విమర్శిస్తూ కామెంట్స్ చేయడం, బూతులు తిట్టడం, ప్రతి విషయంలోనూ తప్పులు వెతకడం వంటివి చేస్తున్నారు. సోషల్ మీడియాలో వాటిని తట్టుకుని నిలబడలేక కొందరు ఇండస్ట్రీని వదిలి వెళ్తున్నారు లేదంటే సోషల్ మీడియా నుంచి బయటకు వచ్చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా వచ్చిన ఏఐ మొత్తం మార్చేస్తుంది. ఫోటోలు, వీడియోలను క్రియేట్ చేస్తూ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ సెలబ్రిటీలకు నెటిజన్స్ సరికొత్త సమస్యలను క్రియేట్ చేస్తున్నారు. ఒరిజినల్ కి ఏమాత్రం తగ్గకుండా చాలా నీట్‌గా సెలబ్రిటీల ఫోటోలను ఏఐ ద్వారా క్రియేట్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇప్పటికే డీప్ ఫేక్ అనేది సెలబ్రిటీలను ఎంతగా ఇబ్బందికి గురి చేస్తుందో తెలిసిందే. ఇప్పుడు ఏఐ ని ఉపయోగించి సెలబ్రిటీల రకరకాల ఫోటోలను క్రియేట్ చేస్తున్నారు.

**జాన్వీ కపూర్ ఏఐ ఫోటో వైరల్...** ఇటీవల జాన్వీ కపూర్ యొక్క ఏఐ ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమె ధరించని ఔట్ ఫిట్ ధరించినట్లు, ఆమె ఇవ్వని ఫోజ్ ఇచ్చినట్లుగా జాన్వీ కపూర్



ఫోటోను ఏఐ ద్వారా క్రియేట్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేయడం ద్వారా అంతా షాక్ అయ్యారు. నిజంగానే ఆ ఫోటో జాన్వీ కపూర్‌ది అనుకున్నారు. చివరకు జాన్వీ పీఆర్ టీం ఆ ఫోటోను డిలీట్ చేయించాల్సి వచ్చింది. తాజాగా జాన్వీ కపూర్ తన సన్నీ సంస్కారికి తులసి కుమారి సినిమా ట్రైలర్ లాంచ్ సందర్భంగా ఏఐ ఫోటో పై స్పందించింది. ఇలాంటి ఫోటోలు సెలబ్రిటీల జీవితాలను ప్రభావితం చేస్తాయి అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. వారి కెరీర్ పరంగానూ చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. అందుకే జాన్వీ కపూర్ ఇలాంటి ఏఐ మేకింగ్ ఫోటోలపై సీరియస్‌గా స్పందించింది. మళ్లీ ఇలాంటివి జరగకూడదు అంటూ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లుగా మాట్లాడింది.

**ఆ ఫోటోలపై జాన్వీ కపూర్ సీరియస్ రియాక్షన్...** జాన్వీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అలాంటి ఫోటోలను చూస్తారు, వారు నేను నిజంగానే అలాంటి డ్రెస్‌లను ధరించాను అనుకుంటారు, వారు నన్ను ఖచ్చితంగా ఆసమయంలో ఏంటి ఇలా అని తప్పుగా అనుకుంటారు. క్రియేటివిటీ ఉండాలి కానీ, అది హద్దులు దాటడం వల్ల ఖచ్చితంగా తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. సెలబ్రిటీలను ఏఐ ఉపయోగించి మరింతగా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని జాన్వీ కపూర్ అభిమానులు సైతం కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ మధ్య కాలంలో ఏఐ ను ఉపయోగించి చాలా ప్రయోజనాలు పొందుతున్నారు. కానీ కొందరు మాత్రం ఇలా తప్పుడు పనులకు ఉపయోగిస్తున్నారు. ఏఐ అనేది ఇష్టానుసారంగా వాడకుండా కూడా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రతి విషయాన్ని పరిశీలిస్తున్నారు అనే విషయంను ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536